జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | గురువారం 26 ఫిబ్రవరి 2026 | సంపుటి: 18 | సంచిక: 352 | పేజీలు: 12 | వెల: రూ.5 | RNI No : TELTEL/2008/24799

విశ్వావసు నామ సంవత్సరం , మాఘ మాసము , తిథినవమి - 26:43:29 వరకు నక్షత్రంరోహిణి - 13:39:33 వరకు కరణంబాలవ - 15:48:35 వరకు, కౌలవ - 26:43:29 వరకు పక్షంశుక్ల యోగంవిష్కుమ్భ - 25:28:17 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## జార్ఖండ్ సిఎం సోరెన్‌కు సుప్రీంలో ఉపశమనం

ఇడి కేసులపై స్టే ఇస్తూ ఆదేశాలు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి25(ప్రజాజ్యోతి): జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు సుప్రీంకోర్టులో ఉపశమనం లభించింది. సోరెన్‌పై మనీలాం డరింగ్ చట్టం కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్

మిగతా1 2లో..

## 8వ తరగతి పాఠ్యాంశంలో 'న్యాయవవస్థలో అవినీతి'


పాఠ్యాంశంపై తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు
వెంటనే తొలగిస్తామని ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి25(ప్రజాజ్యోతి): ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యాంశంలో 'న్యాయవవస్థలో అవినీతి' అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు సీరియస్ కావడంతో కేంద్రం

మిగతా 2లో..

# గతం కన్నా ధృడంగా అమెరికా ఆర్థిక వృద్ధి

- దేశాన్ని మరింత ధృడంగా నిర్మించడమే లక్ష్యం
- సాదాసీదా స్థాయి నుంచి సుదృఢ అమెరికాను నిర్మించా
- పౌరుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నాం
- ఇరాన్ అణు కార్యాక్రమాలతో అప్రమత్తంగా ఉన్నాం
- తన పాలనా ప్రయాణం యుగాలకు మలుపు
- స్టేట్ ఆఫ్ ది యూనియన్ కార్యక్రమంలో ట్రంప్



వాషింగ్టన్, ఫిబ్రవరి 25(ప్రజాజ్యోతి): అమెరికా గతంలో కన్నా దృఢంగా, మెరుగ్గా, సుసంపన్నంగా మారిందని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇది అమెరికాకు స్వర్ణయుగం అని ఆయన వెల్లడించారు. మంగళవారం స్టేట్ ఆఫ్ ది యూనియన్ కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ.. ఇది చారిత్రాత్మక కాలంగా అభివర్ణించారు. తన పరిపాలన ప్రయాణం.. యుగాలకు మలుపుగా ఉ ంటుందని తెలిపారు. దేశ ఆర్థికాభి వృద్ధి పరుగులు పెడుతుందన్నారు. భవిష్యత్తులో దేశాన్ని మరింత మెరుగు పరుస్తామని ట్రంప్ విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే జాతీయ పునరుజ్జీవం, ఆర్థిక వృద్ధితోపాటు ప్రపంచ ప్రభావంపై దృష్టి సారించినట్లు డొనాల్డ్ ట్రంప్ వివరించారు. ప్రపంచ స్థాయిలో అమెరికా మెరుగుపడిందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల వరకు అమెరికా సాదాసీదాగా ఉ ండేదని.. కానీ ప్రస్తుతం ప్రపంచంలోనే అగ్ర భాగాన నిలిచిందని

మిగతా 2లో..

# ఎప్‌స్టీన్‌ను కలవడం తప్పే!!

- రష్యన్ అమ్మాయిలతో సంబంధాలు నిజమే
- అయినా తానెలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడలేదు
- మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ ఆవేదన

న్యూయార్క్,ఫిబ్రవరి25(ప్రజాజ్యోతి): మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకులు బిల్ గేట్స్ మరోసారి వార్తల్లో నిలిచారు. అమెరికా కోర్టు ఇటీవల విడుదల చేసిన జెఫ్రీ ఎప్‌స్టీన్ పత్రాల్లో బిల్ గేట్స్ పేరు ఉండటం తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ విషయమై ప్రపంచ టెక్ దిగ్గజం గేట్స్ మరోసారి స్పష్టత ఇచ్చారు. ఇప్పటికే ఎప్‌స్టీన్‌తో తనకున్న సంబంధాలపై స్పందించిన ఆయన.. తాజాగా ఆ రహస్య ఫైళ్ల గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా గేట్స్ ఫౌండేషన్ సిబ్బందికి క్షమాపణలు చెప్పారు. కానీ తాను ఏనాడూ చట్టవిరుద్ధ పనులు చేయలేదని పేర్కొన్నారు. లైంగిక నేరగాడు ఎప్‌స్టీన్‌తో

మిగతా 12లో..



# ఏం తేలనుంది?

## స్పీకర్ కోర్టులో మరో ఇద్దరి భవితవ్యం

### కడియం, దానంలపై తుది విచారణ
### 27,28 తేదీల్లో విచారణకు సిద్ధం



తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల వ్యవహారం కీలక దశకు చేరుకొన్నది. ఇప్పటికే 8మంది విషయంలో స్పీకర్ స్పష్టమైన తీర్పును ఇచ్చారు. వీరు పార్టీ మారినట్లుగా ఆధారాలు లేవని స్పీకర్ తీర్పును ఇచ్చారు. ఇప్పుడు మరో ఇద్దరు ఎమ్మెల్యేల వ్యవహారాన్ని తేల్చబోతున్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం దాఖలైన అనర్హత పిటిషన్లపై విచారణ జరిపేందుకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఈ నెల 27, 28 తేదీల్లో పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న దానం నాగేందర్, కడియం శ్రీహరి విచారణకు తమ వాదనలను వినిపించడంతోపాటు సాక్ష్యాధారాలను సమర్పించాల్సి ఉ ంటుందని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. స్పీకర్ నేతృత్వంలోని ట్రిబ్యునల్ ఎదుట పిటిషనర్ల తరఫు న్యాయవాదులు అడిగే ప్రశ్నలకు దానం, కడియం సమాధానాలు ఇవ్వాల్సి ఉ ంటుంది. బీఆర్‌ఎస్ పార్టీ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరలేదని నిరూపించుకోవడానికి అవసరమైన ఆధారాలను సమర్పించాల్సి ఉంటుంది.

హైదరాబాద్,ఫిబ్రవరి 25(ప్రజాజ్యోతి): గత నెల 18న ఈ కేసులో పిటిషనర్ పాడి కౌశిక్‌రెడ్డిని దానం నాగేందర్ తరఫు న్యాయవాదులు ప్రశ్నించారు. 19న కడియం తరఫు లాయర్లు వివేకానందగౌడ్‌ను ప్రశ్నించారు. స్పీకర్ జారీచేసిన విచారణ షెడ్యూల్ ప్రకారం బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ నెల 27వ తేదీన ఉదయం 11:00 గంటలకు విచారణ ఉంటుంది. బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై మధ్యాహ్నం 12:00 గంటలకు విచారణ చేపడుతారు. 28వ తేదీన ఉదయం 11:00 గంటలకు బీఆర్‌ఎస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఉంటుంది. ప్రతివాది స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తరపున సాక్ష్యాధారాలను సేకరిస్తారు.

# ఉగ్రవాదంపై పోరులో ఇజ్రాయెల్‌కు పూర్తి అండ



### ఇజ్రాయిల్ పార్లమెంటులో ప్రధాని మోడీ ప్రసంగం

### రెండ్రోజుల పాటు పర్యటించనున్న మోడీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి25(ప్రజాజ్యోతి): భారత ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన నిమిత్తం ఇజ్రాయెల్ వెళ్లిన సంగతి తెలిసిందే. పర్యటనలో భాగంగా బుధవారం ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రసంగించిన తొలి భారత ప్రధాని తానేనని మోదీ అన్నారు. ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రసంగం గొప్ప గౌరవంగా భావి స్తున్నానని పేర్కొన్నారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసా గిస్తూ.. 'భారత్, ఇజ్రాయెల్.. ప్రాచీన నాగరికత కలిగిన దేశాలు. ఇజ్రాయెల్‌తో 140 కోట్ల భారతీయుల స్నేహం, గౌరవం, భాగస్వామ్యం ఉంది. ఉగ్రవాదంపై పోరులో ఇజ్రాయెల్‌కు పూర్తి అండగా

మిగతా 12లో..

## సొంత భవనాల్లో రెవెన్యూ కార్యాలయాలు

తహసిల్, ఆర్డీవో కార్యాలయాల నిర్మాణం
అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్, ఫిబ్రవరి25(ప్రజాజ్యోతి): ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శక పరిపాలన అందించాలనే లక్ష్యంతో తహసీల్దార్, ఆర్డీవో

మిగతా 12లో..

## మీడియా అకాడమీ ఛైర్మన్‌గా శ్రీనివాసరెడ్డి పదవీకాలం పొడిగింపు

హైదరాబాద్, ఫిబ్రవరి25(ప్రజాజ్యోతి): తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్‌గా కె. శ్రీనివాసరెడ్డి పదవీకాలం మరో రెండేళ్లు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ 24తో ఆయన పదవీకాలం ముగిసింది. దీంతో కొత్తవారిని నియమిస్తారని అంతా అనుకున్నారు. కానీ ప్రభుత్వం

మిగతా 12లో..

## తెలంగాణలో ఇంటర్ పరీక్షలు ప్రారంభం

క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపిన అధికారులు

- ఇంటర్ పరీక్షకు 17 నిముషాలు ఆలస్యం
- పరీక్షా కేంద్రానికి అనుమతించని అధికారులు
- కన్నీరు పెట్టుకున్న విద్యార్థిని శరణ్య



హైదరాబాద్,ఫిబ్రవరి 25(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. విద్యార్థులు వారికి కేటాయించిన పరీక్షా కేంద్రాలకు ఉ దయాన్నే చేరుకున్నారు. దీంతో ఎక్కడ చూసినా సందడి వాతావరణం నెల కొంది. పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులను ఆయా కళాశాలల సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమ య్యాయి. బుధవారం ఉదయం 9 గంటలకు ఫస్టియర్ పరీక్షలు ప్రారంభ మయ్యాయి. గురువారం నుంచి సెండియర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్ పరీక్షల కోసం రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 1495 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 9.97 లక్షల మంది పరీక్షలకు హాజరవుతున్నారు. ఇంటర్ పరీక్షలకు హాల్ టికెట్ ఉంటేనే

మిగతా 12లో..


## సీఎం రేవంత్‌తో అడోబ్ సీఈవో శంతన్ భేటీ



హైదరాబాద్,ఫిబ్రవరి 25(ప్రజాజ్యోతి): తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని అడోబ్ సీఈవో శంతను నారాయణ్ కలిశారు. హైదరాబాద్‌లో సీఎంతో ఆయన భేటీ అయ్యారు. తెలంగాణ రైజింగ్ బోర్డు సభ్యుడిగానూ శంతను కొనసాగుతున్న నేపథ్యంలో గ్లోబల్ ట్రెండ్స్, కొత్త అవకాశాలతో రేవంత్‌తో చర్చిం చారు. ఉద్యోగాలపై ఏఐ ప్రభావం, గ్రీన్ ఎనర్జీ, ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చ జరిగింది. ఏఐని సమర్థంగా వినియోగించుకునే విషయంపై శంతను నారాయణ్‌తో రేవంత్ చర్చించారు.

## ఆర్థిక మూలాలు పెంచేలా చేయాలి

- పశుసంవర్ధకశాఖను అభివృద్ధి పరచాలి
- కొత్త ఆలోచనలతోనే పశుసంవర్ధక శాఖలో మార్పులు
- బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- అధికారులతో మంత్రి వాకిటి శ్రీహరి సమీక్ష



హైదరాబాద్,ఫిబ్రవరి25(ప్రజాజ్యోతి): పాడి పరిశ్రమ పరిపూర్ణంగా ముందుకు సాగితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం అని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించేలా నివేదికలు తయారు చేయండని మంత్రి సూచించారు. ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వ పథకాలను రూపొందిం చాలన్నారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి

మిగతా 2లో..

# సంపాదకీయం

## నాలగేళ్లయినా ముగియని ఉక్రెయిన్ సంక్షోభం !

ప్రపంచంలో ఏ యుద్ధాలను తీసుకున్నా నష్టపోతున్నది ప్రజలే. ఆయా దేశాలు ఆర్థికంగా నష్టపోతున్నాయి. ప్రపంచ దేశాలను నష్టాల కుంపట్లో పడేస్తున్నాయి. రష్యా,ఉక్రెయిన్ యుద్ధం మొదలై నాలుగేళ్లు దాటింది. ఎందుకు యుద్ధం మొదలు పెట్టారో తెలియడం లేదు. అలాగని ముగింపు కూడా పలకడం లేదు. ఈ రావణ కాష్టం ఇప్పట్లో చల్లారేలా లేదు. అగ్రరాజ్యం తలచుకుంటే అంతే సంగతులని రష్యా నిరూపిస్తే... అమెరికా దానిని నిజం చేసింది. రష్యా బాటలోనే అమెరికా కూడా అడపాదడపా దాడులతో ప్రపంచాన్ని గుప్పిట పెట్టుకోవాలని చూస్తోంది. ట్రంప్ అధికారంలోకి వచ్చాక భౌతిక దాడులతో పాటు, ఆర్థిక దాడులతో ప్రపంచాన్ని బెంబేలెత్తిస్తున్నారు. ఇకపోతే ఒకప్పటి సోవియట్ యూనియన్‌లోని ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ చేష్టల కారణంగా రష్యాతో కయ్యానికి దిగారు. పుతిన్, ఎలన్‌స్కీ ఇద్దరూ బాగానే ఉన్నారు. కానీ ఇరు దేశాల ప్రజలు తీరని సంక్షోభంలో కూరుకు పోయాయరు. వేలాదిమంది మృత్యువాత పడ్డారు. ఫిబ్రవరి 24వ తేదీతో ఉక్రెయిన్ యుద్ధం ఐదెయేట ప్రవేశించింది. దీనికి బాధ్యులైన నాటో కూటమి దేశాలు ఎలా, ఎప్పుడు ముగింపు పలుకుతాయో తెలియటం లేదు. నిజానికి ట్రంప్ కూడా ముగింపు చేసే సాహసం జరగడం లేదు. యుద్ధాలకు నేను ముగింపు పలుకుతున్నానని బీరాలు పలికిన ట్రంప్ ఈ యుద్ధాన్ని కూడా ఆపుతానని చెప్పినా, ఆ పని చేయలేక పోయారు. ఉక్రెయిన్ తాజా సంక్షోభానికి నాలుగేళ్లు నిండినప్పటికీ నిజానికి 2014 నుంచి ఈ అంతర్యుద్ధం కొనసాగుతున్నది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఐరోపా ఖండంలో దీర్ఘకాలం సాగిన పోరుగా ఇప్పటికే చరిత్రలో ఉక్రెయిన్ సంక్షోభం నమోదైంది. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రపంచం మీద ప్రభావం చూపుతున్నది. ఏ దేశం కూడా ఎదుర్కోని తీవ్రమైన ఆంక్షలను రష్యా మీద నాటో కూటమి దేశాలు అమలు చేస్తున్నాయి. రష్యాతో వాణిజ్య లావాదేవీలు నిర్వహించే భారత్ తదితర దేశాల మీద కూడా అపరాధ పన్నుల విధింపు, ఇతర చర్యలు తీసుకుంటామని అమెరికా బెదిరిస్తున్న సంగతి తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనకుండా చేసిన ట్రంప్ ఎలా పెత్తనం సాగిస్తున్నాడో గమనించవచ్చు. ఇప్పటి వరకు ఉక్రెయిన్ పోరులో రెండు దేశాలకు జరిగిన నష్టాల గురించి పరస్పరం అతిశయోక్తులు తప్ప నిజానిజాలు వెల్లడి కావటం లేదు. రెండు వైపులా 20 లక్షల మంది సైనికులు గాయపడటం లేదా మరణించి ఉంటారన్నది ఒక అంచనా. పన్నెండున్నర లక్షల మంది రష్యన్లు మరణించి నట్లు ఉక్రెయిన్ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే సిఎస్ఐఎస్ అనే సంస్థ 3.25 లక్షల మంది మరణించటంతో సహా పన్నెండు లక్షల మంది రష్యా వైపు బాధితులు ఉన్నట్లు చెబుతున్నది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఏ పోరులోనూ ఇంత నష్టం జరగలేదు. తమకు వ్యతిరేకంగా నాటో విస్తరణ పేరుతో ఉక్రెయిన్‌కు సభ్యత్వ మిచ్చి తమ ముంగిటకు అణ్వాయుధాలను మోహరించాలన్న అమెరికా ఎత్తుగడలను వమ్ము చేస్తూ గతంలో తన ప్రాంతంగా ఉన్న క్రిమియా ద్వీపాన్ని రష్యా ఆ ఏడాది విలీనం చేసుకుంది. ఉక్రెయిన్ పాలకులు అప్పటి నుంచి రష్యన్లు మెజారిటీగా ఉన్న తమ డాన్‌బాస్ ప్రాంతంపై దాడులకు మిలిటరీని దించారు. దానికి వ్యతిరేకంగా ఆ ప్రాంతంలో తలెత్తిన తిరుగుబాటుకు రష్యా మద్దతు ఇచ్చింది. సైనిక చర్య ప్రారంభించి నప్పటి నుంచి నాలుగేళ్ల కాలంలో 26 శాతం ఉక్రెయిన్ ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మెల్లమెల్లగా కొత్త ప్రాంతాలకు చొచ్చుకుపోతున్నది. ఈ నాలుగేళ్ల యుద్ధ పర్యవసానాలను పరిశీలిస్తే ఇది అంత తేలికగా ముగిసేలా లేదు. పుతిన్ కూడా వదిలేలా లేరు. ఇప్పుడున్న యథాతథ స్థితిలో పోరు ముగించటానికి తాము సిద్ధమేనని, అయితే డాన్‌బాస్ తూర్పు ప్రాంతంలో తమ మిలిటరీ అక్కడే ఉండాలని జెలెన్‌స్కీ పట్టుబడుతున్నాడు. ఉక్రెయిన్ తిరుగుబాటు ప్రాంతాలకు స్వాతంత్ర్యం ఇవ్వాలని, దాని మిలిటరీ బలం, ఆయుధాలను పరిమితం చేయాలని, మరేదేశ మిలిటరీ ఏ రూపంలోనూ ఉక్రెయిన్ గడ్డ మీద ఉండకూడదని పుతిన్ పునరుద్ఘాటిస్తున్నాడు. అయితే అమెరికా ప్రభావంలో ఉన్న జెలెన్‌స్కీ మాత్రం పాత సోవియట్ బంధాన్ని మరచి వ్యవహరించడమే యుద్ధానికి హేతువుగా గుర్తించాలి. ప్రస్తుతం రష్యా ఆధీనంలో ఉన్న ప్రాంతం పారిశ్రామికంగా, మిలిటరీ రవాణాకు కీలకమైన రైల్వేలు, రోడ్లు ఈ ప్రాంతంలోనే ఉన్నందున వాటిని వదులుకొనేందుకు పుతిన్ సిద్ధంగా లేడు. ఇకపోతే దాడుల కారణంగా ఉక్రెయిన్ జనాభా 4.2 కోట్ల మందిలో నాలుగో వంతు మంది ఇతర దేశాలకు తరలిపోయినట్లు చెబుతున్నారు. రష్యా ఆధీనంలోని ప్రాంతాలలో 50 లక్షల మంది నివశిస్తున్నారు. క్రిమియాతో సహా 26 శాతం భూ భాగాన్ని ఉక్రెయిన్ కోల్పోయింది. అయితే జెలెన్‌స్కీ దళాలు తిరిగి స్వాధీనం చేసుకున్న ప్రాంతాలను తీసి వేస్తే ఆ మొత్తం 20 శాతానికి తగ్గినట్లు మరొక అంచనా. గత మూడు సంవత్సరాల్లో పెద్దగా రష్యన్లు ముందుకు పోలేదని మరి కొందరు చెబుతున్నారు. రష్యా సైనిక చర్య ప్రారంభం నుంచి నాలుగేళ్లలో ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా నష్టపోయింది. రష్యా ప్రధాన కేంద్రీకరణ మౌలిక సదుపాయాలను నాశనం చేయటం, ఆర్థిక మూలాలను దెబ్బ తీయటంపైనే కొనసాగుతున్నది. విద్యుత్ సరఫరా తీవ్రంగా దెబ్బతిన్న కారణంగా ఫ్యాక్టరీలను నడిపేందుకు డీజిల్ జనరేటర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి. మిలిటరీ చర్య ప్రారంభించిన తొలి రోజుల్లో పుతిన్ యంత్రాంగం వేసిన అంచనాలు దెబ్బతిన్నాయి. నాటో కూటమి దేశాలు ఉక్రెయిన్‌కు అవసరమైన ఆయుధాలు, ఆర్థిక సాయంతో పాటు రష్యన్ మిలిటరీ కదలికల గురించి కీలకమైన సమాచారాన్ని అందించటంతో తీవ్రమైన ఎదురుదెబ్బలు తగిలాయి. దాంతో వ్యూహం మార్చు కోవాల్సి వచ్చింది. కొన్ని వారాల్లో కీవ్ పతనం అవుతుందన మాస్కో అంచనాలు తప్పాయి. రష్యా కోరిన విధంగా కొంత ప్రాంతాన్ని కోల్పోయి ఒప్పందం చేసుకుంటే సరే లేకపోతే ఉక్రెయిన్ గెలిచే అవకాశాలు లేవని డోనాల్డ్ ట్రంప్ గతేడాది నవంబరులో బహిరంగంగానే చెప్పాడు. గతేడాది ఇరాన్ మీద దాడులు, మరోసారి హెచ్చరికలు, వెనిజులా అధ్యక్షుడిని అపహరించిన డోనాల్డ్ ట్రంప్ రష్యా మీద చర్యకు ఎందుకు వెనకాడుతున్నట్లు అని కొందరు విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. రష్యా మీద ఎన్ని ఆంక్షలు విధించినప్పటికీ అవి పనిచేయటం లేదని ట్రంప్‌కు అర్థమైంది. మొత్తానికి ఈ రావణ కాష్టం చల్లారేలా లేదు. ఇరు దేశాలు కూర్చుంటేనే సయోధ్య కుదరగలదు. అమెరికాలాంటి దేశాలు, నాటో జోక్యం వల్లనే ఇది మరింత ముదిరిందన్న సుస్పష్టం.

# గతం కన్నా ధృడంగా అమెరికా ఆర్థిక వృద్ధి



మొదటిపేజీ తరువాయి..

ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం.. ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్‌ను పురుషుల హాకీ ఒలింపిక్స్ విజేత కానర్ హెల్లెబ్యూక్‌కు ప్రదానం చేయనున్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. గత తొమ్మిది మాసాల్లో అమెరికాలోకి ప్రవేశించిన అక్రమ వలసదారులు శాతం సున్నాకు చేరిందని పేర్కొన్నారు. 2028లో ఒలింపిక్స్‌కు అమెరికా వేదిక కానుందని ప్రకటించారు. ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రభుత్వాన్ని నిర్మిస్తున్నామని ప్రజలకు భరోసా ఇచ్చారు. పౌరుల సంక్షేమానికే తమ తొలి ప్రాధాన్యమన్నారు. బిగ్ బ్యూటిపుల్ బిల్‌తో అమెరికన్లకు ఉపశమనం కలిగిందన్నారు. అలాగే సరిహద్దు భద్రత, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా పూర్తిగా నిరోధించామని ట్రంప్ చెప్పారు. దేశంలోని ఆర్థిక అంశాల ను సైతం ఈ సందర్భంగా ట్రంప్ ప్రస్తావించారు. గ్యాస్ ధరలు తగ్గించామని.. ఆ తర్వాత అంటే.. మూడు నెలల్లో యూఎస్ ఆర్థిక వ్యవస్థ పుంజుకుందన్నారు. తమ కొత్త స్నేహితుడు, భాగస్వామి అయిన వెనిజులా నుంచి 80మిలియన్ బ్యారెళ్ల చమురును తీసుకున్నామని ఆయన వివరించారు. ఇదంతా ఆ దేశ నాయకుడు నికోలస్ మదురోను పదవీచ్యుతుడిని చేసిన నాటినుంచి నేటివరకు ఇది చోటు చేసుకుందన్నారు. దాంతో అమెరికా చమురు ఉత్పత్తి రోజుకు 60 వేల బ్యారెళ్ల మేర పెరిగిందని సోదాహరణగా వివులీకరించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో చేసిన ప్రతిజ్ఞ.. డ్రిల్, బేబీ, డ్రిల్‌ను ట్రంప్ ఉటంకించారు. వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ హిల్‌లో ఉభయసభలను ఉద్దేశించి ఆయన అతి సుదీర్ఘ ప్రసంగం చేశారు. సుమారు గంటా 50 నిమిషాల పాటు ట్రంప్ మాట్లాడారు. తన ప్రసంగాల్లో ఇదే అతిసుదీర్ఘమైందిగా రికార్డుకెక్కింది. 2000 సంవత్సరంలో అప్పటి అధ్యక్షుడు బిల్ క్లింటన్ అత్యధికంగా 90 నిమిషాల పాటు మాట్లాడారు.

ఇప్పుడు ఆ రికార్డును ట్రంప్ బ్రేక్ చేశారు. గత ఏడాది మార్చిలో కూడా ట్రంప్ సుమారు 100 నిమిషాల పాటు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన విషయం తెలిసిందే. ట్రంప్ తన ప్రసంగంలో ఎక్కువగా ఆర్థిక ఎజెండా గురించి ప్రస్తావించారు. ఇక ఇరాన్ అంశంలో వార్నింగ్ ఇచ్చారు. వాస్తవానికి ఆ సమస్యను దౌత్యం ద్వారా పరిష్కరించేందుకు ఇష్టపడుతున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. కానీ అణ్వాయుధాలను సమీకరిస్తున్న ఇరాన్ వైఖరిని మాత్రం ట్రంప్ ఖండించారు. న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్‌ను ఇరాన్ విరమించుకోవాలన్నారు. అమెరికాను తాకే క్షిపణులను ఇరాన్ డెవలప్ చేస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. కానీ దీనిపై ఆయన తన ప్రసంగంలో ఎటువంటి ఆధారాలను బయటపెట్టలేదు. యురోప్‌కు ప్రమాదంగా మారే కొన్ని మిస్సైల్స్‌ను ఇప్పటికే ఇరాన్ డెవలప్ చేసిందన్నారు. ఇతర దేశాల్లో ఉన్న అమెరికా బేస్‌లను కూడా టా÷-గ్గ÷ట్ చేసే రేంజ్ ఇరాన్‌కు ఉందన్నారు. ఇక అమెరికా భూభాగానికి చేరుకునే స్థాయికి తగ్గ క్షిపణులను కూడా ఇరాన్ అభివృద్ధి చేస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. మిడిల్ ఈస్ట్‌పై ట్రంప్ ఎక్కువగా ఫోకస్ చేయడం వల్ల.. ఇరాన్‌తో యుద్ధానికి ఆ దేశం సిద్ధం అవుతుందేమో అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే తాము ఇచ్చిన డిమాండ్లను ఒకవేళ ఇరాన్ అంగీకరించకపోతే, అప్పుడు ట్రంప్ అనుకున్నంత పనిచేసే అవకాశాలు ఉన్నాయి. గత ఏడాది ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలపై దాడి చేశామని, ఆ దాడి వల్ల ఆ దేశ న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్ స్తంభించినట్లు ట్రంప్ చెప్పారు. న్యూక్లియర్ వెపన్ అంశంలో ఇరాన్ ఇంకా ఎటువంటి హామీ ఇవ్వలేదన్నారు. అణ్వాయుధాలను తయారు చేయమన్న వ్యాఖ్యలు ఇంకా ఇరాన్ నుంచి రావడం లేదన్నారు.



# ఆర్థిక మూలాలు పెంచేలా చేయాలి



మొదటిపేజీ తరువాయి..

హర్యానా, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల మోడల్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పశుసంవర్ధక, పాడి పరిశ్రమలో ఏం చేస్తే సక్సెస్ అవుతామో అధ్యయనం చేయాలన్నారు. ఆరోగ్యకరమైన తెలంగాణను నిర్మిస్తేనే భవిష్యత్ బాగుంటుందని, అందుకోసం స్వచ్ఛమైన పాలు, బలమైన పోషకాలు ఉన్న చికెన్, మటన్, చేపల ఉత్పత్తి చేయాలన్నారు. ఉన్నతాధికారులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ బాధ్యతతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. ఆర్థిక స్వావలంబన లభించే పథకాలను రూపొందించి అమలుచేద్దాం అని అన్నారు. తెలంగాణకు ఆర్థిక మూలాలు పెంచేలా పశుసంవర్ధకశాఖను అభివృద్ధి పరచాలని మంత్రి వాకిటి శ్రీహరి అధికారులకు దిశానిర్ధేశర చేశారు. . కొత్త ఆలోచనలతోనే పశుసంవర్ధక శాఖలో మార్పులు తీసుకురాగలమని మంత్రి వాకిటి శ్రీహరి ఆశాభావం వ్యక్తం చేశారు. పాడి పరిశ్రమ పరిపూర్ణంగా ముందుకు సాగితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని వివరించారు. బడ్జెట్‌లో నిధులు ఎన్ని కేటాయించారనేది కాకుండా ఎంతమేరకు ఖర్చు చేశామనే ఆలోచన చేసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. బ్జడెట్ లో అధిక నిధులు కేటాయించేలా నివేదికలు తయారు చేయాలని అధికారులను మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు. ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వ పథకాలను రూపొందించాలని మంత్రి సూచించారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి హర్యానా, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల మోడల్‌ను ఆదర్శంగా తీసుకొని రాష్ట్రంలో పథకాలను డిజైన్ చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. పశుసంవర్ధక, పాడి పరిశ్రమలో ఏం చేస్తే సక్సెస్ అవుతామో అధ్యయనం చేయాల్సిన అవసరముందన్నారు. ఆరోగ్యకరమైన తెలంగాణను నిర్మిస్తేనే భవిష్యత్ బాగుంటుందని మంత్రి వాకిటి శ్రీహరి అభిప్రాయపడ్డారు. అందుకోసం స్వచ్ఛమైన పాలు, బలమైన పోషకాలు ఉన్న చికెన్, మటన్, చేపల ఉత్పత్తి రాష్ట్రంలో జరుగాలని మంత్రి శ్రీహరి అన్నారు. ఉన్నతాధికారులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ బాధ్యతతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని మంత్రి వాకిటి స్పష్టం చేశారు.పాడి రంగానికి సంబంధించి అన్ని అంశాలు బ్జడెట్‌లో పొందుపరచాలని, పాల ఉత్పత్తి, అందుకావాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి శ్రీహరి అన్నారు. పాడి పరిశ్రమ బలోపేతం, సమన్వయం కోసం ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించుకోవాలని, దానివల్ల పాల ఉత్పత్తిని పెంచుకోవొచ్చని మంత్రి వాకిటి శ్రీహరి ఆశాభావం వ్యక్తం చేశారు. వెటర్నరీ సంస్థల్లో మౌలిక సదుపాయాలు, ఉద్యోగుల సంక్షేమం వంటి అంశాలకు కూడా బ్జడెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం పశువులకు టీకాలు, ఔషధాల సరఫరా జరిగేలా, దానికి బ్జడెట్‌లో కేటాయింపులు ఉండాలని అధికారులకు మంత్రి వివరించారు. గతంలో లాగా కాకుండా పశుసంవర్ధక శాఖను బలోపేతం చేయాలని మంత్రి అధికారులకు వివరించారు. ఈసమీక్ష సమావేశంలో రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్య శాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్ ఈంఅ, డైరెక్టర్ గోపీ, డెయిరీ డెవలంప్‌మెంట్ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, పివి నర్సింహారావు వెటర్నరీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డా.జ్ఞానప్రకాశ్, ఉన్నతాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జార్ఖండ్ సిఎం సోరెన్‌కు సుప్రీంలో ఉపశమనం

మొదటిపేజీ తరువాయి..

చేపట్టిన క్రిమినల్ ప్రొసీడింగ్స్‌పై అత్యున్నత న్యాయస్థానం స్టే ఇచ్చింది. కేసు కొట్టేయాల్సిందిగా కోరుతూ సోరెన్ వేసిన పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని సీజేఐ సూర్యకాంత్, న్యాయమూర్తులు జోయ్మాల్యా బాగ్చి, విపుల్ ఎం పంచోలితో కూడిన ధర్మాసనం ఈడీని అదేశించింది. పదేపదే తనకు ఈడీ సమన్లు జారీ చేస్తుండటాన్ని కూడా సోరెన్ తన పిటిషన్‌లో సవాలు చేశారు. ఈకేసులో విచారణ దాదాపు పూర్తి కావచ్చిందని, ఏడుసార్లు సమన్లు జారీ చేస్తే ఒక్కసారి కూడా సోరెన్ హాజరుకాలేదని విచారణ సందర్భంగా ఈడీ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. అయితే సోరెన్ తరఫు హాజరైన సీనియర్ న్యాయవాది ఆ వాదనను తోసిపుచ్చారు. సోరెన్ మూడుసార్లు హాజరయ్యారని, ఈడీ ఆయనను అరెస్టు కూడా చేసిందని చెప్పారు. తమ పిటిషన్‌ను మెజిస్ట్రేట్ పరిగణనలోకి తీసుకున్న ఏడాది తర్వాత ఆలస్యంగా సోరెన్ క్వాషింగ్ పిటిషన్ వేసినట్టు ఈడీ తరఫు న్యాయవాది వాదించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, ఈడీ బల్క్ కంప్లయింట్లు చేసినట్టు వార్తాపత్రికలో చదివామని, ఫిర్యాదులపై దృష్టిసారించడం కంటే నిర్మాణాత్మక ఫలితాలతో ముందుకు రావాలని ఈడీకి సూచించింది. సోరెన్‌కు భూముల కుంభకోణంలో ప్రమేయం ఉందని ఈడీ ప్రధాన ఆరోపణగా ఉంది. ఈ కేసును కొట్టివేయాలని సోరెన్ వేసిన పిటిషన్‌ను జనవరి 15న హైకోర్టు కొట్టివేసింది. దీంతో తమ సమన్లకు స్పందించడం లేదంటూ ఈడీ ఫిర్యాదు చేసింది. దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్లడంతో ఈడీ క్రిమినల్ ప్రొసీడింగ్స్‌పై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది

# 8వ తరగతి పాఠ్యాంశంలో 'న్యాయవవస్థలో అవినీతి'

మొదటిపేజీ తరువాయి..

వెంటనే స్పందించింది. పాఠ్యాంశం లోని భాగాలను తొలగించేందుకు నిర్ణయించింది. పాఠ్యాంశంలో ఆవిధంగా వచ్చి ఉండాల్సింది కాదని, దీనికి బదులు స్ఫూర్తిదాయకమైన విషయాలను రాసి ఉండాల్సిందని కేంద్రం అభిప్రాయపడినట్టు ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి. ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యాశంలో న్యాయవ్యవస్థలో అవినీతి అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు బుధవారంనాడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారం న్యాయవాదులు, న్యాయమూర్తులందరినీ కలవరానికి గురి చేసిందని, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే ఊరుకునేది లేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. 'కొన్ని రోజులు ఆగండి. దీనిపై నేను సుమోటోగా విచారణ చేపడతాను' అని తెలిపారు. న్యాయవ్యవస్థలో అవినీతి గురించి 8వ తరగతి విద్యార్థులకు ఎన్‌సీఈఆర్‌టీ బోధిస్తోందని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సహా రాజకీయ నేతలు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతుంటే ప్రభుత్వాలు ఎందుకు దాచిపెడుతున్నాయని ప్రశ్నించారు. ఎంపిక చేసి మరీ న్యాయవ్యవస్థనే నిలదీస్తున్నట్టు కనిపిస్తోందని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి సైతం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్‌సీఈఆర్‌టీ ఇటీవల న్యాయవ్యవస్థ అనే అధ్యాయాన్ని విస్తరించింది. న్యాయవ్యవస్థలో ఉన్న అవినీతి అంశాన్ని తొలిసారిగా ప్రవేశపెట్టింది. విద్యార్థులు కేవలం సిద్ధాంత పరమైన అవగాహనకే పరిమితం కారాదని, వ్యవస్థలోని సవాళ్లు, లోపాలు, వాస్తవ పరిస్థితుల గురించి కూడా తెలుసుకోవాలనే లక్ష్యంతో ఈ మార్పులు చేసినట్టు చెబుతోంది. లక్షలాది కేసులు, విచారణలో జరుగుతున్న జాప్యం వంటి అంశాలను పాఠ్యాంశంలో ప్రస్తావించింది. అయితే పాఠ్యాంశంలో తాజా మార్పుల వల్ల చిన్నారులలో న్యాయవ్యవస్థపై ప్రతికూల భావన పెరగవచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# ప్రేమపేరుతో మోసం చేసిన యువకుడు

## బెయిల్ ఇచ్చేందుకు ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి25(ప్రజాజ్యోతి): ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన ఓ యువకుడికి ఢిల్లీ హైకోర్టు షాక్ ఇచ్చింది. ప్రియురాలిని మోసం చేసిన కేసులో అరెస్టైన అతడికి బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. ఢిల్లీకి చెందిన ఓ యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి ప్రియురాలితో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. ఆ తర్వాత జాతకాలు కలవలేదన్న సాకుతో పెళ్లికి నిరాకరించాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ప్రేమ పేరుతో మోసం చేశాడంటూ కేసు పెట్టింది. ఐపీసీ 376, బీఎన్‌ఎస్ సెక్షన్ 69 కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రియుడిని అరెస్ట్ చేశారు. అతడు బెయిల్ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు.

# డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్లు పెంచాలి: జర్నలిస్టు సంఘాల డిమాండ్

## –గన్ పార్కు నుంచి మీడియా అకాడమీకి ర్యాలీ –అకాడమీ ఎదుట బైఠాయించిన డెస్క్ జర్నలిస్టులు

హైదరాబాద్, ఫిబ్రవరి,25(ప్రజజ్యోతి): డెస్క్ జర్నలిస్టుల అక్రిడిటేషన్లు కార్డులను పెంచాలని,అర్హులైన డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులివ్వాలని పలు జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేశాయి. డెస్క్ జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ లోని గన్ పార్కు నుండి నాంపల్లి చాపల్ రోడ్డులోని మీడియా అకాడమీ వరకు జర్నలిస్టుల ర్యాలీ జరిగింది. అనంతరం జర్నలిస్టులు మీడియా అకాడమీ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్),టీయూడబ్ల్యూజే-143 సంఘాల నాయకులు పాల్గొని మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మీడియా అక్రెడిటేషన్ల విషయంలో ఘోర వైఫల్యం చెందిందని, రెండేండ్లు జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వలేక పోయిందని విమర్శించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని పోరాడి తెచ్చుకున్న పాత్రికేయులకు స్వరాష్ట్రంలో అన్యాయం జరిగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వరాష్ట్రంలో జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేవని, జర్నలిస్టు గర్తింపు కోసం రోడ్డెక్కి ఆందోళన చేయాల్సి దుస్థితి ఏర్పడిందని అన్నారు. గత ప్రభుత్వం 23 వేల అక్రెడిటేషన్ కార్డులిస్తే...ఈ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి 44 వేల కార్డులిస్తామని ప్రకటించిందని, అనేక కఠినమైన నిబంధనలు పెట్టి కార్డుల సంఖ్యను భారీగా తగ్గించే ప్రయత్నం చేస్తుందని అన్నారు. డెస్క్ జర్నలిస్టులకు గతంలో ప్రతి జిల్లాకు ఐదుగురికి అక్రిడిటేషన్ కార్డులు వచ్చాయని, ప్రస్తుతం ఎడిషన్ సెంటర్ కు కేవలం నాలుగు కార్డులు మాత్రమే ఇస్తామని నిబంధన పెట్టడం దారుణమని అన్నారు. డెస్క్ జర్నలిస్టులు ఎడిషన్ కేంద్రాలోనే పని చేస్తున్నప్పటికీ, ఏ జిల్లాకు ఆ జిల్లా డెస్కులు వేర్వేరుగా ఉంటాయని, ప్రతి జిల్లాకు ఒక ఇన్చార్జితో పాటు నలుగురు సబ్ ఎడిటర్లు పనిచేస్తుంటారని తెలిపారు. అదేవిధంగా ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేసే డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు 12 నుంచి 8కి తగ్గించారని, వారికి కూడా15 కార్డులు ఇవ్వాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు.టీయూడబ్ల్యూజే-143 కోశాధికారి యోగానంద్ మాట్లాడుతూ, అక్రెడిటేషన్ల మంజూరులో వివక్ష తగదని, జర్నలిస్టుల అక్రిడిటేషన్ల విషయంలో గందరగోళ పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గతంలో మాదిరిగానే జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, లేదంటే జర్నలిస్టు సంఘాలను కలుపుకొని సచివాలయ ముట్టడితో పాటు రాష్ట్రవ్యాప్త ఆందోళనకు వెనుకాడబో హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కో-కన్వీనర్ తన్నీరు శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి.రవికుమార్, కో-కన్వీనర్ బ్రహ్మం, డెస్క్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు ఉపేందర్, ప్రధాన కార్యదర్శి రాజారాం, నాయకులు వెంకటరమణ, ఎస్.వెంకటేష్, మహిళా జర్నలిస్టు పి. పద్మ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన బోథ్ -ఎమ్మెల్యే



**నేరడిగొండ ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి) :** నెరడిగొండ మండల కేంద్రానికి చెందిన బొంతుకుల లక్ష్మీ శ్రీను కుమార్తె వివాహం మండల కేంద్రంలో గల వారి నివాసంలో ఘనంగా జరిగింది. ఇట్టి వివాహానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయి నూతన వధూవరులను ఆశీర్వదించారు. వీరి వెంట సర్పంచ్ నీలిమ రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు రాథోడ్ సజన్, ప్రీతం రెడ్డి, మాజీ జడ్పీటీసీ పండరీ, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, సాబ్లే సంతోష్, రమేష్ తదితరులు ఉన్నారు.

# వందేళ్ళ కమ్యూనిస్ట్ మహాసభ గోడప్రతుల విడుదల

– సునారికారి రాజేష్ డివిజన్ కార్యదర్శి సిపిఐ (ఎంల్)న్యూడెమోక్రసీ



**ఖానాపూర్ ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి) :** ఫిబ్రవరి 27న హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞానకేంద్రంలో కమ్యూనిస్ట్ మహాసభ జరిగి వంద సంవత్సరాలు పూర్తి అయినా సందర్భంగా సిపిఐ (ఎం.ఎల్)న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సభను జయప్రదం చేయాలనీ కోరుతూ ఖానాపూర్ పట్టణంలోని విశ్రాంతి భవనంలో గోడ ప్రతులను విడుదల డివిజన్ కార్యదర్శి సోనాలికార్ రాజేష్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశం ఒక అర్ధ వలస, అర్ధ బుస్వామ్య వ్యవస్థ అని, దీనిని కూల్చివేసి నూతన వ్యవస్థ ఏర్పాటు చేయడం కోసం విప్లవ పందా మార్గం లో కమ్యూనిస్ట్ నాయకులు అందరూ కలిసి నూతన నాయకత్వం ఏర్పాటు చేసుకోవడానికి ఒక మహాసభ ఏర్పాటు చేసారూ అని, ఆ మహాసభ ఏర్పడి వందేళ్ళు పూర్తి అయినా సందర్బంగా హైదరాబాద్ లో సభ ను న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తుందని, దీనిని విజయవంతం చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఐఎఫ్టియుజిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం లింగన్న, డివిజన్ నాయకులు ఆడేపు గణేష్, పి ఓ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు మల్లక్క, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు గోనే స్వామి, ఉపాలి, గూట్ల ప్రసాద్, కుడుదుల రాజేష్, మాన్క శ్రీనివాస్ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఇస్తారి, తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న కొత్త సర్పంచుల శిక్షణ తరగతులు



**ఖానాపూర్ ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి) :** ఇటీవల నూతనంగా ఎన్నికైన జిల్లా సర్పంచులకు మండలాల వారిగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు డిఎల్పిఓ లింగయ్య తెలిపారు నిర్మల్ జిల్లా కేంద్రంలోని మహిళా ప్రాంగణంలో ఖానాపూర్ లక్ష్మణ చందా మండలాలకు చెందిన సర్పంచ్లకు శిక్షణ ఇస్తున్నారు . రెండవ రోజు జరిగిన ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మండల పంచాయతీ అధికారి చిక్యాల రత్నాకర్ రావు తో పాటు శ్రీనివాస్ నసీరుద్దీన్ ఆపరేటర్ సాగర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఝురి-పునా గూడ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు



**అదిలాబాద్ టౌన్, ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి) :** అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఝురి -పునాగూడ బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల కోసం బుధవారం రోజు ప్రత్యేకంగా మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా తలమడుగు మండలం సబ్ ఇన్ స్పెక్టర్ (ఐ×) రాధిక హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. పిల్లలు పదో తరగతి అయిన తర్వాత వాళ్లకు ఏ సబ్జెక్టు ఇష్టం ఉంటే ఆ సబ్జెక్టు ను ఎంచుకోవాలని, చదువును కష్టంగా కాకుండా ఇష్టంతో చదవాలని, కష్టపడి చదివితే మంచి మార్కులు వచ్చి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు అని అన్నారు. పిల్లలు మానసిక ఒత్తిడికి గురికాకుండా చదువుతోపాటు వ్యాయామం చేయాలని, సంకల్పబలంతో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సరస్వతి పి జి హెచ్ ఎం ,ఫిజికల్ డైరెక్టర్ రాథోడ్ శ్రీనివాస్, కిషన్, సాంబన్న, బొజ్జ రెడ్డి, పోతన్న, గంగయ్య, ధర్మేందర్, కమలాకర్, ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

– తొలిరోజు 95.70 శాతం హాజరు – పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అభిలాష అభినవ్







**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 25, (ప్రజాజ్యోతి) :** జిల్లా వ్యాప్తంగా బుధవారం ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు అత్యంత కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.

పరీక్షల తొలిరోజు జిల్లాలో 95.70 శాతం హాజరు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. నిర్మల్ పట్టణంలోని శాంతినగర్‌లో గల ప్రభుత్వ జూనియర్ బాలబాలికల కళాశాలలోని పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పరీక్ష గదులను సందర్శించి, విద్యార్థులకు కల్పించిన వసతులను పర్యవేక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వెబ్ కాస్టింగ్ ద్వారా నిరంతరం నిఘా ఉంచాలని సూచిస్తూ, పరీక్ష కేంద్రాల్లోని సీసీ కెమెరాల పనితీరును స్వయంగా పరిశీలించారు. జిల్లాలో మొదటిరోజు పరీక్షకు మొత్తం 7,076 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, వారిలో 6,772 మంది (95.70%) హాజరయ్యారు. వివిధ కారణాల వల్ల 304 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు ధృవీకరించారు. కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డిఐఈఓ) పరశురాం, తహసీల్దార్ రాజు, అధికారులు, తదితరులు ఉన్నారు.

# తక్కువ విలువ బాండ్ల కొరతతో ప్రజల ఇబ్బందులు అధికారులు స్పందించాలని విజ్ఞప్తి



**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి) :** ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో స్టాంప్ బాండ్ల కొరత ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ముఖ్యంగా 20, 30 విలువ కలిగిన నాన్‌జ్యుడీషియల్ బాండ్లు అందుబాటులో లేకపోవడంతో రోజురోజుకు ఆరోపణలు తీవ్ర మవుతున్నాయి. దీంతో సాధారణ ప్రజలు అల్లాడిపోతున్నారు. చిన్న చిన్న అవసరాల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టులు, రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, నోటరీల వద్దకు వచ్చే వారికి ఈ సమస్య మరింత భారంగా మారింది.సాధారణంగా అఫిడవిట్లు, అద్దె ఒప్పందాలు, ధృవీకరణ పత్రాలు, విద్యార్థుల సర్టిఫికెట్ పనులు, చిన్నచిన్న ఒప్పందాల కోసం ?20 లేదా ?30 బాండ్ సరిపోతుంది. అయితే ప్రస్తుతం ఆ విలువ గల బాండ్లు స్టాంప్ విక్రయ కేంద్రాల్లో లభ్యం కాకపోవడంతో, ప్రజలు బలవంతంగా ?100 బాండ్ కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో "20 రూపాయల పని కోసం 100 రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఎందుకు? అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రోజూ డజన్ల కొద్దీ ప్రజలు స్టాంప్ విక్రయ కేంద్రాల వద్దకు వెళ్లి తిరిగి నిరాశతో వెళ్తున్నారు. కొందరు రెండు మూడు కేంద్రాలు తిరిగినా తక్కువ విలువ బాండ్లు దొరకకపోవడంతో చివరకు అధిక విలువ బాండ్ తీసుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. చిన్న వ్యాపారులు, కూలీ కార్మికులు ఈ పరిస్థితితో ఇబ్బందులు పడుతున్నారు. వారికి ప్రతి రూపాయి విలువైనదే కావడంతో అదనపు ఖర్చు భారంగా మారుతోంది. సాధారణ పనుల కోసం చిన్న మొత్తంలో బాండ్ ఉంటే సరిపోతుంది. కానీ అది లేకపోవడంతో వంద రూపాయల బాండ్ కొనాల్సి వస్తోంది. ఇది సామాన్యులపై అదనపు భారం అని వాపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయం లో ఒక చిన్న ధృవీకరణ కోసం వస్తే 20 రూపాయల బాండ్ ఉంటే సరిపోయేది. ఇప్పుడు 100 రూపాయలు పెట్టి కొనాల్సి వచ్చిందని ఆందోళన చెందుతున్నారు. స్టాంప్ విక్రేతలు మాత్రం తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని చెబుతున్నారు. సరఫరా లోపం వల్లే తక్కువ విలువ బాండ్లు అందుబాటులో లేవని వారు వివరిస్తున్నారు. పై స్థాయి అధికారుల నుంచి సరైన సరఫరా రాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని పేర్కొంటున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పటికీ సరఫరా తక్కువగా ఉండటమే సమస్యకు కారణమని అంటున్నారు.జిల్లా కేంద్రంలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే, మండల స్థాయిలో పరిస్థితి ఎలా ఉంటుందో అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ సేవలు పొందేందుకు వచ్చే ప్రజలకు ఇది ఒక చిన్న సమస్యలా కనిపించినా, వాస్తవానికి ఇది వారి ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా రోజువారీ ఆదాయంపై ఆధారపడే కూలీలకు అదనంగా ?70--?80 ఖర్చు పెట్టడం భారంగా మారుతోంది. న్యాయవాదులు, డాక్యుమెంట్ రైటర్లు కూడా ఈ సమస్యను చిన్న పనులకు పెద్ద విలువ బాండ్ వినియోగించడం అవసరం లేని ఖర్చు అని వారు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి తక్కువ విలువ గల బాండ్ల సరఫరాను పెంచాలని సూచిస్తున్నారు. అవసరమైన మేరకు స్టాక్‌ను జిల్లా కేంద్రానికి పంపించాలని కోరుతున్నారు. సామాన్యుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని స్టాంప్,రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సమస్యను పరిశీలించి తక్షణ పరిష్కారం చూపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. తక్కువ విలువ బాండ్లు సమృద్ధిగా అందుబాటులో ఉంటే ప్రజలకు ఉపశమనం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.చిన్న సమస్యలా కనిపిస్తున్నా, ఇది సామాన్యుల రోజువారీ జీవితానికి సంబంధించిన అంశం. ప్రభుత్వ కార్యాలయాల పనులు సజావుగా సాగాలంటే, అవసరమైన స్టాంప్ బాండ్లు అందుబాటులో ఉండటం అత్యంత ముఖ్యం. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సరఫరాను సక్రమం చేస్తారా లేదా అన్నది ఇప్పుడు ప్రజల దృష్టి కేంద్రంగా మారింది. సమస్య త్వరగా పరిష్కారం కావాలని జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్నారు.

# మంచిర్యాల జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం





**ప్రశాంతంగా కొనసాగింపు**

**మంచిర్యాల, 25, ఫిబ్రవరి (ప్రజాజ్యోతి) :** మంచిర్యాల జిల్లాలో బుధవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మార్గదర్శనంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేశారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లావ్యాప్తంగా 23 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అధికారుల వివరాల ప్రకారం

**ప్రథమ సంవత్సరం :** జనరల్ -- 5,372 మంది, వోకేషనల్ -- 888 మంది, ద్వితీయ సంవత్సరంలో జనరల్ -- 5,227 మంది, వోకేషనల్ -- 830 మంది, విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. మంచిర్యాల పట్టణంలోని ఆల్ ఫోర్స్ జూనియర్ కళాశాల, మిమ్స్ జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల సహా పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం పరీక్షలు రాయడానికి విద్యార్థులు ఉదయం 8 గంటలకే తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ముఖ్యంగా బాలికల విద్యార్థులను వారి తల్లిదండ్రులు స్వయంగా పరీక్షా కేంద్రాల వద్దకు తీసుకొచ్చారు. ఉదయం 8:30 నుంచి 9 గంటల లోపు పరీక్షా కేంద్రాలకు వచ్చిన విద్యార్థులను కేంద్రాధికారులు హాల్‌టికెట్లతో పాటు తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా హాలుల్లోకి అనుమతించారు. మొదటి రోజు ప్రథమ సంవత్సరం పరీక్షలు ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా ముగిశాయి. నేటి నుంచి (గురువారం) ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షా కేంద్రాల్లో త్రాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు, భద్రత వంటి అన్ని ఏర్పాట్లు చేయడంతో పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు.

### మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లకు

# టీఎన్జీవో ఘన సన్మానం





**మంచిర్యాల, 25, ఫిబ్రవరి (ప్రజా జ్యోతి) :** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన 14వ డివిజన్, 58వ డివిజన్ తొలి కార్పొరేటర్లుగా ఎన్నికైన తూముల నరేష్, మాదంశెట్టి సత్యనారాయణ లను టీఎన్జీవో మంచిర్యాల జిల్లా శాఖ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో కార్పొరేటర్లను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి ఘన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కార్పొరేటర్లతో చర్చించిన జిల్లా అధ్యక్షులు, ఉద్యోగులకు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు తూముల నరేష్, మాదంశెట్టి సత్యనారాయణ లు మాట్లాడుతూ, కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో తమ డివిజన్లను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇందుకు ఉద్యోగుల సహకారం ఎంతో అవసరమని అన్నారు. ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. దీనికి ప్రతిగా టీఎన్జీవో మంచిర్యాల జిల్లా శాఖ తరపున కార్పొరేటర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో టీఎన్జీవో మంచిర్యాల జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు, కోశాధికారి సతీష్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, రాంకుమార్, తిరుపతి అంజయ్య, కేజియా రాణి, పద్మలత, నరేందర్, శ్రీధర్ రాజు, సంయుక్త కార్యదర్శులు సునీత, ప్రభు, సురేందర్, రోశయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రావణ్, పబ్లిసిటీ సెక్రటరీ యూసుఫ్, స్పోర్ట్స్ సెక్రటరీ అనురాగ్, అలాగే మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్, కార్యదర్శి అజయ్ ప్రశాంత్, లక్షటిపేట యూనిట్ అధ్యక్షులు గొల్ల శ్రీనివాస్, బెల్లంపల్లి యూనిట్ అధ్యక్షులు వెంకటేష్, మందమర్రి యూనిట్ అధ్యక్షులు సుమన్, చెన్నూరు యూనిట్ అధ్యక్షులు అభిషేక్, కన్నెపల్లి యూనిట్ అధ్యక్షులు పద్మనాభం, జిల్లా కార్యవర్గ సభ్యులు పద్మజ, రాజేందర్, కుమార్, మోసిన్, ప్రణవానందు, సరిత తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# న్యూ వెల్మల్ సర్పంచ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు



**సోన్, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి) :** మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో బుధవారం సర్పంచ్ రాచకొండ సాగర్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పంచాయతీ సిబ్బంది వీధులలో పేర్కొన్న చెత్తను తొలగించి, మురుగు కాలువలను జేసీబీ సహాయం తో శుభ్రం చేశారు. సేకరించిన వ్యర్థలను డంపింగ్ యార్డ్ కు తరలించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్లపై చెత్త వేయవద్దని సర్పంచ్ సూచించారు.

# జీవో 25ను సవరించాలి

ఎస్సీ, ఎస్టీ, ఉపాధ్యాయ సంఘాల డిమాండ్



**ఖానాపూర్ ఫిబ్రవరి 25( ప్రజా జ్యోతి) :** దళిత గిరిజన ఉపాధ్యాయులకు ఇబ్బందులు కలిగిస్తున్న జీవో 25ను సవరించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి జిల్లాకు సంబంధించిన ఈ రెండు ఉపాధ్యాయ సంఘాల ముఖ్య కార్యవర్గ సభ్యుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు బుఖ్య రాజేష్ ఇందూరు, సుద్దాల రాజేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులకు ఇన్సూరెన్స్ ఇవ్వడానికి స్వాగతిస్తున్నామని అయితే 50% పిఆర్సిని ఫిట్మెంట్తో అమలు చేయాలని కోరారు హెల్త్ స్కీమ్ లో బేసిక్ పైనుంచి ఒక శాతం శాలరీ వేతనాలను డిడక్ట్ చేయకుండా ఉపాధ్యాయ సంఘాలతో చర్చించిన తర్వాతే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు జిపిఎఫ్ టీఎస్ జెఎల్ఐ తదితర బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు విశ్రాంత ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సందర్భంగా వెంటనే పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని కోరారు.

### పంట నష్టపోయిన రైతులను

# ప్రభుత్వం ఆదుకోవాలి


– బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**సోన్, ఫిబ్రవరి 25(ప్రజా జ్యోతి) :** సోన్ మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షాలు, వడగళ్ల వర్షంవల్ల నష్టపోయిన మొక్క జొన్న పంటను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు. మండలంలోని సోన్, కూచన్ పల్లి, బొప్పారం, న్యూ వెల్మల్ గ్రామాల్లో నేలకొరిగిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. సుమారు ఒక్క సోన్ మండలంలోనే 1000 ఎకరాల పైనే పంట నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీసారి నివేదికలు తెప్పించుకోవడం తప్ప ఇప్పటి వరకు ఏ ఒక్క రైతుకు కూడా నష్ట పరిహారం చెల్లించలేదని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నష్ట పోయిన ప్రతీ రైతును ఆదుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అనురాగ్ యూనివర్సిటీలో ఆడోల్సెసెంట్ వెల్నెస్ ట్రైనింగ్

– ఇంద్ర కుమార్‌కు సర్టిఫికేషన్



**మంచిర్యాల, 25, ఫిబ్రవరి (ప్రజాజోతి) :** హైదరాబాద్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో నిర్వహించిన ఆడోల్సెసెంట్ వెల్నెస్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో బెల్లంపల్లి పట్టణానికి చెందిన ఇంద్ర కుమార్ విజయవంతంగా శిక్షణ పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఆయనకు సర్టిఫికేషన్ అందజేశారు. ఈ సర్టిఫికేషన్‌ను ప్రసిద్ధ సైకాలజిస్ట్ విశేష్ ఇంద్ర కుమార్ కు అందజేశారు. కార్యక్రమ నిర్వాహకులు మాట్లాడుతూ, ఈ శిక్షణ యువతలో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడడం, అలాగే మంచి జీవన విలువలను అలవర్చుకోవడం లక్ష్యంగా నిర్వహించబడిందని తెలిపారు. యువత భవిష్యత్తు దిశగా సానుకూల దృక్పథం పెంపొందించేలా ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అభిప్రాయపడ్డారు.

# జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టంగా ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి

## కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):
జిల్లాలోని అన్ని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల్లో నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని ఆదర్శ్ సురభి





ఆదేశించారు. బుధవారం ఆయన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించే ముందు కచ్చితంగా తనిఖీలు నిర్వహించాలని, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించవద్దని స్పష్టం చేశారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం అవసరమైన సదుపాయాలు కల్పించాలని, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. చీఫ్ సూపరింటెండెంట్ తెలిపిన వివరాల ప్రకారం, తొలిరోజున ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షకు 385 మంది విద్యార్థులకు గాను 370 మంది హాజరయ్యారు. 15 మంది గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ సుబ్రహ్మణ్యం, జిల్లా ఇంటర్ విద్యాధికారి అంజయ్య పాల్గొన్నారు.

# శ్రీరంగాపూర్‌లో తహసిల్దార్ కార్యాలయ పనులు వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి


వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):
మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న నూతన తహసిల్దార్ కార్యాలయ భవన పనులను గరిష్టంగా పది రోజుల్లో పూర్తి చేసి అప్పగించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం ఆయన భవన నిర్మాణ పనులను పరిశీలించి,



అనుమతించిన మ్యాప్ ప్రకారం నాణ్యతతో పనులు చేపట్టాలని, ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. శ్రీరంగాపూర్‌తో పాటు రేవల్లి, ఏదుల మండలాల్లోని నూతన తహసిల్దార్ కార్యాలయ భవనాలను కూడా త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదామును సందర్శించి యూరియా నిల్వలను తనిఖీ చేశారు. రైతులకు ఎరువుల సరఫరాలో ఇబ్బందులు లేకుండా అవసరమైన నిల్వలు ఉంచి, పారదర్శకంగా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు : ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 25 ( ప్రజా జ్యోతి బ్యూరో )
జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలతో పాటు అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వ్యక్తులు, మైనర్ డ్రైవింగ్ చేసిన వారి తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రోడ్డు ప్రమాదాలపై వీడియోలను ప్రదర్శిస్తూ ప్రమాదాల తీవ్రతను వివరించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం ప్రాణాంతక ప్రమాదాలకు ప్రధాన కారణమని తెలిపారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం వల్ల నిర్ణయ సామర్థ్యం తగ్గి ప్రమాదాలు సంభవించే అవకాశం అధికమని పేర్కొన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం చిన్న విషయం కాదని, అవి ప్రాణరక్షణ కవచమని స్పష్టం చేశారు. అధిక వేగం ప్రాణాలకు ముప్పు అని, వేగ నియంత్రణ అత్యవసరమని సూచించారు. మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు గుర్తులు ప్రజల భద్రత కోసం రూపొందించబడినవని, ప్రతి ఒక్కరూ వాటిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రమాదం జరిగిన తర్వాత కుటుంబ సభ్యులు పడే మానసిక, ఆర్థిక కష్టాలను గుర్తు చేస్తూ కుటుంబ బాధ్యతను గుర్తుంచుకుని జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. యువత ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రోడ్డు భద్రత ప్రతి పౌరుడి బాధ్యత అని, పోలీసులతో పాటు ప్రజల సహకారం కూడా అవసరమని పేర్కొన్నారు. "సురక్షిత ప్రయాణం – కుటుంబ సంతోషం" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించాలి: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి జిల్లా, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):
ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు స్వయంగా ముందస్తు పెట్టుబడి పెట్టలేని పరిస్థితుల్లో ఉన్నవారికి స్వయం సహాయక సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించి ఆర్థిక సహాయం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ వనపర్తి మండలంలోని పెద్దగూడెం తండాలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. గ్రామంలో మొత్తం 13 ఇండ్లు మంజూరు కాగా, వాటిలో 9 ఇండ్ల నిర్మాణం చివరి దశకు చేరుకుందని, 2 ఇండ్ల నిర్మాణం పూర్తయిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిర్మాణాల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. లబ్ధిదారులు ముందస్తు పెట్టుబడి పెట్టలేని పరిస్థితుల్లో ఉంటే, స్వయం సహాయక సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించి అవసరమైన ఆర్థిక సహాయం అందించాల్సిందిగా సూచించారు. అనంతరం కొందరు ఇందిరమ్మ ఇల్లు పథకం లబ్ధిదారులతో మాట్లాడిన కలెక్టర్, నిర్మాణ పనులు ఎలా కొనసాగుతున్నాయి, అవసరమైన నిధులను ఎక్కడి నుండి సమకూర్చుకుంటున్నారు అనే వివరాలు తెలుసుకున్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం పేదల గృహనిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి అర్హులైన లబ్ధిదారికి ఇల్లు పూర్తి అయ్యే వరకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఇ విఠోబా, తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఎంపీడీవో తదితర అధికారులు పాల్గొన్నారు.





# ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ బి.యం.సంతోష్

గద్వాల ఫిబ్రవరి 25(ప్రజా జ్యోతి ప్రతినిధి):
ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను అత్యంత పకడ్బందీగా,పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు.
జిల్లా కేంద్రంలోని జ్ఞాన ప్రభ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని బుధవారం జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తో కలిసి జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ ఆకస్మిక తనిఖీ చేశారు.బుధవారం నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం అయిన దృష్ట్యా కళాశాలలో ఇంటర్ పరీక్షలు నిర్వహణ తీరును పరిశీలించారు.పరీక్షకు విద్యార్థుల హాజరు వివరాలు,నిఘా కెమెరాల ఏర్పాటు మరియు వాటి పనితీరు,సిట్టింగ్ ఏర్పాట్లు,ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యవేక్షణ తదితర అంశాలపై పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మరియు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,పరీక్షలు ప్రశాంతంగా ముగిసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థులు,ఇన్విజిలేటర్లు మరియు ఇతర సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లు,ఎలక్ట్రానిక్ పరికరాలు కళాశాల ప్రాంగణంలోకి తీసుకురాకుండా ఖచ్చితమైన నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.పరీక్షా కేంద్రాల్లోకి ప్రవేశించే ప్రతి ఒక్కరిపై ప్రవేశ ద్వారం వద్దనే కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.సీసీ కెమెరాల నిఘా నడుమ పరీక్షలు నిబంధనలకు అనుగుణంగా జరగాలన్నారు.పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఉండాలన్నారు.మాల్ ప్రాక్టీసులను పూర్తిగా నివారించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్లు,సిట్టింగ్ స్క్వాడ్లు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది పరీక్షలు ముగిసే వరకు అందుబాటులోనే ఉండాలన్నారు.ప్రశ్నాపత్రాలు,
పరీక్ష అనంతరం జవాబు పత్రాలు సహా అన్ని గోప్యమైన (కాన్ఫిడెన్షియల్) పత్రాలను నిబంధనల ప్రకారం భద్రతా ప్రమాణాలు పాటిస్తూ సురక్షితంగా రవాణా చేయాలని ఆదేశించారు.అనంతరం పరీక్షలు రాస్తున్న అభ్యర్థులకు పరీక్షా కేంద్రంలో కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు.విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా తగిన మౌలిక సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని పరీక్షల సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి హృదయ రాజు,డిఎస్పీ మొగలయ్య,పరీక్ష కేంద్రం సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.






# ఎమ్మెల్యేపై నిరాధారణ ఆరోపణలు మానాలి

**పెబ్బేరు సంతకు బీఆర్ఎస్ హయాంలోనే ఆటంకాలు**

**ఓటమి జీర్ణించుకోలేక విమర్శలా..?**

**మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్**

వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):
ప్రజల హక్కులను కాపాడుతూ పెబ్బేరు సంతను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే మేఘా రెడ్డి పై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ బి.కృష్ణ డిమాండ్ చేశారు. వ్యక్తిగత అక్కసుతో నిరాధారణ ఆరోపణలు చేయడం సరికాదని వారు హెచ్చరించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇన్నేళ్ల చరిత్ర కలిగిన పెబ్బేరు సంత స్థానిక ప్రజలకు జీవనోపాధిగా నిలుస్తోందని తెలిపారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంత స్థలంపై కబ్జా ప్రయత్నాలు జరగడంతో అనేక అవరోధాలు ఎదురయ్యాయని ఆరోపించారు. ఎంపీడీవో కార్యాలయం ముందు ఉన్న భూమిని, పెబ్బేరు సంత స్థలాన్ని మాజీ మంత్రి అనుచరుడికి కట్టబెట్టేందుకు కుట్రలు జరిగాయని ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ వ్యవహారాలపై ఎమ్మెల్యే ప్రజలకు వివరాలు చెప్పడాన్ని తట్టుకోలేకనే మాజీ మంత్రి అసభ్య పదజాలంతో విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా, వ్యవసాయ శాఖ మంత్రిగా, న్యాయవాదిగా సేవలందించిన వ్యక్తి ఈ విధంగా మాట్లాడటం తగదన్నారు. ప్రజల కోసం అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే పై ఆరోపణలు సహించబోమని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును అంగీకరించలేక ఓర్వలేని ధోరణితో కాంగ్రెస్ నాయకులపై ఉద్దేశపూర్వక విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. రాజకీయాల్లో విలువలు పాటిస్తూ ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్ బ్రహ్మచారి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కౌన్సిలర్ శరవందలు, డాక్టర్ పగిడాల శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ పరశురాం, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జానకి రాములు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.




# గర్భిణీల ఆరోగ్యంపట్ల శ్రద్ధ చూపాలి

- మహమ్మదాబాద్ పి.హెచ్.సిని తనిఖీ చేసిన కలెక్టర్
- పరిశుభ్రత, మెరుగైన వైద్య సేవలపై స్పష్టమైన ఆదేశాలు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 25 ( ప్రజా జ్యోతి బ్యూరో )
మహమ్మదాబాద్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పి.హెచ్.సి.) బుధవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణి స్త్రీలకు సమయానుసారం పరీక్షలు నిర్వహించి, సరైన వైద్య సేవలు అందించాలని, పి.హెచ్.సి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.
ఈ సందర్భంగా చెకప్ కోసం వచ్చిన గర్భిణీలతో కలెక్టర్ ప్రత్యక్షంగా మాట్లాడారు. వారికి ఇది ఎన్ని డెలివరీ, హిమోగ్లోబిన్ (ఐరన్) శాతం ఎంత ఉందని అడిగి తెలుసుకున్నారు. హిమోగ్లోబిన్ శాతం తగ్గితే బలహీనత, నీరసం వస్తాయని, అందువల్ల సరైన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణీ రిజిస్టర్‌ను పరిశీలించి, హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న వారికి ఐరన్ ఇంజక్షన్లు అందిస్తున్నారా అని మెడికల్ అధికారిని ప్రశ్నించారు. రిజిస్టర్‌లో నమోదైన గర్భిణీలకు స్వయంగా ఫోన్ చేసి, వారు నెలనెలా ఆరోగ్య



పరీక్షలు చేయించుకుంటున్నారా, ఐరన్ ఇంజక్షన్లు తీసుకుంటున్నారా అని తెలుసుకున్నారు. పి.హెచ్.సి లో ఎన్ని డెలివరీలు జరిగాయని అడగగా, ఈ నెలలో మొత్తం 28 డెలివరీలు నమోదు కాగా, ఇప్పటివరకు 8 డెలివరీలు జరిగాయని మెడికల్ అధికారి తెలిపారు. గర్భిణీలకు ప్రతి నెలా క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించాలని, అవసరమైన మందులు, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం ఓపీ విభాగాన్ని తనిఖీ చేసి, రోజుకు ఎంతమంది రోగులు వస్తున్నారో తెలుసుకున్నారు. ఇప్పటివరకు 38 మంది ఓపీ రోగులు నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించి, మందుల కొరత లేదని నిర్ధారించారు. నమోదైన రోగులు ఎలాంటి ఆరోగ్య సమస్యలతో వస్తున్నారో కూడా ఆరా తీశారు. ల్యాబ్, ప్రసవ గది తదితర విభాగాలను పరిశీలించారు.
పి.హెచ్.సి లో కాంపౌండ్ వాల్ విరిగిపోవడం గమనించి, అక్కడున్న ఎంపీడీవోను వెంటనే వివరణ కోరారు. అలాగే మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, పి.హెచ్.సి పరిసరాలలో చెత్తాచెదారం కనిపించడం పై పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడం తమ బాధ్యత కాదా అని ప్రశ్నించారు.

# గ్రామాభివృద్ధికి సమష్టి కృషి అవసరం

– గండీడ్‌లో వార్డు సభ్యులకు కలెక్టర్ దిశానిర్దేశం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 25 ( ప్రజా జ్యోతి బ్యూరో )



గండీడ్ మండల కేంద్రంలోని వ్యవసాయ రైతు వేదికలో నిర్వహించిన నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యుల ఓరియెంటేషన్ శిక్షణ కార్యక్రమానికి బుధవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ, దేశం అభివృద్ధి చెందాలంటే ముందుగా గ్రామాలు అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి స్థానిక పాలకవర్గం సమర్థవంతమైన పాలన అందించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలు పార్టీలకు సంబంధం లేకుండా నిర్వహించబడతాయని, గ్రామం ఒక చిన్న యూనిట్ కాబట్టి రాజకీయ భేదాభిప్రాయాలకు తావు లేకుండా ప్రజలందరికీ సమానంగా అభివృద్ధి ఫలాలు అందేలా పని చేయాలని సూచించారు. ముఖ్యంగా పేదలు, వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పంచాయతీ రాజ్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా పరిపాలనా విధానాలపై స్పష్టత పొందాలని సూచించారు. వార్డు సభ్యులు, ఉపసర్పంచులు, సర్పంచులు కలిసి ఒక బృందంగా పనిచేసి గ్రామ అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. చట్టబద్ధంగా తీర్మానాలు చేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, చట్టవిరుద్ధ నిర్ణయాలు తీసుకోరాదని హెచ్చరించారు. చట్టవిరుద్ధ కార్యక్రమాలు చేపడితే ప్రభుత్వం చర్యలు తీసుకునే అధికారాన్ని కలిగి ఉందని స్పష్టం చేశారు. గ్రామాల్లో మంచినీరు, డ్రైనేజ్ కాలువలు, వీధి దీపాలు, రహదారులు, ఇందిరమ్మ ఇండ్లు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు ప్రతి కుటుంబానికి అందేలా కృషి చేయాలని సూచించారు. గ్రామ నిధుల ఆదాయం, వ్యయాలను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. గ్రామ పాలక మండలి సభ్యులు సమష్టిగా కృషి చేసి తమ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కొత్తగా ఎన్నికైన వార్డు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

# శ్రీ చెన్నకేశవ స్వామి జాతర నూతన కమిటీ ఎన్నిక

- ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా
- జాతర చైర్మన్ రమాకాంత్



**దామెర, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి) :** హనుమకొండ జిల్లా దామెర మండలంలోని కోగిల్వాయి శ్రీ చంద్రగిరి చెన్నకేశవ స్వామి జాతర కమిటీని స్థానిక సర్పంచ్ చుక్క వనిత మహేందర్ ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎనుకున్నారు. జాతర కమిటీ చైర్మన్ గా మేకల రమాకాంత్, వైస్ చైర్మన్ లుగా పరుశబోయిన జయశంకర్, పున్నం వేణు, డైరెక్టర్లుగా మోరే రాజు, దండు రాజు, ఇటుకల బాబురావు, బొచ్చు రాకేష్, నల్ల మహేందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా పెరుగు కుమారస్వామి యాదవ్ ను ఎన్నుకయ్యారు. ఈ మేరకు నూతనంగా ఎన్నికైన చైర్మన్ రమాకాంత్ మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి గారి సౌజన్యంతో జాతరను మరింత అభివృద్ధి చేసి భక్తులకు సకల సౌకర్యాలు అందే విధంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. జాతర నూతన కమిటీ సభ్యులు కోగిల్వయి లోని స్వామివారి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలియజేశారు.

# హసన్‌పర్తి మండల రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాల పంపిణీ



**హసన్‌పర్తి, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి) :** హసన్‌పర్తి మండలంలోని రైతుల వ్యవసాయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ కింద అందిస్తున్న వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే నాగరాజు ఆదేశాల మేరకు రైతు సంక్షేమమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన పథకం కింద రోటివేటర్లు సహా పలు వ్యవసాయ పరికరాలను మండల పరిధిలోని రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ ఉపాధ్యక్షులు తంగళ్లపల్లి తిరుపతి, మండల తహసీల్దార్ కిరణ్, మండల అభివృద్ధి అధికారి సుమన దేవి, వ్యవసాయ అధికారి అనురాధ, హసన్‌పర్తి మండల అధ్యక్షులు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు చల్ల రాకేష్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్‌తో పాటు పలువురు సర్పంచులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు. రైతులకు ఆధునిక పరికరాలు అందడంతో సాగు పనులు సులభతరమవుతాయని, దిగుబడులు పెరిగే అవకాశాలు మెరుగుపడతాయని నాయకులు తెలిపారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

# కల్లుగీత సహకార సంఘం అధ్యక్షుడిగా చిర్ర చక్రపాణి గౌడ్



**ఎల్కతుర్తి ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి) :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని వల్భాపూర్ గ్రామంలో కల్లుగీత సహకార సంఘం ఎన్నికలు ముదిరాజ్ సంఘ భవనంలో ఎన్నికల అధికారి రావుల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో శాంతియుత వాతావరణంలో నిర్వహించబడ్డాయి. సంఘం అధ్యక్షుడిగా చిర్ర చక్రపాణి గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా చిర్ర రవీందర్ గౌడ్, క్యాషియర్ గా మామిడి సారంగపాణి గౌడ్, ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను గ్రామ పెద్దలు సంఘ సభ్యులు అభినందిస్తూ సంఘ అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. సంఘం బలోపేతం కార్మికుల సంక్షేమం పారిశ్రామిక పురోగతి కోసం సమిష్టిగా పనిచేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

# మహిళా భవనం మంజూరుకై ఎంపిడివోకు వినతి పత్రం




**దామెర, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి) :** మహిళా భవనం మంజూరిలో గ్రామ పంచాయితీ తీర్మానం ఇవ్వటంలో జాప్యం లేకుండా చూడాలని గ్రామస్తులు ఎంపిడీవో కు వినతి పత్రం అందచేశారు. హనుమకొండ జిల్లా దామెర మండలం తక్కళ్లపాడు గ్రామంలో మహిళా భవనం నిర్మాణానికి ఐకెపి నుండి గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానం కోరారు. కానీ గ్రామ పంచాయితీ పాలక వర్గం తీర్మానం ఇవ్వలేదని వారు పేర్కొన్నారు. గ్రామంలో మహిళా భవనం నిర్మాణానికి స్థలం లేదంటూ పాలక వర్గం జాప్యం చేస్తున్నదని మాజీ సర్పంచ్ బింగి రాజేందర్ ఆధ్వర్యంలో పలువురు ఎంపీడివో కు వినతి పత్రం అందచేశారు. వినతి పత్రం స్వీకరించిన ఎంపిడీవో తక్కళ్లపహాడ్ గ్రామంలో మహిళా సంఘం భవనం మంజూరు అయ్యేలా తమవంతు కృషి చేస్తామని అన్నారు. మహిళా భవనము మంజూరు కోసం తీర్మానం చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్న గ్రామపంచాయతీ పాలకవర్గం తీరు సరికాదన్నారు. గ్రామ పంచాయతీ నుంచి తీర్మానం ఇవ్వలేదని మహిళల నుంచి ఆవేదన వ్యక్తం అవుతున్న సందర్బంగా ఎంపీడివో ని కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ.. ఏ కారణం చేత ఇవ్వడం లేదో ఐకేపీ ఏపీఎం, కార్యదర్శిని, సర్పంచ్ లను తెలుసుకొని తీర్మానం ఇచ్చేలా చర్యలు తీసుకుంటాను అనీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బింగి రాజేందర్, కొత్తపెల్లి నాగేందర్, మామిడిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల ఇందిరమ్మ ప్రభుత్వంలో నెరవేరింది

- పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం
- అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తాం
- పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి





**ఆత్మకూరు, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి) :** పేదల సొంతింటి కల ఇందిరమ్మ ప్రభుత్వంలో నెరవేరిందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు మండలం పెద్దాపురం, గూడెప్పాడ్, మల్కపేట గ్రామాలలో నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. బుధవారం ఆత్మకూరు మండలం పెద్దాపురం, గుడెప్పాడు , మల్కాపేట గ్రామాలలో నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని, రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు స్వీట్ తినిపించి, శాలువాతో సన్మానించి, కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభోత్సవం చేయడం ఎంతో సంతోషకరంగా ఉందని, పేదల కళ్ళలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని, ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు లేవని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రతి గ్రామంలో మౌలిక వసతులను కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో శిలాఫలకాలికే పరిమితమయ్యారని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పసిపాప మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- దోషులను కఠినంగా శిక్షించాలి - మాజీ ఎంపీపీ గటిక అజయ్ డిమాండ్



**నెక్కొండ, ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని, నాగర్‌కర్నూల్ జిల్లాలో పసిపాప మృతికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని నెక్కొండ మాజీ ఎంపీపీ గటిక అజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బీసీ నాయకుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఉన్నా, ప్రభుత్వంలో బీసీ మంత్రులున్నా బీసీ బిడ్డలకు రక్షణ కరువైందని మండిపడ్డారు. నాగర్‌కర్నూల్ మండలం కుమ్మెర గ్రామంలో మల్లికార్జున స్వామి జాతర సందర్భంగా చోటుచేసుకున్న ఘటన కుల అహంకారానికి నిదర్శనమని అజయ్ విమర్శించారు. దైవ దర్శనానికి వెళ్లిన చంద్రకళ కుటుంబాన్ని తక్కువ కులం వారంటూ దూషించి, ఆలయంలోకి రానివ్వకుండా అడ్డుకోవడం అమానుషమని పేర్కొన్నారు. చంద్రకళ, జగ్గయ్య దంపతులపై కుల ఉన్మాదంతో దాడి చేసి, వారిని ఈడ్చుకుంటూ వెళ్లి జనాలపైకి విసిరికొట్టడం దొరల పాలనను తలపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. "తల్లిదండ్రులు కాళ్ల మీద పడి వేడుకున్నా కనికరం లేకుండా రెండు నెలల పసిపాపను కాలితో తన్ని చంపడం కుల రాక్షసత్వం. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే" అని అజయ్ వ్యాఖ్యానించారు. ఈ దాడిలో గ్రామ సర్పంచ్‌తో పాటు అధికార పార్టీ నాయకులు ఉన్నారని, నిందితులను గుర్తించినా రాజకీయ అండదండలతో పోలీసులు అరెస్టు చేయడం లేదని ఆరోపించారు. బాధిత కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని, దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. బహుజనులపై దాడులు కొనసాగితే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

# నర్సంపేటను అభివృద్ధి చేయడమే మా లక్ష్యం

- వార్డు సమస్యలన్నీ పరిష్కరిస్తాం - చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్





**నర్సంపేట ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట మున్సిపాలిటీ అభివృద్ధి చేయడమే లక్ష్యమని నర్సంపేట మున్సిపాలిటీ చైర్ పర్సన్ శ్రీమతి పెండెం శ్రీలక్ష్మీరామానంద్ అన్నారు. నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో స్థానిక కౌన్సిలర్ బీరం భరత్ రెడ్డి తో కలిసి వార్డులో ఉదయం పర్యటించిన చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్, వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా అనంతరం చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు, నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత పెద్దలు శ్రీ దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు నేడు ఉదయం 4వ వార్డులో పర్యటించి వార్డు సమస్యలను తెలుసుకుంటూ వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు, వార్డులో లీకైన మిషన్ భగీరథ పైప్ లైన్ రిపేర్ చేయించి వార్డు ప్రజలకు నీరు అందించడానికి చర్యలు చేపట్టడం జరిగిందని అదేవిధంగా వరమ్మతోటలోని నల్లాల బావిని శుభ్రం చేయించి వార్డు ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆశీస్సులతో వార్డులో ఇటీవలే బోర్లు వేయించడం జరిగిందని అదే విధంగా సీసీ రోడ్లు, సైడ్ కాలువలు, తోపాటు వార్డుకు అవసరమైన పనులను ముందుండి చేయించి వార్డు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కాట భాస్కర్,ఏ ఈ కుమారస్వామి, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు మాదాసి రవి, ముత్తినేని వెంకన్న, పొన్నాల మనీషా-ప్రకాష్, బాణాల ప్రసన్న-శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంచినీళ్ళ నాగరాజు, బీరం రవీందర్ రెడ్డి, ముత్యాల సాంబయ్య, బీరం భాస్కర్ రెడ్డి, జన్ను మురళీ, ఎదరబోయిన రాజేందర్, ప్రశాంత్, సదానందం, కృష్ణమూర్తి, సద్దాం, సుధాకర్, రాజకుమార్, రాములు, వాటర్ మ్యాన్ శ్రీనివాస్, జవాన్ కుమార్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాయపర్తి గ్రామం పారిశుధ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దుతా

### గ్రామ సర్పంచ్ గారే సయేంద్ర బిక్షపతి

**రాయపర్తి ఫిబ్రవరి 25 ప్రజా జ్యోతి :** రాయపర్తి మండలంను వరంగల్ జిల్లాలోని పారిశుద్ధ్యరహిత గ్రామంగా నెంబర్ వన్ స్థానంలో చే గ్రామ సర్పంచ్ గారి సయేంద్ర బిక్షపతి అన్నారు. బుధవారం రాయపర్తి మండల కేంద్రంలోని పలు వీధులలో డ్రైనేజీలను శుభ్రం చేయించి తడి పొడి చెత్తను ట్రాక్టర్ ద్వారా తరలించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైనేజీలలో నీరు నిలువ ఉండడం వలన దోమలు ఈగలు స్వైర విహారం చేసి పలు రకాల వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున డ్రైనేజీలను స్వచ్ఛందంగా సిబ్బందితో కలిసి శుభ్రం చేయించడం జరిగిందని అన్నారు. తనను సర్పంచిగా గెలిపించిన గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి వినోద్ కరోబార్ రామచంద్రయ్య ఎలక్ట్రిషన్ వాటర్ మెన్ సంపత్ కమిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి





**రాయపర్తి ఫిబ్రవరి 25 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం సన్నూర్ గ్రామంలో బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు దేశాల మేరకు బాధిత కుటుంబలు వివిధ అనారోగ్య కారణాల వల్ల చికిత్స తీసుకోని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పసునూరి బుగ్గమ్మ, తాళ్లపెల్లి రవి, తండాల యాదగిరి, అబోథ్ మల్లేశం పబ్బోజు సావిత్రమ్మ లను వారిని పరామర్శించి, ఫౌండేషన్'ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబనికి ఆర్థిక సహాయం చేసిన ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుల పరుపటి శ్రీనివాస్ రెడ్డి .ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్ నాయక్, మండల పార్టీ అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, గజావెల్లి ప్రసాద్, కోలా సంపత్ స్థానిక నాయకులు అయిన స్థానిక సర్పంచ్ చిన్నపాక రజిత రాంబాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు పోతుల కొమురుమాళు ళ్ళ ఉప సర్పంచ్ చీకటి కర్ణాకర్, పార్టీ ముఖ్య నాయకులు పయ్యాల కొమురుమాళ్ళు, వేణు, సామ్రాట్, వెంకటలక్ష్మి, చిన్నపాక శ్రీనివాస్, రాపాక మురళి, తాళ్లపెల్లి భరత్, సందీప్, సుధీర్, పోలేపల్లి ఉప్పలయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### నూతన వధూవరులను ఆశీర్వదించిన

# సినీ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్



**చిట్యాల (ప్రజా జ్యోతి)ఫిబ్రవరి 25, :** మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు చింతల రమేష్ ముదిరాజ్ సంధ్యారాణిల ద్వితీయ పుత్రిక పయోస్నిక (హారిక) వినయ్ నూతన దంపతులను కలుసుకొన్న సినీ గేయ రచయిత, నంది అవార్డు గ్రహీత మిట్టపల్లి సురేందర్ శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు నూతన దంపతులు ఇద్దరూ సుఖ సంతోషాలతో పిల్లాపాపలతో సుఖమయ జీవితాలను గడపాలని దీవించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డికిష్టయ్య అంబేద్కర్ యువజన సంఘం చిట్యాల మండల అధ్యక్షుడు జన్నె యుగంధర్ నాయకులు పుల్ల రవితేజ గురుకుంట్ల కిరణ్ మాసు రమేష్ పుల్ల సతీష్ కళాకారుడు పుల్ల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# మండలాన్ని సందర్శించిన కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్

- కేజీబీవీ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన - కాటారం సబ్ కలెక్టర్
- పలు బిల్డింగ్ పనుల పురోగతిని పరిశీలన





**పలిమెల ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమేల మండలంను బుధవారం రోజున కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ సందర్శించారు. మండలంలోని పంకెన కస్తూరిబా బాలికల పాఠశాలలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి తనిఖీలలో భాగంగా సరుకుల రిజిస్టర్లు మరియు సరుకులు నిలువ ఉంచిన గదిని పరిశీలించిన అనంతరం డైనింగ్ హాల్ కి వెళ్ళి అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలని ఎలాంటి సమస్యలు ఉన్న మా దృష్టికి తీసుకురావాలని తెలుపుతూ అధికారులకు తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. అనంతరం మండలంలో ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ మరియు పీహెచ్సీ బిల్డింగ్ పనుల పురోగతిని డి ఈ సాయిలు ను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయి పవన్, ఏఈ సతీష్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, కేజీబీవీ సిబ్బంది మరియు విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి సంసద్ క్రీడా మహోత్సవం

- 2025. 26 హుస్నాబాద్ అసెంబ్లీ స్థాయి క్రీడా పోటీలకు ఏర్పాట్లు

**ఎల్కతుర్తి ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి) :** నరేంద్ర మోడీ ప్రేరణతో నిర్వహిస్తున్న ప్రధానమంత్రి సంసద్ క్రీడ మహోత్సవం 2025. 26 లో భాగంగా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో హుస్నాబాద్ అసెంబ్లీ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కేంద్ర హోమ్ సహాయక మంత్రి బండి సంజయ్ కుమార్ సూచనల మేరకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మహోత్సవంలో కబడ్డీ వాలీబాల్ హాకీ కోకో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించబడనున్నాయి. ఎల్కతుర్తి మండలానికి చెందిన క్రీడాకారులు జట్లు ఆసక్తి ఉంటే ఈ నెల 27వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న జట్లకు ఈ నెల 28న డ్రా తీసి మార్చి 1 నుండి 3 వరకు హుస్నాబాద్ అసెంబ్లీ కేంద్రంలోని ప్రభుత్వ క్రీడా మైదానంలో పోటీలు నిర్వహించనున్నారు. అసెంబ్లీ స్థాయిలో ప్రథమ ద్వితీయ స్థానాల్లో నిలిచిన చెట్లను పార్లమెంటు స్థాయి పోటీలకు ఎంపిక చేసి మార్చి 5 నుండి 7 వరకు పోటీలు నిర్వహించనున్నారు. అప్తై మార్చి 8న విజేత జట్లకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చేతులమీదుగా ప్రశంస పత్రాలు మరియు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదని వయస్సు పరిమితి కూడా లేదని నిర్వాహకులు స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ కోసం సంప్రదించవలసిన నంబర్లు మంత్రి శ్రీకాంత్ యాదవ్ (9704646902) చదిరం రాకేష్ (9866126897) ఎం తిరుపతి (9381130846) ఈ వివరాలను ఎల్కతుర్తి బిజెపి మండల అధ్యక్షుడు మన్నుర్తి శ్రీకాంత్ యాదవ్ వెల్లడించారు.

# పొలాల్లోకి దూసుకెళ్లిన లారీ..

### తృటిలో తప్పిన ప్రమాదం..

- ప్రమాద కరంగా ఎన్ఎస్సార్ ముందు డివైడర్
- డివైడర్ మూసి వేయాలని ప్రయాణికుల డిమాండ్



**ఆత్మకూరు, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి) :** పొలాల్లోకి లారీ దూసుకెళ్లగా.. ఇద్దరు వ్యక్తులు ప్రమాదం నుండి బయట పడిన ఘటన బుధవారం ఆత్మకూరు మండలం గూడెప్పాడ్ శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ నుంచి భూపాలపల్లి కి వెళ్తున్న లారీ గూడెప్పాడ్ సమీపంలోనీ ఎన్ఎస్ఆర్ రెస్టారెంట్ ముందు జాతీయ రహదారిపై ఎదురుగా అతివేగంగా వస్తున్న ద్విచక్రవాహనం ను తప్పించబోయిన లారీ డ్రైవర్ ప్రీతం లారీని కంట్రోల్ చేయలేక పోయాడు. దీంతో అదుపుతప్పి జాతీయ రహదారి పక్కన ఉన్న పొలంలో కలుపు తీస్తున్న రైతుల వద్దకు వచ్చి లారీ ఆగడంతో ఊపిరి పీల్చుకున్నాడు. గతంలో ఇదే డివైడర్ వద్ద ఇటీవల ఇద్దరు మహిళలు డివైడర్ దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. డివైడర్ దాటుతుండగా ద్విచక్ర వాహనదారుడుని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్న జాతీయ రహదారుల అధికారులు మాత్రం ప్రమాదకరంగా మారిన యూటర్న్ ను మూసి వేయడం లేదని, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రమాదకరంగా మారిన యూటర్న్ మూసివేయాలని వాహనదారులు కోరుతున్నారు. జాతీయ రహదారి ప్రారంభంలో లేని డివైడర్ కొందరి స్వార్థం కోసం ఏర్పాటు చేస్తే.. ప్రయాణికుల పట్ల శాపంగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు.

## అనంతారం ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం

### విద్యార్థులు ఒక రోజు అధికారులు, ప్రజాప్రతినిధులుగా బాధ్యతల నిర్వహణ

గుండాల, ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి): మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అనంతారంలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఒక రోజు పాటు పాఠశాల పరిపాలన బాధ్యతలను






స్వయంగా చేపట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థి మోహన్ మండల విద్యాధికారిగా వ్యవహరించగా,తనూ శ్రీ ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు స్వీకరించారు. భాను సర్పంచ్‌గా,కె. వైష్ణవి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో క్రమశిక్షణతో,బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి అందరినీ ఆకట్టుకున్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి పి.రజనీ కుమారి ఆధ్వర్యంలో కార్యక్రమం సజావుగా సాగింది.ఉపాధ్యాయులు ఎ. వేణు,ఎం.సుధాకర్, విఓఏ నూనెముంతల పద్మ,అంగన్వాడీ టీచర్ జి.రేణుక,రమేష్,ప్రమీల,నాంచారమ్మ తదితరులు పాల్గొని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు.స్వపరిపాలన దినోత్సవం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు,బాధ్యతా భావం,నిర్ణయ సామర్థ్యం పెంపొందుతాయని ఉపాధ్యాయులు తెలిపారు.కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

ఆలేరు ఫిబ్రవరి 25 ప్రజా జ్యోతి: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ





జిల్లా నాయకులు ఫారునంది భాస్కర్ బుధవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువు చదివి ఉత్తీర్ ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో దార సురేష్, కరుణాకర్, వెంకటేష్, అంజయ్య, మస్తాను విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పంట పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం

గరిడేపల్లి,ఫిబ్రవరి 25,(ప్రజా జ్యోతి): గరిడేపల్లి మండలంలో బుధవారం శాస్త్రవేత్తల బృందం,వ్యవసాయ అధికారులతో కలిసి వరి పొలాల ను పరిశీలించారు.ప్రస్తుతం వరి పంట పోట్టదశలో ఉందని ఈ దశలో వరి పంటకు వివిధ తెగుళ్లు ఆశించినట్లు గుర్తించడం జరిగిందని తెలిపారు.వరి పంటలకు సోకిన వివిధ రకాల తెగుళ్ల నివారణకు శాస్త్రవేత్తల బృందం రైతులకు పలు సూచనలను చేశారు.ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అగ్గి తెగులు,ఆకుమచ్చ



తెగులు వృద్ధి చెందడానికి అ నుకూల ంగా ఉన్నాయన్నారు.అగ్గి తెగులు పూత దశకు చేరిన పంటల్లో విందుపై ఆశించినట్లయితే మెడ విరుపు తెగులుగా మారి దిగుబడి నష్టం ఎక్కువగా ఉంటుందన్నారు. దీని దృష్టిలో పెట్టుకుని రైతులు అగ్గి తెగులు,మెడ విరుపు తెగులు, ఆకు మచ్చ తెగులు నివారణకు ట్రై సైకలాజోల్,మాన్కో జబ్ 2.5 గ్రాములు లేదా ఐసో ప్రోతయోలిన్ 1.5 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు.నత్రజని ఎరువును మోతాదుకు మించి వేయకూడ దన్నారు.వరిలో కాండం కుళ్ళ తెగులు ప్రధానంగా అధిక తేమ, నత్రజని ఎరువుల వాడకం వల్ల వస్తుందని రైతులకు వివరించారు. ఆకు తొడుగులపై నల్లటి మచ్చలు కాండం కుళ్ళు,పిలకలు విరిగిపడటం లాంటి లక్షణాలను కలిగి ఉంటే వీటి నివారణ కోసం ఎకరానికి 200 గ్రాముల కార్బండిజం,మంకోజబ్ చల్లడం లేదా కార్బండిజం లీటర్ నీటిలో ఒక గ్రాము కలిపి పిచికారి చేయాలని తెలిపారు.పూత దశకు చేరిన పంటల్లో పొట్ట కుళ్ళు తెగులు ఆశించే అవకాశం ఉంటుందన్నారు.20 నుంచి 28 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉన్నప్పుడు దీని ఉధృతి అధికంగా ఉంటుందన్నారు ఈ తెగులు ఆశించినప్పుడు పొట్ట పైన నల్లని మచ్చలు ఏర్పడటం, పొట్ట కుళ్ళిపోవడం,తాలు గింజలు ఏర్పడటం గమనించవచ్చని రైతులకు సూచించారు.ఈ రకమైన తెగులు నివారణకు ఒక గ్రాము కార్బండిజం లీటర్ నీటిలో కలిపి లేదా ఒక మిల్లీలీటర్ ప్రొపికోనా జోల్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన సంస్థ కంప సాగారానికి చెందిన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ లింగయ్య, డాక్టర్ బి శ్రీధర్,సస్యరక్షణ శాస్త్రవేత్త రాములమ్మ,గరిడేపల్లి మండల వ్యవసాయ అధికారి ప్రీతం కుమార్,హుజూర్నగర్ వ్యవసాయ విస్తరణ అధికారి రమ్య తదితరులు పాల్గొన్నారు.

# పైసలు పోయిన పదవి రాకపోయే

**ఎన్నికలలో ఓడిపోయిన అభ్యర్థుల ఆవేదన**

**మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు ధీమాతో కోట్లకు పైగా ఖర్చు**

**ఓటమి భారానికి తోడైన అప్పుల బాధ**

**భూములు తాకట్టు ఆస్తులు అమ్మి మరీ బరిలోకి దిగిన వైనం**

**పట్టించుకోని పార్టీ ముఖ్య నేతలు**

ఆలేరు ఫిబ్రవరి 25 ప్రజా జ్యోతి: ఆలేరు మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచి ఓటమి చవిచూసిన అభ్యర్థుల పరిస్థితి ప్రస్తుతం క్లిష్టపస్థితిగా మారింది. గెలిపి లక్ష్యంగా అభ్యర్థులకు పోటాపోటీగా కోట్లాది రూపాయలు వెక్షించిన అభ్యర్థులు ఇప్పుడు అప్పుల తీరంలో కురకపోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రిజర్వేషన్లు కలిసి వచ్చాయి అన్న మోజుతో ఆస్తులు అమ్మి




భూములు తాకట్టు పెట్టి ఎన్నికల్లో ఖర్చు చేసిన వీరికి తీరాఫలితం ప్రతికూలంగా రావడంతో ఏం చేయాలో కోల్పోవడం లేదు చేసిన అప్పులు నెల నెల వడ్డీలు కట్టలేక అసలు తీర్చే దారి లేక లోలోపల కుమిలిపోతున్నారు. ఎన్నికల సమయంలో అండగా ఉంటామని నమ్మించిన సొంత పార్టీ ముఖ్య నేతలు కూడా ఇప్పుడు కనీసం ఓదార్చడానికి రాకపోవడంతో తాను రాజకీయ భవిష్యత్తు ఏమవుతుందో నని అభ్యర్థులు మనోవేదనకు గురవు తున్నారు. ఆలేరు మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల అనంతరం ఓటమి చెందిన అభ్యర్థుల పరిస్థితి అత్యంత దయానియంగా మారింది. గెలిస్తే రాజకీయ భవిష్యత్తు బాగుంటుందన్న ఆశతో పోటీ చేసిన అభ్యర్థులకు ఇప్పుడు అప్పుల భారం పెనుబారంగా మారింది. ఎన్నికలవేళ ధీమాతో ప్రఖ్యార్థులు పోటాపోటీగా ఒక్కొక్క అభ్యర్థి 40 లక్షల నుండి ఏకంగా 2 కోట్ల వరకు చెల్లించవలసి వచ్చిందని తెలుస్తుంది. తీరా ఓటమి అని తెలుసాకా చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక అయోమయ స్థితిలో ఉన్నారు. కనీసం సొంత పార్టీ ముఖ్య నేతలు కూడా కనీసం పలక రించకపోవడంతో ఒంటరిపోయి అభ్యర్థులు లో లోపల కుమిలిపోతు న్నారు.

**ఆస్తులు అమ్మి అప్పులు తెచ్చి**

రాజకీయ ఎదుగుదలకు కౌన్సిలర్ పదవి తొలిమెట్టు అని భావించిన కార్యకర్తలు రిజర్వేషన్లు కలిసి రావడంతో ఉత్సాహంగా బరిలోకి దిగారు. ఓటర్లను ఓట్లు అడిగేందుకు విందులు వినోదాలు అరుదైన బహుమతులతో పాటు ఒక్క ఓటుకు 2000 నుండి 12 వేల రూపాయల వరకు పంపిణీ చేశారు. ఇందుకోసం కొందరు తమకున్న స్థిరాస్తులు విక్రయించగా మరికొందరు వ్యవసాయ భూములు తాకట్టుపెట్టి లక్షలాది రూపాయలు అప్పులు చేశారు. నామినేషన్ వేసిన నాటినుండి ఫలితాల వరకు చేసిన ఖర్చు ఇప్పుడు వారిని అప్పుల ఊబిలోకి నెట్టింది. ఎన్నికల సమయంలో వెనకడుగు వేయకుండా చచ్చిన అప్పులకు నెలనెలా వడ్డీలు కట్టడం ఇప్పుడు పెను సవాల్ గా మారింది.

**పేదోడు రాజకీయాల్లోకి రావడం కష్టం**

నిజానికి కొంతమందికి పోటీ చేసే ఆసక్తి లేకుంనా పార్టీలు స్నేహితుల ఒత్తిడిల మేరకు చివరి నిమిషంలో రంగంలోకి దిగారు. తీరా ఫలితాలు తారుమారు కావడంతో అటు గెలవలేక ఇటు అప్పులు కట్టలేక నీళ్లలో పడ్డ ఎలుకలాగా జీవితం అయిందని. పేదోడు రాజకీయాల్లోకి రావాలంటే ఈ పరిస్థితుల్లో పోటీ చేయడం సరైంది కాదని డబ్బుతో కూడుకున్న వ్యవహారం అని విశ్లేషకులు చెబుతున్నారు. అప్పుల బాధ నుండి ఎలా గట్టకాలో తెలియక ఆదుకునే వారు లేక ఆలేరు మున్సిపాలిటీలో ఓటమి చెందిన అభ్యర్థులు దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతు న్నారు.

# మురికి కాలువలకు 'పిట్టగోడల' గ్రహణం!

**నీట మునుగుతున్న వీధులు అక్రమ నిర్మాణాలతో మురుగునీరు రోడ్లపాలు**

**అక్రమ కట్టడాలతో ఇరుకుగా మారిన రహదారులు**

**వాహనదారుల ప్రమాదాలకు కారణమవుతున్న ఇంటి ముందటి దిమ్మెలు**

**కాలువలపై పిట్టగోడలు, రోడ్లపై ఫ్లోరింగ్‌లతో వాహనదారుల అవస్థలు**

**బండి పైనుంచి కింద పడుతున్న పసిపిల్లలు, తల్లిదండ్రుల ఆవేదన**

**కంటికి కనిపిస్తున్నా కానరానట్లు వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారులు**

**మున్సిపల్ అధికారుల ఉదాసీనతపై సామాజిక కార్యకర్త కస్తూరి రాములు ధ్వజం**

కోదాడ రూరల్, ఫిబ్రవరి 25( ప్రజాజ్యోతి ) పట్టణాల్లో, గ్రామాల్లో మురుగునీరు సాఫీగా వెళ్లేందుకు నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థ ఇప్పుడు అక్రమ నిర్మాణాల పుణ్యమా అని నిరుపయోగంగా మారుతోంది. డ్రైనేజీల మీద పిట్టగోడలు కట్టడం, సీసీ రోడ్ల మీద అదనపు ఫ్లోరింగ్‌లు వేయడం వల్ల వరద నీరు వెళ్లే దారి లేక వీధుల్లోనే నిలిచిపోతోంది. ఈ అస్తవ్యస్త పరిస్థితిపై సామాజిక కార్యకర్త కస్తూరి రాములు మరియు స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన డ్రైనేజీలు ఇప్పుడు మూలన పడ్డాయి. కొందరు తమ ఇంటి ముందు డ్రైనేజీలపై పిట్టగోడలు కట్టి, మురికి కాలువలను పూర్తిగా కప్పివేస్తున్నారు. దీనివల్ల కాలువల్లో పేరుకుపోయిన మట్టిని, చెత్తాచెదారాన్ని తీయడం పారిశుధ్య కార్మికులకు సాధ్యం కావడం లేదు. ఫలితంగా మురుగునీరు నిలిచిపోయి, దుర్వాసన వెదజల్లుతూ బజార్ల వెంట ప్రవహిస్తోంది.

**సీసీ రోడ్లపై అక్రమ 'ఫ్లోరింగ్':**

కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని దాదాపు అన్ని వార్డుల్లో మురుగు కాలువలు, సిసి రోడ్లు ఆక్రమణలకు గురవుతున్నాయి. ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం వేసిన రోడ్లనే తమ సొంత ఆస్తిగా భావిస్తూ కొందరు అడ్డగోలుగా ఫ్లోరింగ్‌లు వేసుకోవడం, డ్రైనేజీలపై పిట్టగోడలు కట్టడం వల్ల పట్టణంలో పారిశుధ్యం కుంటుపడింది.ప్రభుత్వం వేసిన సీసీ రోడ్ల మీద కూడా ఆక్రమణలు ఆగడం లేదు. తమ ఇంటి ముందు రోడ్డు ఎత్తును పెంచుతూ, బ్రేక్ కట్టర్స్ లాగా అదనపు ఫ్లోరింగ్‌లు వేసుకుంటున్నారు. దీనివల్ల వర్షపు నీరు రోడ్డుపైనే నిలిచి చెరువులను తలపిస్తోంది. ఒకరి ఇంటి ముందు



ఆక్రమణల వల్ల పక్కవారి ఇళ్లలోకి మురుగునీరు చేరుతోందని, ఇది స్థానికుల మధ్య వివాదాలకు కూడా దారితీస్తోందని కస్తూరి రాములు తెలిపారు.నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు విపరీతంగా పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు భయపడుతున్నారు. అపరిశుభ్రత కారణంగా పిల్లలు, వృద్ధులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులు స్పందించాలి:**

ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు, పాలకవర్గం పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొత్త పాలకవర్గం ఇప్పటికైనా ఈ సమస్యపై దృష్టి సారించాలని, మురికి కాలువలపై



ఉన్న అక్రమ పిట్టగోడలను, రోడ్లపై ఉన్న అదనపు ఫ్లోరింగ్‌లను వెంటనే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మురుగునీటి వ్యవస్థను పునరుద్ధరించి ప్రజల ఇబ్బందులను తీర్చాలని కస్తూరి రాములు కోరారు. ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లు ఇప్పుడు కొందరి స్వార్థానికి బలైపోతున్నాయి. తమ ఇంటి ముందు రోడ్డును ఆక్రమించి అదనంగా ఫ్లోరింగ్ వేసుకోవడం, ఎత్తైన దిమ్మెలు కట్టుకోవడంతో సామాన్య ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలాచోట్ల ఇళ్ల యజమానులు తమ ఇంటి ముందటి మురికి కాలువలను కప్పివేయడమే కాకుండా, సిసి రోడ్డుపైకి రెండు మూడు అడుగుల మేర అదనంగా ఫ్లోరింగ్ చేసుకుంటున్నారు. ఇది చూడటానికి రోడ్డుపై అనధికారిక 'స్పీడ్ బ్రేకర్' లాగా మారి, అటుగా వెళ్లే ద్విచక్ర వాహనదారులను ప్రమాదాలకు గురిచేస్తోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ అదనపు ఫ్లోరింగ్‌లు కనబడక వాహనాలు అదుపుతప్పి కింద పడిపోతున్న ఘటనలు నిత్యం జరుగుతున్నాయి.ఈ అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త కస్తూరి రాములు మరియు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**పాలకవర్గం స్పందించాలి:**

కొత్త పాలకవర్గం మరియు మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, సిసి రోడ్లపై ఉన్న అక్రమ ఫ్లోరింగ్‌లను, డ్రైనేజీలపై ఉన్న పిట్టగోడలను తక్షణమే తొలగించాలని కస్తూరి రాములు కోరారు. ప్రభుత్వ ఆస్తిని ఆక్రమించి సామాన్య ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పారదర్శకమైన డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.పట్టణంలోని వివిధ వార్డులలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన సీసి రోడ్లు ఇప్పుడు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. దానికి కారణం రోడ్ల నాణ్యత కంటే, రోడ్లపై ఎవరికి వారు తమ ఇంటి ముందు చేసుకుంటున్న అదనపు కాంక్రీట్ నిర్మాణాలే. తమ ఇంటి మెట్లు, ర్యాంపుల కోసం రోడ్డుపైకి అదనంగా కాంక్రీట్ పోసి ఎత్తు పెంచుతుండటంతో, ఆ కుదుపులకు వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలను ముందు కూర్చోబెట్టుకుని వెళ్లే తల్లిదండ్రులు ఈ అడ్డదిడ్డమైన కట్టడాల వల్ల తీవ్ర ప్రమాదాలకు గురవుతున్నారు.రోడ్డు మట్టం కంటే అడుగు, రెండు అడుగుల ఎత్తులో ఈ ప్రైవేటు కాంక్రీట్ దిమ్మెలు ఉండటంతో ద్విచక్ర వాహనాల టైర్లు ఒక్కసారిగా ఎగిరి పడుతున్నాయి. ఈ క్రమంలో బండిపై ఉన్న పసిపిల్లలు అదుపుతప్పి రోడ్డుపై పడిపోతుండటం తల్లిదండ్రులను ఆవేదనకు గురిచేస్తోంది. "ప్రభుత్వం వేసిన రోడ్డుపై మేం పన్నులు కట్టి ప్రయాణిస్తుంటే, కొందరు తమ సొంత ప్రయోజనాల కోసం రోడ్డును ఆక్రమించి కట్టడాలు కడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు?" అని బాధితులు ప్రశ్నిస్తున్నారు.మున్సిపల్ అధికారుల కళ్లుండి చూడని తనం,ఈ అదనపు కాంక్రీట్ నిర్మాణాలు ప్రతి వీధిలోనూ దర్శనమిస్తున్నా, మున్సిపల్ యంత్రాంగం కంటికి కనిపిస్తున్నా కానరానట్లు వ్యవహరిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం ప్రభుత్వ రహదారిపై ఎటువంటి అదనపు నిర్మాణాలు చేపట్టినా అవి అక్రమమే అవుతాయి. కానీ కోదాడ మున్సిపాలిటీలో మాత్రం ఈ అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేసేవారే కరువయ్యారు.ప్ర



మాదాల నివారణకు తక్షణ చర్యలు పట్టాలి,సర్వే నిర్వహించాలి, పట్టణంలోని అన్ని వార్డులలో రోడ్లపై ఉన్న అక్రమ కాంక్రీట్ కట్టడాలను, ఎత్తైన ర్యాంపులను గుర్తించాలి.నోటీసులు జారీ చేయాలి: రోడ్డు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారికి వెంటనే కోదాడ మున్సిపాలిటీ తరపున నోటీసులు ఇవ్వాలి.వాహనదారుల భద్రత దృష్ట్యా రోడ్లపై ఉన్న అదనపు కాంక్రీట్ పొరలను తక్షణమే తొలగించాలి.పసిపిల్లల ప్రాణాలు పోకముందే నూతనంగా ఎన్నికైన వంటి కోదాడ మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ మరియు ఇంజనీరింగ్ అధికారులు స్పందించి, రోడ్లను ప్రయాణ యోగ్యంగా మార్చాలని కస్తూరి రాములు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజలందరికీ విద్యవైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

వేములపల్లి ఫిబ్రవరి 25(ప్రజా జ్యోతి) : ప్రజలందరికీ విద్య,వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం




వేములపల్లి మండల కేంద్రంలోని ఆమనగల్లు గ్రామములో సూర్యాపేట లయన్స్ క్లబ్ సౌజన్యంతో యశోద హాస్పిటల్ డాక్టర్ల బృందంతో ఏర్పాటుచేసిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్ ను లయన్స్ క్లబ్ చైర్మన్ మిర్యాల సుధాకర్ తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి పేదవాడిని ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. నిరుపేదలను గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందించడమే రేవంత్ సర్కార్ లక్ష్యమన్నారు. దాతృత్వం కు మిర్యాల సోదరులు రాంమ్మూర్తి,సుధాకర్, వెంకటేశ్వర్లు నిలిచారని కొనియాడారు.మనం సంపాదించిన సంపదను ఇతరులకు పంచడంలో సంతృప్తి లభిస్తుందని అన్నారు.మారుమూల ప్రాంతాల్లోని పేదలకు వైద్య సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు వినియోగించుకోవాలని కోరారు.ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ చైర్మన్ మిర్యాల సుధాకర్ మాట్లాడుతూ ఈ ఉచిత మెగా హెల్త్ క్యాంపు లో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చామని పేర్కొన్నారు. మెగా హెల్త్ క్యాంపు గ్రామ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.ఏ ఆపద వచ్చిన గ్రామ ప్రజలకు అండగా ఉంటానని భరోసా కల్పించారు.ఉచిత మెగా హెల్త్ క్యాంపుకు అనూహ్య స్పందన వచ్చిందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పిల్లల సందీప్, ఎలికంటి భరత్, ఉపసర్పంచ్ శాలెం రాజు, రామలింగేశ్వర దేవాలయ చైర్మన్ బ్రహ్మదేవర విద్యాసాగర్, లయన్స్ క్లబ్ డిస్టిక్ గవర్నర్ రేపాల మదన్మోహన్, ఐ హాస్పిటల్ చైర్మన్ దోసపాటి గోపాల్, సుధాకర్ పివిసి అధినేత మీలా మహాదేవ్,జిల్లా కోఆర్డినేటర్ గుడిపూడి వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ సభ్యులు మిర్యాల రామ్మూర్తి,వెంకటేశ్వర్లు,కొండ సంతోష్, రాచర్ల కమలాకర్, తోట శ్యామ్, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.

## నిజామాబాద్ జిల్లా దర్పల్లి మండల కేంద్రంలో గాంధీ చౌక్‌లో కోవత్తుల ర్యాలీ



ధర్పల్లి:ఫిబ్రవరి/25 (ప్రజా జ్యోతి) కుల అహంకారుల చర్య లకు బలి అయిన బేబీ మౌనిక ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తుల నిరసన పనిచేస్తే మైల పడని దేవుడి గుడి మేము పూజలు చేస్తే మైల పడుతుందా? నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లిఖార్జున స్వామి జాతరలో అగ్ర కుల దాడి లో మరణించిన బేబీ మౌనిక కుటుంబానికి న్యాయం చేయాలని ఈ దుర్ఘటనకు కారకులైన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని , బాధితులకు న్యాయం జరగాలని. మరణించిన బేబీ మౌనిక ఆత్మ శాంతి కోసం కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ, ఏస్సి,ఏస్టి- జెఏసి జిల్లా నాయకులు ప్రశాంత్, మండల నాయకులు మహిపాల్,బాలయ్య కికిషన్,నగేష్,లక్ష్మణ్, సుమన్ మరియు యువకులు పాల్గొన్నారు.

## నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ (NMNF) క్రింద

### ప్రకృతి వ్యవసాయం అమలు పై అవగాహన శిక్షణ కార్యక్రమం నల్లవెల్లి రైతువేదిక



ఇందల్వాయి ( ప్రజా జ్యోతి న్యూస్) ఫిబ్రవరి.. 25 ఇందల్వాయి మండల కేంద్రంలోని నల్లవెల్లి గ్రామంలోని రైతువేదికలో ప్ర కృతి వ్యవసాయం అమలు పై అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించ బడింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కన్నె రాజేందర్ మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ నల్లవెల్లి వ్యవసాయ విస్తరణ అధికారి (AEO) రామకాంత్ గ్రామ రైతులు పాల్గొన్నారు.కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత, జీవామృతం బీజామృతం తయారీ విధానం, మల్చింగ్ పద్ధతులు, తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందే మార్గాలు, నేల ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించారు.మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ గారు మాట్లాడుతూ, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సహజ పద్ధతులను అనుసరించడం ద్వారా నేల సారాన్ని పెంచి రైతుల ఆదాయాన్ని మెరుగుపరచవచ్చని తెలిపారు. రైతులు NMNF పథకం ద్వారా అందించే శిక్షణలు సాంకేతిక సలహాలను వినియోగించుకోవాలని సూచించారు. సర్పంచ్ కన్నె రాజేందర్ గారు గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించేందుకు గ్రామపంచాయతీ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు చురుకుగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## ఆధునిక పద్ధతులపై అవగాహన



కోటగిరి ప్రజా జ్యోతి కోటగిరి మండలంలోనీ సుద్దాలం గ్రామంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు వరి సాగులో ఆధునిక పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ తడి పొడి విధానం ద్వారా యాజమాన్యం ,నేరుగా వరి వితే పద్ధతి,భూసార పరీక్షలు ఆధారంగా ఎరువులు వినియోగం వంటి ఆధునిక సాగు విధానాలపై రైతులకు వివరించారు. నూతన సాగు పద్ధతులను అనుసరించడం వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గడమే కాకుండా కులిల వ్యాయం సుమారు 8000 వరకు ఆదా అవుతుందని,సాగు సమయం కూడా గణనీయంగా తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ అధికారులు ఏరియా మేనేజర్ అరుణ్ కమ్యూనిటీ ఫెసిలిటేటర్ ప్రశాంత్, లక్ష్మణ్ సామాజిక సేవ కార్యకర్త తోట శ్రీకాంత్, గ్రామ సర్పంచ్ జగన్నాథ్ రావు,గ్రామ రైతులు సురేష్, గోవిందరావు, అనిల్, శివ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## బాల్య వివాహాల నిర్మూలన, చట్టలపై అవగాహన కల్పించేదుకు రథయాత్ర



ఇందల్వాయి ( ప్రజా జ్యోతి న్యూస్ ) ఫిబ్రవరి. 25 ఇందల్వాయి మండల కేంద్రంలోనిఇందల్వాయి గ్రామంలో సాధన స్వచ్ఛంద సంస్థ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణకు రథయాత్రకు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మిజిస్ట్రేట్ ఖుష్బు గారు ప్రారంభించారు. లైన్ డిపార్ట్మెంట్ సహకారంతో బాల్య వివాహ విముక్తి ప్రచార రథయాత్రలో భాగంగా ఇందల్వాయి గ్రామంలో బాల్య వివాహాలపై అవగాహనా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ, గ్రామ ప్రజలు మరియు సాధన చీ+రా సిబ్బంది వినేష్ కుమార్, నిరీక్షణ తదితరులు పాల్గొన్నారు. బాల్య వివాహాలకు ప్రోత్సహిస్తే కఠినంగా శిక్షించబడతారు. బాల్య వివాహాలను జరిపితే 1098 సమాచారం ఇవ్వగలరని కోరుతున్నాం.

## ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా



కామారెడ్డి ప్రతినిధి ఫిబ్రవరి 25. (ప్రజాజ్యోతి) జిల్లాలో నేటి నుండి ప్రారంభమైన ఇంటర్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షల సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు.పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రశ్నాపత్రాల భద్రత, సీసీ కెమెరాల పర్యవేక్షణ, విద్యార్థుల హాజరు శాతం,హాల్ టికెట్ల తనిఖీ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, నిబంధనల ప్రకారం సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని, మాల్ప్రాక్టీస్‌కు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు మొబైల్ ఫోన్లు పరీక్ష కేంద్రాలకు తీసుకురాకుండా చూడాలని, సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట ఇంటర్మీడియట్ అధికారి , తహసిల్దార్ హిమబిందు, ప్రిన్సిపల్, తదితరులు ఉన్నారు.



## కారేగాం మంజీరా సరిహద్దులో ఇసుక క్వారీకి అనుమతులు ఉన్న రోడ్డు విషయంలో సమస్యలు తలెత్తుతాయా

### – ఓవైపు మహారాష్ట్ర మరోవైపు తెలంగాణ రైతుల నారాజ్





పోతంగల్ ప్రజాజ్యోతి నిజామాబాద్ జిల్లా కారేగాం మంజీర శివారు ప్రాంతంలో ఇసుక క్వారీకి పర్మిషన్లు ప్రభుత్వం ఇచ్చినప్పటికీ, గత కొద్దిరోజుల క్రితం కారేగం రైతులు, గ్రామస్తులు ఇసుక త్రవ్వకాలను ఆపివేసిన సంఘటన జరిగింది, ఇదే క్రమంలో ఇసుక క్వారీ నుంచి ఇసుకను ఓ రైతు యొక్క పొలము లీజుకు తీసుకొని భారీగా డంపు చేస్తున్నారు, డంపు చేసిన ఇసుకను అభివృద్ధి పనుల కోసం ఇసుక అవసరం ఉన్న వారి కోసం ప్రభుత్వ పనుల కోసం తరలించవలసి ఉండగా ఆ రహదారి గుండా వెళ్లాల్సిన వాహనాలు అధిక లోడుతో వెళ్లడం వల్ల రోడ్లు ధ్వంసం అవుతాయని ఓవైపు మహారాష్ట్ర రైతులు మరోవైపు తెలంగాణ రైతులు నా రాజుగా ఉన్నట్టు తెలుస్తుంది. అయితే ఇసుక ప్రస్తుతం డంపు మాత్రమే చేస్తున్నారని ఇసుక తరలించే విషయంలో వాహనాలు అడ్డుకుంటామని మహారాష్ట్ర రైతులతో పాటు తెలంగాణ రైతులు అంటున్నారు ఏదైతే రోడ్డు రైతులే వేసుకున్నారని ఈ రోడ్డు గుండా ఇసుకను ఎలా తరిస్తారు చూస్తామని ఓ వైపు మహారాష్ట్ర రైతులు అదే విధంగా తెలంగాణ రైతులు కూడా అంటున్నట్టు తెలుస్తుంది. ఒకవేళ రహదారి బంద్ అయితే ఇసుక తరలింపు కష్టమవుతుంది. రహదారి బంద్ చేయనీయకుండా ఇప్పటికే రైతులపై కొంతమంది జులుం చూపిస్తున్నట్లు ప్రచారం జోరుగా జరుగుతుంది మహారాష్ట్ర రైతులు మాత్రం రోడ్డు మా సరిహద్దులు ఉందని అదేవిధంగా మా పొలంలో నుంచి ఉందని మహారాష్ట్ర బోర్డర్లో ఉందని మేము వెళ్ళనీయమంటూ భీష్మించు కూర్చున్నట్టు తెలుస్తుంది అయితే స్థానికంగా ఉన్న కొంతమంది ప్రజలు మాత్రం మహారాష్ట్ర రైతులకు ఒప్పించి ఇసుక తరలించే కార్యక్రమం చేస్తాం అన్నట్టు ప్రచారం మాత్రం జోరుగా జరుగుతుంది. ఏది ఏమైనా ఇసుక తరలించే సమయంలో లొల్లిలు అయ్యే పరిస్థితిలో ఉన్నాయని చర్చలు మాత్రం జోరుగా వినిపిస్తుంది. మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా అత్యంత లోతులో అదే విధంగా కూలీలతో ట్రాక్టర్లతో చేయాల్సిన పనులు చేయడం లేదని విమర్శలు మాత్రం జోరుగా వినిపిస్తుంది అక్కడున్న కాంట్రాక్టర్లకు వివరణ కోరగా ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్నామని అన్ని పత్రాలు తమ వద్ద ఉన్నాయని, చట్టబద్ధంగానే గ్రామస్తులకు, రైతులకు ఆమోదయోగ్యంగానే, ఇసుక డంపు చేస్తున్నామని తరలింపు తమకు తెలువదని తరలించే విషయం ప్రభుత్వం లేక అధికారులు చూసుకుంటారని సమాధానం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా తహసిల్దార్ గంగాధర్ వివరణ కోరగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అనుమతులు ఇచ్చి క్వారీలు నడుపుతున్నారని జిల్లా కలెక్టర్ అనుమతులు తీసుకోవడం జరిగిందని సమాధానం ఇచ్చారు.

## తెలంగాణ విశ్వవిద్యాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ




నిజామాబాద్ రూరల్: ఫిబ్రవరి, 25 (ప్రజా జ్యోతి) జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఈ నెల 28న ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నారు. రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ (లండన్), విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో "రసాయన మరియు జీవ రసాయన స్వరూప పురోగతి" అనే అంశంపై ఈ సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం వర్సిటీ ఉపకులపతి ఆచార్య టి. యాదగిరిరావు ఆవిష్కరించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో జరుగుతున్న నూతన పరిశోధనలు, ఆవిష్కరణలు విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం శాస్త్రవేత్తల కృషిని స్మరించుకునే రోజుగా మాత్రమే కాకుండా, యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే వేదికగా ఉపయోగపడాలని ఆకాంక్షించారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ వాసం చంద్రశేఖర్ మాట్లాడుతూ, రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ హైదరాబాద్ చాప్టర్ నుండి ప్రముఖ వక్తలు హాజరై రసాయన శాస్త్రం, జీవ రసాయన రంగాల్లో తాజా అభివృద్ధులపై ప్రసంగించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సు పరిశోధకులు, అధ్యాపకులు, పీజీ మరియు డిగ్రీ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. శాస్త్ర విజ్ఞాన విస్తరణకు వేదికగా నిలిచే ఈ సదస్సు విజయవంతం కావాలని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి. రాంబాబు, ఆచార్య ఆంజనేయులు, ఆచార్య పి. కనకయ్య, డాక్టర్ పాత నాగరాజు, డాక్టర్ ఏ. నాగరాజు, డాక్టర్ సాయిలు, డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ ప్రసన్న శీలా తదితరులు పాల్గొన్నారు.

## 'రైతు'లకు భరోసా ఇక లేనట్లేనా...?

- నేటికీ అతిగతి లేని పెట్టుబడి సాయం
- యాసంగి సీజన్ దాటుతున్న రాని పైకం
- అప్పుల పాలై ఆగమవుతున్న కర్షక లోకం
- పంచాయతీ ఎన్నికలు, సంక్రాంతి, మున్సిపల్ ఎన్నికలు కోడ్ పోగానే అంటూ కాలయాపన
- క్యాబినెట్లో భరోసా పై ఆశలు అడియాశలు
- ఇదేనా రైతు ప్రభుత్వం ప్రజాపాలన
- ప్రభుత్వంపై రైతుల మండిపాటు








సదాశివనగర్ ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) యాసంగి సీజన్ దాదాపు ముగింపు దశకు చేరుకున్నా రైతులకు అందాల్సిన పెట్టుబడి సాయం మాత్రం ఇప్పటికీ అతి గతి లేకుండా పోయిందనే రైతులలో ఆవేదన వ్యక్తమవుతోంది. సాగు పనులు పూర్తిచేసి పంటలు పొలాల్లో నిలిచినా, ప్రభుత్వంచే హామీ ఇచ్చిన 'రైతు భరోసా' పైకం మాత్రం రైతుల ఖాతాల్లో జమ కాలేదని అన్నదాతలు మండిపడుతున్నారు.

**వడ్డీలకు అప్పులు.. వేదనలో రైతులు**

పంటల కోసం విత్తనాలు, ఎరువులు, మందులు కొనుగోలు చేయడానికి రైతులు ప్రైవేట్ సాహుకారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. బ్యాంకుల్లో రుణాల ప్రక్రియ ఆలస్యం కావడం, ప్రభుత్వ సాయం రాకపోవడంతో రైతులు అప్పులపాలై ఆర్థికంగా కుదేలవుతున్నారని గ్రామీణ ప్రాంతాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. "ప్రతి సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు మాత్రం మౌనం ఎందుకు పాటిస్తోంది?" అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

**ఎన్నికల కోడ్ పేరుతో కాలయాపన?**

పంచాయతీ ఎన్నికలు, సంక్రాంతి తర్వాత మున్సిపల్ ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, కోడ్ ముగిసిన వెంటనే నిధులు విడుదల చేస్తామని అధికార వర్గాలు చెబుతున్నాయన్న ప్రచారం జరుగుతోంది. అయితే, అధికారికంగా స్పష్టత లేకపోవడం రైతుల్లో అనుమానాలకు తావిస్తోంది. ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపిస్తూ కాలయాపన చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**క్యాబినెట్‌లోనూ చర్చలేదా?**

ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో కూడా రైతు భరోసా అంశంపై స్పష్టమైన ప్రకటన రాకపోవడం రైతుల్లో అసంతృప్తిని పెంచింది. "ఇదేనా రైతు ప్రభుత్వం? ఇదేనా ప్రజా పాలన?" అంటూ రైతు సంఘాలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాయి.పంటల కాలం గడిచిపోతుండగా, రైతుల సమస్యలు మరింత తీవ్రమవుతున్నాయని వారు అంటున్నారు.

**ప్రభుత్వంపై మండిపాటు**

రాష్ట్రంలో వ్యవసాయమే ప్రధాన వృత్తిగా ఉన్నప్పటికీ, రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించడంలో నిర్లక్ష్యం చూపుతోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. రైతు సంక్షేమమే ముఖ్యమని చెప్పే ప్రభుత్వం, పెట్టుబడి సాయం విషయంలో స్పష్టత ఇవ్వకపోవడం ఆశ్చర్యకరమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పుల భారంతో కర్షక లోకం ఆగమవుతున్న వేళ, తక్షణమే రైతు భరోసా నిధులను విడుదల చేసి రైతులకు నిజమైన భరోసా ఇవ్వాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. రైతు భరోసా పై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వకపోతే, రైతు సంఘాలు ఆందోళనలకు దిగే అవకాశముందని సంకేతాలు కనిపిస్తున్నాయి.

### మిత్తులకు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టిన

యాసంగి పంటకు ప్రభుత్వం రైతు భరోసా వేయకపోవడంతో పెట్టుబడుల కోసం మిత్తులకు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టినశీ సకాలంలో రైతు భరోసా వేస్తే విత్తనాలకు, ఎరువులకు ఇబ్బందులు ఉండేవి కావు. ఇప్పుడైనా ప్రభుత్వం రైతు కష్టాలు తెలుసుకొని రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేసి ఆదుకోవాలి.



గైని సాయిలు రైతు, ఉత్తునూర్

### గత ప్రభుత్వమే మంచిగుండే రైతుబంధు టైంకు వేస్తుండే

గత టిఆర్ఎస్ కెసిఆర్ ప్రభుత్వం రైతులకు రైతుబంధును ప్రతి సీజన్ కు ముందే వేస్తుండే. విత్తనాలకు, ఎరువులకు దుక్కులకు అవసరానికి ఉపయోగపడుతుంది. ఇప్పుడు టైంకు రాక రైతులు ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుంది.



దొడ్లే పర్వతరావు రైతు

# సరస్వతి విగ్రహ నిర్మాణానికి ఆర్థికసాయం





**చిన్నకోడూరు, ఫిబ్రవరి25,(ప్రజా జ్యోతి):-** విద్యకు ప్రతీకగా భావించే చదువులతల్లి సర్వస్వతి అమ్మవారి విగ్రహ నిర్మాణం విద్యార్థుల్లో మంచి జ్ఞానాసక్తి పెంపొందిస్తుందని ప్రముఖ వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మండల పరిధి కస్తూరిపల్లి పాఠశాలలో నిర్మించబోయే సరస్వతి విగ్రహ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జ్ఞానం, సేవతో కూడిన సమాజాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. విద్యాభివృద్ధి కోసం సహాయం చేయడంలో తాను ఎప్పుడు ముందుంటానని వంగ రాజేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. సరస్వతి దేవి విగ్రహ ఏర్పాటు కోసం ఇరవై వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామ అభివృద్ధి, విద్యారంగంలో ప్రోత్సాహం అందించడం పట్ల వంగ రాజేశ్వర్ రెడ్డి ని కస్తూరి పల్లి గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ తాళ్లపల్లి స్వామి, ఉప సర్పంచ్ గోవింద గిరి స్వామి, పడిగే లింగం, వార్డు మెంబర్లు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశంలో పాల్గొన్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి









**మిరుదొడ్డి, ఫిబ్రవరి 25, (ప్రజా జ్యోతి):** మిరుదొడ్డి మండల పరిధిలోని లక్ష్మీనగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన లబ్ధిదారుల గృహప్రవేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మంద అనూష లక్ష్మారెడ్డి, పబ్బతి స్వప్న భూపాల్ రెడ్డి, ఆకుల హారిక రాజు, వల్లపు రెడ్డి సరస్వతి చంద్ర రెడ్డి తదితరులు చెరుకు శ్రీనివాస్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. సొంతింటి కల నెరవేర్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు ఇల్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అలాగే నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పట్ల హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, "అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఇల్లు అందించేలా చర్యలు తీసుకుంటోంది. పేదల సంక్షేమమే మా ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వప్న రాజు, ఆరెపల్లి రాజిరెడ్డి, భూపాల్ గౌడ్,కిష్టయ్య, శ్రీధర్, కనకా రెడ్డి, తో పాటు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ మార్కండేయ స్వామి దేవస్థానం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



**మిరుదొడ్డి, ఫిబ్రవరి 25, (ప్రజా జ్యోతి ):** మిరుదొడ్డి మండల కేంద్రంలోని శ్రీ మార్కండేయ స్వామి దేవస్థాన నూతన కార్యవర్గాన్ని బుధవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో భక్తుల సమక్షంలో కమిటీని ఎన్నుకున్నారు. దేవస్థాన కమిటీ అధ్యక్షులుగా జనార్ధన్, ఉపాధ్యక్షులుగా గడ్డం స్వామి, చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శులుగా గడ్డం ఆంజనేయులు, సుతారి ఆంజనేయులు, కోశాధికారిగా గడ్డం నర్సింలు ఎన్నికయ్యారు. ప్రధాన సలహాదారులుగా సుతారి రమేష్, గడ్డం బాల నారాయణ, సభ్యులుగా సుతారి వెంకటేశం, గడ్డం శ్రీనివాస్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు జనార్ధన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆలయ పరిపాలన పారదర్శకంగా కొనసాగించేందుకు కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేస్తారని పేర్కొన్నారు. అలాగే ఈనెల 26న దేవస్థాన 39వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాలలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

# సంగారెడ్డి ఎస్ఎఫ్ఐ నూతన జిల్లా అధ్యక్షులుగా రాజేష్ ఎన్నిక



**జహీరాబాద్, ఫిబ్రవరి 25( ప్రజా జ్యోతి న్యూస్)** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) సంగారెడ్డి 08వ జిల్లా మహా సభలు 20, 21 తేదీలలో జహీరాబాద్ పట్టణంలో జయప్రదంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ మహాసభలో కోహీర్ మండలం పిచ్చేరాగడి గ్రామానికి చెందిన టి రాజేష్ నీ జిల్లా కార్యదర్శి ఏకగ్రీవంగా ఎనుక్కోవడం జరిగింది. ఈ సందర్భంగా టి.రాజేష్ మాట్లాడుతూ.. నా పై పెట్టిన బాధ్యతను విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహిస్తానని అన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగాన్ని విస్మరించడం సరికాదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కొఠారి కమిషన్ ప్రకారం 10 నిధులు కేటాయించాలనీ, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులు కేటాయించి విద్యారంగాన్ని అభివృధి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అందుకనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్లో నిధులు కేటాయించా లని డిమాండ్ చేశారు. జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటలు నిర్వహిస్తామన్నారు.

## రాజీవ్ రాదారిపై ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

– సిద్ధిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్



**ములుగు ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి)** ములుగు మండలం బంతిమామిడి మార్కెట్ కమిటీ ముందు రహదారిపై వచ్చి పోయే వాహనాలకు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిద్దిపేట కమిషనర్ రష్మీ పెరుమాళ్ హెచ్చరించారు. బుధవారం వంటిమామిడి మార్కెట్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.మార్కెట్ కమిటీ పరిసరాల్లో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలు వాహనాల రాకపోకల క్రమబద్ధీకరణ పై క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మార్కెట్ కమిటీ ప్రతినిధులు, వర్తకులు, పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ప్రధానంగా మార్కెట్కు వచ్చే భారీ వాహనాలు,లారీలు,రాజీవ్ రహదారిపై ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా నిర్ణీత పార్కింగ్ ప్రదేశాలలోనే నిల్పాలని ఆమె ఆదేశించారు. ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారం కోసం రెవెన్యూ, మార్కెటింగ్,పోలీస్ శాఖలు ఒకరికి ఒకరు సమన్వయంతో సహకరించుకుంటూ పనిచేయాలని పిలుపునిచ్చారు. మార్కెట్ కమిటీ లోపల బయట క్రమశిక్షణ పాటించేలా వ్యాపారస్తులు పోలీసులకు సహకరించాలని,అక్రమ పార్కింగ్ లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రహదారి పై వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని స్థానిక పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక గజ్వేల్ ఏసిపి నర్సింలు,గజ్వేల్ రూరల్ సీఐ రవిరాజు,ములుగు ఎస్సై రఘుపతి,మార్కెట్ కమిటీ సెక్రెటరీ రేవంత్, ఇతర పోలీస్ సిబ్బంది, కడపల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

**మిరుదొడ్డి, ఫిబ్రవరి 25, (ప్రజా జ్యోతి):** ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారం మిరుదొడ్డి మండల కేంద్రంలో ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల కళాశాల మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు సమయానికి హాజరై పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అలాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేయబడింది. పరీక్షలకు హాజరైన విద్యార్థులను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేసి హాల్ టికెట్లు పరిశీలించిన అనంతరం మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షలకు హాజరై ప్రశాంతంగా పరీక్షలు రాశారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ కొనసాగించారు. మొత్తం పరీక్షా ప్రక్రియ సజావుగా కొనసాగినట్లు అధికారులు తెలిపారు.

# మనుషుల్లో మమేకమైన కొండముచ్చు





**నర్సాపూర్ ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి)** ఆకలి తీర్చే ఆపన్న హస్తం కనిపిస్తే అడవి జంతువులైనా సరే మచ్చికవుతాయని ఈ దృశ్యం నిరూపిస్తోంది. పట్టణంలోని ప్రధాన కూడలి వద్ద గల జాతీయ రహదారి 765డి మినీ ప్రయాణ ప్రాంగణంలో బుధవారం ఓ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. గత కొన్ని నెలలుగా పట్టణంలో ఓ కొండముచ్చు ఇక్కడి ప్రజలకు చిరపరిచితమైపోయింది. సాధారణంగా కోతి జాతులు మనుషులను చూసి భయపడటం లేదా ఇబ్బంది పెట్టడం చూస్తుంటాం. కానీ ఈ కొండముచ్చు మాత్రం ఇక్కడి వ్యాపారులతో, స్థానికులతో ఎంతో స్నేహపూర్వకంగా మసలుకుంటోంది. ఎవరికీ ఎటువంటి హాని తలపెట్టకుండా, తనదైన శైలిలో పట్టణంలో తిరుగుతూ అందరినీ అలరిస్తోంది.

**ఆకలిని గమనించి.. అరటిని అందించి..**

ఎండ తీవ్రతకు సేద తీరేందుకు మినీ ప్రయాణ ప్రాంగణంలోని ప్రహరీ గోడపై ఈ కొండముచ్చు విశ్రాంతి తీసుకుంటుండగా అక్కడికి వచ్చిన ఓ వృద్ధుడు దాని ఆకలిని గమనించి, ప్రేమతో తన వద్ద ఉన్న అరటిపండును ఆ కొండముచ్చుకు అందించాడు. ఆ మూగజీవి ఏమాత్రం బెరుకు లేకుండా ఆయన చేతి నుంచి పండును తీసుకోవడం అక్కడి వారిని ఆశ్చర్యపరిచింది. వ్యాపారులు, ప్రయాణికులు ఇచ్చే తినుబండారాలను ఆరగిస్తూ, ఈ కొండముచ్చు పట్టణ జీవనంలో అంతర్భాగమైపోయింది. అడవి నుంచి దారి తప్పి వచ్చినా, ఇక్కడి మనుషుల మమకారం చూసి ఇది పట్టణాన్ని తన నివాసంగా మార్చుకోవడం విశేషం.

## బీసీ పసి బిడ్డ ప్రాణాలు తీసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి

– ఇందిరమ్మ రాజ్యంలో బహుజనులకు రక్షణ లేదా

– పీపడ్ పల్లి మోహన్ బిఎస్పీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు

– స్వతంత్రం వచ్చి 70 ఏళ్లు దాటుతున్న కులాల పేరుతో చంపడం సరైంది కాదు

– పెత్తందారుల అహంకారాన్ని మాట్టుపెడతాం..!



**రాయికోడ్ ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి)** ఇందిరమ్మ రాజ్యం పేరుతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో బహుజనుల ప్రాణాలకు రక్షణ లేదని బహుజన్ సమాజ్ పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పీపడ్ పల్లి మోహన్ విమర్శించారు.బుధవారం నాడు రాయికోడ్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరలా సమావేశంలో మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో రెండు నెలల బీసీ చాకలి బిడ్డ ప్రాణాలు బలిగొన్న ఆధిపత్య వర్గాల వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.హోం శాఖను తన వద్దే పెట్టుకొని పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన చేతకాకుంటే తక్షణమే రాజీనామా చేయాలని మండిపడ్డారు. కులవివక్షతో రజక సామాజిక వర్గానికి చెందిన వారిని ఆలయంలోకి రానివ్వకపోవడంతో జరిగిన గొడవలో 2 నెలల చిన్నారి మృతి చెందితే పోలీసులు నిందుతులను పట్టుకోకుండా వారి పక్షానే మాట్లాడటం సిగ్గుచేటాని వాపోయారు. రాష్ట్రంలో బహుజన కులాల పై దాడులు,దౌర్జన్యాలు జరుగుతుంటే ముఖ్యమంత్రి ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి ప్రత్యేక ఆర్థిక సహాయం చేసి రక్షణ కల్పించాలన్నారు.బాధిత కుటుంబానికి న్యాయం చేయకుంటే బహుజనులంతా ఏకమై పెద్దఎత్తున ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని, అసెంబ్లీ నీ ముట్టడి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీ హెచ్చరించారు.

# ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

**చిన్నకోడూరు, ఫిబ్రవరి25,(ప్రజా జ్యోతి):-**మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. పరీక్షలకు మొత్తం 193 మంది విద్యార్థులు హాజరుకాగా, 02 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు.

# వ్యక్తికి ఐదు రోజుల కారాగార శిక్ష

**చిన్నకోడూరు, ఫిబ్రవరి25,(ప్రజా జ్యోతి)** రోడ్డుపై మద్యం సేవించటమే కాకుండా విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిని అడ్డుకొని అసభ్య పదజాలంతో దూషించిన వ్యక్తికి కోర్టు ఐదు రోజుల కారాగార శిక్ష విధించినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. నారాయణరావు పేట మండలం మల్యాల గ్రామానికి చెందిన దోతీ శంకర్ మద్యం సేవించి వాహనం నడుపుతూ, ప్రజలకు ఇబ్బంది కలిగించి దురుసు ప్రవర్తనతో వ్యవహరించినందుకు న్యాయస్థానం శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**కొల్చారం (ప్రజాజ్యోతి) పిబ్రవరి 25:** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించే క్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ బుధవారం పరీక్షల తొలి రోజున కొల్చారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సందర్భంగా పరీక్షా హాళ్లలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పనితీరును, పరీక్షల నిర్వహణ విధానాన్ని నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు వివరాలను ఆరా తీశారు. నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోనే ప్రశ్నాపత్రాలను తెరిచారా లేదా అన్నది పరిశీలించారు. సీసీటీవీ నిఘా మధ్య ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నారా అనే విషయాన్ని పరిశీలించారు.పరీక్షా కేంద్రాల్లో తాగునీటి సదుపాయం, మెడికల్ కిట్‌తో ఏఎన్ఎం అందుబాటులో ఉండటం, టాయిలెట్ వసతులు వంటి మౌలిక సదుపాయాలను కూడా పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పరీక్షలు పూర్తైన వెంటనే ఆన్సర్ షీట్లను తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు సురక్షితంగా తరలించాలని సూచించారు. ఎలాంటి కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకతతో, పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ తనిఖీలో సంబంధిత పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మరియు అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు మోసం చేస్తున్న ఫామ్ ల్యాండ్‌లపైన చర్యలు తీసుకోవాలి

– సర్వే చేసి రిజిస్ట్రేషన్ చేయాలి

– మండల కెవిపిఎస్ నాయకులు గణపతి తుకారం




**నారాయణఖేడ్ పిబ్రవరి 25 ప్రజా జ్యోతి)** ప్రజలకు మోసం చేస్తున్న ఫామ్ ల్యాండ్ ల పైన చర్యలు తీసుకోవాలని సర్వే చేసి రిజిస్ట్రేషన్ చేయాలని మండల కెవిపిఎస్ నాయకులు గణపతి తుకారం తెలిపారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గణపతి మాట్లాడుతూ..... నాగలిగిద్ద మండలంలో ఇటీవల వివిధ పేర్లతో హరితవనం, మదర్ ఇండియా, వి జె ఆర్, అరబిందో లాంటి ఏర్పడిన ఫార్మ్ ల్యాండ్స్/వెంచర్ల కారణంగా భూములు కొనుగోలు చేసిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,ముఖ్యంగా హైదరాబాద్ ప్రాంతానికి చెందిన పలువురు అమాయక ప్రజలు సరైన సర్వే లేకుండా, కేవలం రోడ్డు పక్కన లేదా గట్టు దగ్గర చూపించిన భూములను కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు.భూములు కొనుగోలు చేసిన అనంతరం 6 నెలల నుంచి ఒక సంవత్సరం తరువాత తమ భూమి ఎక్కడుందో స్థలం తెలుసుకోవడానికి వెళితే, అవి చెరువు గట్టు, కొండ గట్టు లేదా ఇతర అనుకూలం కాని ప్రాంతాల్లో ఉన్నట్లు తెలిసి బాధితులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, సరైన సర్వే మరియు మ్యాపింగ్ లేకుండా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. అలాగే ఒక్క గుంట రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఫార్మ్ ల్యాండ్ నిర్వాహకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద రెండు నుంచి మూడు వేల రూపాయల వరకు వసూలు చేస్తూ, స్పష్టమైన మ్యాపింగ్ లేకుండానే రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా వెలిసిన ఫార్మ్ ల్యాండ్స్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని, భూములకు తప్పనిసరిగా పూర్తి స్థాయి సర్వే మరియు మ్యాపింగ్ నిర్వహించిన తరువాత మాత్రమే రిజిస్ట్రేషన్లు చేయాలని, గుంటల చొప్పున రిజిస్ట్రేషన్ చేసే ముందు కొనుగోలుదారులకు మీరు భూమి చూశారా కబ్జా చేసుకున్నారా అని అడిగి భూములు కొనుగోలు చేసిన బాధితులకు న్యాయం జరిగేలా రిజిస్ట్రేషన్ చేయాలని అన్నారు. ప్రజలను మోసం చేస్తున్న ఇలాంటి వాళ్లపై ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోని రిజిస్ట్రేషన్లు ఆపాలని లేనియెడల ప్రభుత్వ కార్యాలయాల ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్ చేసే ముందు సర్వే చేసిన తర్వాతనే రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో మండల కెవిపిఎస్ నాయకులుపాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై టాస్క్ ఫోర్స్

- పోలీసుల సంయుక్త దాడి



**యాలాల్ ఫిబ్రవరి 25 ప్రజా జ్యోతి :** యాలాల్ కోకట్ గ్రామం శివారులోని కాగ్న వాగు నుండి అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నట్లు సమాచారం టాస్క్ ఫోర్స్ సిబ్బంది యాలాల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించారు. దాడుల సందర్భంగా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని యాలాల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సంబంధిత వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై విట్టల్ రెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేసిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టేందుకు నిరంతర తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.

## అబ్దుల్లాపూర్ మెట్ మండల సర్పంచుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక





**అబ్దుల్లాపూర్ మెట్టు ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి) :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండల నూతన సర్పంచుల సమావేశం ఏర్పాటు చేసుకుని అన్ని గ్రామాల సర్పంచుల సమక్షంలో ఏకగ్రీవంగా నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జక్క రవీందర్ రెడ్డి (గండిచెరువు), ప్రధాన కార్యదర్శిగా కందికంటి విజయ్ కుమార్ (బండరావిరాల), ఉపాధ్యక్షులుగా ఉప్పు మాధవి-నవీన్ కుమార్ (బలిజగూడ), కోట ప్రభాకర్ రెడ్డి (పిగ్లీపూర్) రాచపాక నవనీత-మహేశ్ (అనాజ్‌పూర్), కోశాధికారిగా ఎర్రవల్లి గౌరీశంకరాచారి (బాటసింగారం)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నుకొన్న కార్యవర్గం తో పాటు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు మందుగుల విజయ-శ్రీశైలం గౌడ్ (అబ్దుల్లాపూర్ మెట్), పబ్బతి బాలకిషన్ గౌడ్ (చిన్నరావిరాల), కోలన్ లక్ష్మీప్రసన్న -రవీందర్ రెడ్డి (కవాడిపల్లి), దేశారం రాఘవేందర్ గౌడ్ (ఇనాంగూడ), అంతటి హేమలత-జంగయ్య గౌడ్ (గుంతపల్లి) , ఎర్ర వెంకటేష్ యాదవ్ (జాఫర్ గూడ ), మేడిపల్లి ప్రియ-చంద్ర శేఖర్ గౌడ్ (మజీద్ పూర్), అల్లి ఐలయ్య యాదవ్ (లష్కర్ గూడ) తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ వేడుకలకు రంగన్నను ఆహ్వానించిన పబ్బతి బాలకిషన్ గౌడ్



**అబ్దుల్లాపూర్ మెట్టు ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి) :** అబ్దుల్లాపూర్ మెట్టు మండలం పరిధిలోని చిన్న రావిరాల గ్రామపంచాయతీలో నేటి నుండి ఘనంగా నిర్వహించ తలపెట్టిన శ్రీశ్రీశ్రీ మాణిక్యాంబ సమేత సోమలింగేశ్వర స్వామి నవ దశమ 19వ వార్షిక కళ్యాణ రథోత్సవ వేడుకలకు విచ్చేయాలంటూ ఇబ్రహీం పట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకొని ఆహ్వాన పత్రికను అందజేశారు చిన్న రావిరాల గ్రామ సర్పంచ్ పబ్బతి బాల కిషన్ గౌడ్. ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు ఉదయం 7:15 నుండి గణపతి పూజ స్వస్తి హవాచకం, రక్షాబంధనం, అంకురార్పణ, రుద్రాభిషేకము, నవగ్రహ పూజ, హోమం నిర్వహించడం జరుగుతుందని, అనంతరం రాత్రి 8 గంటలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు.రేపు శుక్రవారం సాయంత్రం 6 గంటలకు స్వామి వారి కళ్యాణ మహోత్సవము ఘనంగా నిర్వ హించడం జరుగుతుందని, అనంతరం కల్యాణ మహోత్సవానికి విచ్చేసి భక్తుల కోసం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈనెల 28 శనివారం రోజు ఉదయం 5 గంటల నుండి అగ్నిగుండాలు రథోత్సవము చక్రవారి సేవ నిర్వహించడం జరుగుతుందని కళ్యాణ మహోత్సవ వేడుకలకు భక్తులు భారీ సంఖ్యలో విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని చిన్న రావిరాల గ్రామ సర్పంచ్ పబ్బతి బాల కిషన్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## చిల్కానగర్ డివిజన్లో వైకుంఠధామం మౌలిక సదుపాయాల పరిశీలన





**ఉప్పల్ ఫిబ్రవరి 25 ప్రజా జ్యోతి :** మన ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు చిలుకనగర్ 7వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ అక్కిటి ఆగం రెడ్డి ఆధ్వర్యంలో మన డివిజన్ పరిధిలోని వైకుంఠధామము యొక్క మౌలిక సదుపాయాలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో వైకుంఠధామం లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారని విమర్శించారు వైకుంఠధామం లో 'పిచ్చి మొక్కలు' ఏపుగా పెరగడంతోపాటు కనీస వసతి అయిన 'నీటి సౌకర్యం' లేకపోవడంతో 'దహన సంస్కారాలకు' వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రని 'ఆవేదన' వ్యక్తం చేశారు. ప్రస్తుతం మన ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ మందముల పరమేశ్వర్ రెడ్డి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపిస్తున్నారని, ఆయా సమస్యల పరిష్కారానికి గాను రానున్న రోజుల్లో మెరుగైన మౌలిక వసతులను కల్పించే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ యొక్క కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బజార్ జగన్ గౌడ్ కొంపల్లి బాలరాజ్ నల్లవల్లి మహేందర్ గండికోట గణేష్ దండగుల శంకర్ మాము అమర్, కూరేలి యాదగిరి, కొండ్ర రాములు, రామ్ చర్ల బలరాం, పల్నాటి కిష్టయ్య పొడిశెట్టి కృష్ణ భాస్కర్ రెడ్డి, పల్నాటి డేవిడ్, మారపాక సాయిలు, బి .ఎం కిరణ్ పల్నాటి రమేష్ ,పగడం రాంనర్సయ్య, సంధ్య, గండికోట భరత్, మహేందర్, కిరణ్, సోనా మరియు బస్తీ వాసులు తదితులు పాల్గొనడం జరిగింది.

### సాంకేతికతతో వ్యవసాయం

# కుసుమ పంట లాభదాయకం

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్





**వికారాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 25(ప్రజా జ్యోతి):** రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ వ్యవసాయాన్ని చేపట్టాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతి జైన్ సూచించారు. బుధవారం పూడూరు మండలం మరియాపూర్ గ్రామంలో భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ( ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసర్చ్) ఆధ్వర్యంలో నిర్వహించిన కుసుమ పంట క్షేత్ర దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ కుసుమ పంట రైతులకు లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటగా మారుతోందన్నారు. తక్కువ నీటితో సాగు చేయగలగడం, ఎండలను తట్టుకునే స్వభావం ఉండడం వల్ల వర్షాధార ప్రాంతాలకు ఇది అనుకూలమని చెప్పారు. జిల్లాలో సుమారు 2 లక్షల 26 వేల ఎకరాల్లో కుసుమ పంట సాగవుతోందని, రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిందని వెల్లడించారు. అధిక ఉత్పత్తి, మెరుగైన ఉత్పాదకత కలిగిన పంటలను సాగు చేస్తే రైతులకు మంచి లాభాలు వస్తాయని పేర్కొన్నారు. వ్యవసాయం ఒక సాంకేతిక అంశమని, ప్రతి రైతు స్మార్ట్‌ఫోన్‌ను వినియోగించి ఆధునిక పద్ధతులను అనుసరించాలని సూచించారు. అధిక దిగుబడులు ఇచ్చే పంటలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పంట మార్పిడి విధానాన్ని పాటించాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుండి దేశ స్థాయి వరకు వ్యవసాయాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. శాస్త్రవేత్తలు కుసుమ పంటలో మెరుగైన విత్తన రకాలు, సమయానుకూల విత్తనం, ఎరువుల సమర్థ నిర్వహణ, సమగ్ర పురుగు నియంత్రణ (ఐపీఎం), నీటి వినియోగ సమర్థత వంటి అంశాలపై వివరించారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు ఆదాయ భద్రత కల్పించే ముఖ్యమైన నూనెగింజల పంటగా కుసుమ నిలుస్తుందని తెలిపారు. కుసుమ పంటపై అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన ఈ క్షేత్ర దినోత్సవం రైతులకు ఉపయోగకరంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఆర్ కె మాతూర్ ఆత్మ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, శాస్త్రవేత్తలు డాక్టర్ జవహర్, డాక్టర్ సతీష్, డాక్టర్ సురేష్, తహసీల్దార్ విజయ్ కుమార్, సర్పంచ్ పద్మ, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

### జక్కపల్లి ముకుందాపూర్ గ్రామాలను

# సందర్శించిన ఎంపీడీవో ఎమ్మార్వో

జక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాల కార్యక్రమాన్ని పరిశీలించారు





**యాలాల :(ఫిబ్రవరి 25) ప్రజా జ్యోతి :** మండలం పరిధిలోని జక్కపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ముకుందాపూర్ గ్రామంలో అంగన్వాడి కేంద్రం ప్రాథమిక పాఠశాలలో బాత్‌రూమ్ టాయిలెట్ గది నిర్మాణానికి సంబంధించిన సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించారు. మండల అభివృద్ధి అధికారి శ్రీనిజ ఎమ్మార్వో వెంకటస్వామి సమక్షంలో గ్రామాన్ని సందర్శించి పాఠశాల పరిస్థితిని పరిశీలించారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడం అత్యంత ప్రాధాన్యమని పేర్కొంటూ,బాత్‌రూమ్ టాయిలెట్ గది నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికారులు ఈ సందర్భంగా మాట్లాడుతూ... జక్కపల్లి గ్రామాన్ని సందర్శించిన ఎమ్మార్వో ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాల కార్యక్రమాన్ని పరిశీలించారు.విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, పరిశుభ్రత, వంటశాల పరిస్థితులు, ఆహార నిల్వ విధానం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో బాత్‌రూమ్ టాయిలెట్ గది నిర్మాణానికి సంబంధించిన సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించడంతో సర్పంచ్ అనిల్ కుమార్ గ్రామస్తులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.పాఠశాలలో మౌలిక వసతుల మెరుగుదలతో విద్యార్థులకు మరింత అనుకూల వాతావరణం ఏర్పడనుంది అన్నారు,

# విజయ విద్యాలయం ఆస్తులపై విజయం సాధిస్తాం

- ఎన్ని శక్తులు అడ్డొచ్చిన అడ్డుకొని తీరుతాం - ధనం ఆశతో దండు కట్టారు!
- రక్షించాల్సిన వారే భక్షకులుగా మారారు - త్రిబుల్ వన్ సర్వే నంబర్ పై పోరాటం ఆగదు
- రాజకీయ శక్తులే అక్రమానికి అండగ నిలిచాయా!





**తాండూరు ఫిబ్రవరి 25 ప్రజాజ్యోతి :** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని సర్వేనెంబర్ 111లోని ప్రభుత్వ భూమిలో విజయ విద్యాలయం హై స్కూల్ కొనసాగుతుంది. ఇట్టి పాఠశాలకు చెందిన భూమి కొంత ఖాళీ స్థలం ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉంది. దీనిపైన కన్నేసిన కొందరు నాయకులు వ్యాపారస్తులు ఆ భూమిని ఖాజేయడం కోసం అనేక ప్రయత్నాలు చేశారు. అందులో కొందరు వ్యతిరేకించగా మరికొందరు సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ భూమిని విద్యాలయానికి చెందినదిగా అధికారులు నిర్ధారించినప్పటికీ ఏమాత్రం పట్టించుకోకుండా దర్జాగా పాఠశాల నిర్మాణం ముసుగులో ఇష్టానుసారంగా ఎలాంటి అనుమతులు లేకుండా కట్టడాన్ని కొనసాగిస్తున్నారు. ఇదంతా కూడా తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయానికి అతి చేరువలో ఉన్నప్పటికీ అటువైపు జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై కనీసం చూడలేదా అంటూ అధికారులపై విమర్శలు ఉన్నాయి. కోట్ల విలువ చేసే ప్రభుత్వ ఆస్తిని కాపాడాల్సిన అధికారులు అక్రమార్కులతో జతకట్టారా అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఇట్టి భూమిని రక్షించాలని అక్రమార్కులపై తిరుగుబాటు ఎగురవేసి వ్యతిరేకించిన వారిలో సగానికి పైగా అక్రమార్కులతో జతకట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాలకు చెందిన ఆస్తిని కాపాడాల్సిన బాధ్యత అందరి పైన ఉందని పూర్వ విద్యార్థులతో పాటు కమిటీ సభ్యులు కూడా అప్పట్లో అనేక ప్రయత్నాలు చేసి ఇప్పుడు ఎందుకు సైలెంట్ అయ్యారు అనేది కోటి ప్రశ్నగా మిగిలింది. కొందరు వ్యక్తులు మీడియాలో రాకుండా చూస్తాం అధికారుల దృష్టిని మళ్లించకుండా ప్రయత్నం చేస్తాం అనే విధంగా ఒప్పందలు కుదుర్చుకు న్నట్లు సమాచారం ఉంది. త్రిబుల్ వన్(111) సర్వే నంబరు మొత్తం భూమి కూడా ప్రభుత్వానిదే నని స్వయంగా అధికారులే తేల్చినప్పటికీ ఎందుకు పట్టించుకోవడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. అప్పట్లో ఈ భూమి మొత్తం ప్రభుత్వానికి చెందుతుందని పెద్దగా బోర్డును కూడా ఏర్పాటు చేశారు. అప్పుడు కొన్నాళ్లకే బోర్డును పీకేశారు.

అయినా అప్పట్లో అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు.

డబ్బున్నోడిదే రాజ్యం అన్నట్లు అక్రమాలు చేయడానికి ప్రభుత్వ ఆస్తులు ఆక్రమించుకోవడానికి ఏమైనా చేయొచ్చేమో అనేది అందరిలో కలుగుతున్న అనుమానాలు. ఎంతోమంది ఎదురుచూస్తున్న ఈ భూమి ఎవరి గుప్పెట్లోకి వెళుతుందని ప్రశ్నించుకుంటున్నారు. ఆఖరుకు విద్యాలయం లేకుండా చేయడానికి ప్రయత్నిస్తున్నారేఒమో అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఎంతో పేరు ప్రఖ్యాతలుగాంచిన విజయ విద్యాలయం పాఠశాల ఆస్తులను కాపాడడం కోసం పూర్వ విద్యార్థులతో పాటు అనేకమంది మద్దతు తెలిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తుంది. రాజకీయ బలంతోనే ఇలా చేస్తున్నారని విమర్శలు కూడా ఉన్నాయి. మరి ఏం జరుగుతుందో చూడాలి. కోర్టు సూచనలను పాటిస్తారా లేక బేకాతర్ చేస్తారా అనేది వేచి చూడాలి.

## మారేడ్ పల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ సమస్యలపై ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు విజ్ఞప్తి





**బోయిన్ పల్లి, ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి) :** మారేడ్ పల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన ప్రిన్సిపాల్ మరియు స్టాఫ్ బుధవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కళాశాలలో విద్యార్థులు, విద్యార్థినీల కోసం ప్రత్యేక టాయిలెట్ల నిర్మాణం చేపట్టాలని, కళాశాల ప్రాంగణంలో అంతర్గత రహదారులు వేయించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన నిధులు సమకూర్చి నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడం తమ ప్రాధాన్యమని పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గంలోని పలు ప్రాంతాల ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిపై కూడా సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## శిక్షణ ఫౌండేషన్ ప్రేరణ పురస్కారాల పండుగ - 2026 క్విజ్ పోటీలు



**పరిగి, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి) :** శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రేరణ పురస్కారాల పండుగ -- 2026 కార్యక్రమంలో భాగంగా బుధవారం పరిగి మండలంలోని తొమ్మిది పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థులలో జ్ఞాన వికాసం, పోటీ స్ఫూర్తి పెంపొందించే లక్ష్యంతో నిర్వహించబడింది. ఈ పోటీలకు పరిగి మండల జెడ్పీహెచ్ఎస్ గడిసింగాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యా యులు జంప్ల, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. అలాగే శిక్షణ ఫౌండేషన్ సీనియర్ మెంటర్ తుల్జప్ప మెంటర్లు రమేష్, కవిత పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. క్విజ్ పోటీల్లో ఎంపీపీఎస్ మిట్ట కోడూరు పాఠశాల ప్రథమ స్థానం సాధించగా, ఎంపీయూపీఎస్ రంగంపల్లి ద్వితీయ స్థానం, ఎంపీపీఎస్ గడిసింగాపూర్ తృతీయ స్థానం దక్కించుకున్నాయి. విజేతలైన విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుని అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు.

## క్విజ్ పోటీలలో ప్రాథమిక పాఠశాల మిట్ట కోడూరు విద్యార్థులకు ప్రథమ బహుమతి



**పరిగి, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి) :** శిక్షణ ఫౌండేషన్ వారు జెడ్పీహెచ్ఎస్ గడిసింగాపూర్ కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీలలో ప్రాథమిక పాఠశాల మిట్ట కోడూరు విద్యార్థులకు మొదటి బహుమతి లభించడం జరిగింది. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎన్. జాంప్లా ద్వారా శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధుల ద్వారా బహుమతులు అందుకున్నారు రెండో బహుమతిగా యుపిఎస్, రంగంపల్లి విద్యార్థులు, మూడవ బహుమతి ప్రాథమిక పాఠశాల గడిసింగాపూర్ విద్యార్థులకు లభించింది. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఎం గోపాల్ పి ఆర్ టియు పరిగి మండల శాఖ అధ్యక్షులు ఇది బుగ్గయ్య గౌరవ అధ్యక్షులు ఎండి ఉస్మాన్ అలీ, ప్రధాన కార్యదర్శి వి.రాకేష్ విద్యార్థులను అలాగే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను , ఉపాధ్యాయులను అభినందించారు.

## గర్భిణీ స్త్రీ పట్ల మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్



**మేడ్చల్, ఫిబ్రవరి (ప్రజాజ్యోతి) 25 :** ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం పోలీసుల ప్రధాన కర్తవ్యమని మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ బి. సతీష్ నిరూపించారు. బుధవారం మేడ్చల్ సమీపంలోని కండ్లకోయ జంక్షన్ వద్ద విధుల్లో ఉన్న సమయంలో ఓ నిండు గర్భిణి అక్కడి నుంచి వెళ్తూ అకస్మాత్తుగా కళ్ళు తిరిగి పడిపోయి నడవలేని స్థితిలోకి వెళ్ళింది. అది గమనించిన కానిస్టేబుల్ అమేను సమీపంలోని చెట్టు నీడలోకి తీసుకెళ్లారు. ఆమె పరిస్థితిని పరిశీలించగా, ఆమెకు ప్రసవ వేదనలు వచ్చినట్లుగా గుర్తించి వెంటనే అంబులెన్స్ కు సమాచారం ఇచ్చి, సమీపంలోని ఆసుపత్రికి తరలించేలా చర్యలు చేపట్టారు. కానిస్టేబుల్ సతీష్ మానవత్వాన్ని చాటి శభాష్ అనిపించుకున్నారు.

## బాబా నగర్ డ్రైనేజీ సమస్యపై పర్యటించిన బీఆర్ఎస్ రాష్ట్రనాయకులు సాయిజెన్ శేఖర్



**ఉప్పల్ ఫిబ్రవరి 25 ప్రజా జ్యోతి :** నాచారం డివిజన్ బాబా నగర్ లో చాలా కాలంగా డ్రైనేజీ సమస్యలతో ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు సమస్య పరిష్కరించకుండానే కొత్త సిమెంట్ రోడ్లు వేశారని స్థానికులు దీ=హ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ ఈరోజు బాబా నగర్ లో సాయిజెన్ పర్యటించడం జరిగింది సమస్య ఉన్న అన్ని వీధుల్లో కలిసి తిరిగి చూడడం జరిగింది సమస్య పరిష్కారానికి తక్షణమే మ్యాన్ హోల్ టు మ్యాన్ హోల్ డీప్ క్లీనింగ్ చేసి సీటు తొలగించాలని అలాగే ఏవైనా ఆటంకం ఉంటే తక్షణమే రిపేర్ చేయించాలని డీజీఎం వేణుగోపాల్ కు ఫోన్ ద్వారా సూచించడం జరిగింది. అయినను సమస్య పరిష్కారం కానీ ఎడల తక్షణమే ఒక అడుగు డ్రైనేజీ లైన్ ఏర్పాటు కొరకు ప్రతిపాదనలు తయారు చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాబా నగర్ కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
## ఇంటర్ పరీక్షా కేంద్రాలు తనిఖీ చేసిన కలెక్టర్

కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి ): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమైన నేపథ్యంలో పలు పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల( ఆర్ట్స్& కామర్స్), ముకరంపురాలోని



నారాయణ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఇంటర్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను, సీసీ కెమెరా వ్యవస్థను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం, హాల్ టికెట్ల తనిఖీ, బందోబస్తు ఏర్పాట్లు తదితర విషయాలపై ఆరా తీశారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా చూడాలని అన్నారు. మాల్ ప్రాక్టీస్ కి ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జవాబు పత్రాల రవాణాకు పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షలు పూర్తయ్యేంతవరకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలని అన్నారు.ఒకేషనల్ కోర్సులు కలుపుకొని జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 15,389 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా మొదటిరోజు 400 మంది గైర్హాజరయ్యారు. 14,989 మంది పరీక్షలు రాశారు. మాల్ ప్రాక్టీస్ వంటి ఘటనలు ఏమీ చోటు చేసుకోలేదు.

# కుల వివక్ష దాడిలో పసికందు మరణం...

## నిందితులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్

ముస్తాబాద్, ఫిబ్రవరి 24( ప్రజా జ్యోతి ): ఇటీవల నాగర్ కర్నూల్ జిల్లాలోని కుమ్మెర గ్రామంలో కులవివక్ష కారణంగా మహిళపై జరిగిన దాడిలో రెండు నెలల పసికందు మృతి చెందిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ ఘటనలో నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు ముస్తాబాద్ మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద మండల రజక సంఘం ఆధ్వర్యంలో, బీసీ మరియు ఎస్సీ సంఘాల సహకారంతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిరసన అనంతరం ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు సమర్పించి, దుర్మార్గులపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి కుల అహంకారంతో బీసీ, దళిత కుటుంబానికి చెందిన మహిళపై అమానుషంగా దాడి చేసి పసికందు మరణానికి కారణమైన వారిపై హత్య కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే కుమ్మెర ఘటన నిందితులకు కఠిన



శిక్ష విధించాలని కోరారు. అలాగే బాధిత కుటుంబమైన గణేష్, చంద్రకళలకు ప్రభుత్వపరంగా రూ.50 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసులో సంబంధం ఉన్న వారందరిపై ఎలాంటి రాజకీయ ఒత్తిడులు లేకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రజక కుటుంబానికి న్యాయం జరిగే వరకు బడుగు బలహీన వర్గాలు ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఇలాంటి అమానుష ఘటనలను అన్ని వర్గాలు, అన్ని కులాల ప్రజలు ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రజక మండల సంఘం నాయకులు, బీసీ సంఘాల నాయకులు, ఎస్సీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన మార్కెట్ చైర్మన్



చొప్పదండి, ఫిబ్రవరి 25(ప్రజా జ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా చొప్పదండి మండలానికి చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివిన పాఠ్యాంశాలను ఇష్టంతో, ధైర్యంగా రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఈ పరీక్షలు పునాది వంటివని, అందువల్ల సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రశాంతంగా పరీక్షలు రాయాలని తెలిపారు.మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని, వారి కలలను నిజం చేయాలని కోరారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో, ఏకాగ్రతతో పరీక్షలు రాసి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు.

# కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో పుస్తే మట్టెలు అందజేత

తంగళ్ళపల్లి ఫిబ్రవరి 25(ప్రజా జ్యోతి): తంగళ్ళపల్లి మండలం నర్సింహులపల్లే గ్రామంలో పాడిరైతు కొండెటి



యాదిరెడ్డి, యాదలక్ష్మి ల కూతురు వెన్నెల వివాహానికి కరీంనగర్ డెయిరీ పుస్తెమట్టెలు అందజేసిన చిన్నలింగా పూర్ రూట్ సూపర్వైజర్ గుర్రం సతీష్ రెడ్డి. ఈసందర్భంగా గుర్రం సతీష్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ డెయిరీ అనేక సంక్షేమ కార్యక్రమాలు చెపట్టిందని అందులో భాగంగా కళ్యాణమస్తు పథకంలో భాగంగా ఆడబిడ్డ పెళ్లికి పుస్తెమట్టెలు అందజేశామని తెలిపారు. ఈకార్యక్రమంలో నర్సింహులపల్లే పాల ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షులు మంద దేవయ్య,డైరెక్టర్లు కొండెటి రాములు,పల్లె నర్సయ్య,సెక్రటరీ గొడిసెల బాబు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఉపాధి హామీ పనులు ప్రారంభం

తంగళ్ళపల్లి ఫిబ్రవరి 25(ప్రజా జ్యోతి) రామచంద్రపురం గ్రామంలో గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పనులు ప్రారంభించారు. ఈ



కార్యక్రమంలో రామచంద్రపురం గ్రామ సర్పంచ్ గంధం శ్రీనివాస్,ఉపసర్పంచ్ పొన్నాల నర్సింలు,వార్డు మెంబర్లు గడ్డం లహరి,గంధం లక్ష్మి, గంధం రమేష్, శేఖర్, పొన్నాల అమృత,గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాధవరెడ్డి,బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పొన్నాల చక్రపాణి,ఫీల్డ్ అసిస్టెంట్ పూర్ణచందర్ మరియు ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కుల వివక్ష రాజ్యమేలడం సిగ్గుచేటు

**డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్**
**మాణిక్యారం ఘటనపై సమతా సైనిక దళ్ ఆగ్రహం**
**బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలి**

ఎన్టిపిసి, (ప్రజాజ్యోతి), ఫిబ్రవరి 25: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం మాణిక్యారం గ్రామంలో మాజీ డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావుపై జరిగిన కుల వివక్ష, సామాజిక బహిష్కరణ ఉదంతాన్ని సమతా సైనిక దళ్ (SSD) తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో, అదీ ఉన్నత పదవులు నిర్వహించిన ఒక దళిత నాయకుడికే రక్షణ లేకపోవడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**అగ్రవర్ణ అహంకారం నశించాలి:**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామాలయ నిర్మాణం పేరుతో ఎస్సీ, ఎస్టీ





వర్గాలను దూరం పెట్టడం, వారిని అవమానించడం రాజ్యాంగ విరుద్ధమని మండిపడ్డారు. జనగం కోటేశ్వరరావు వంటి సీనియర్ నాయకుడిని సామాజికంగా వెలివేయాలని నిర్ణయించడం అగ్రవర్ణ అహంకారానికి పరాకాష్ట అని ధ్వజమెత్తారు. "జిల్లా స్థాయి నాయకుడి పరిస్థితే ఇలా ఉంటే, ఇక సామాన్య దళితుల పరిస్థితి ఏమిటి?" అని ఆయన ప్రశ్నించారు.

**చట్టపరమైన చర్యలు తీసుకోవాలి:**

గ్రామంలో కుల పిచ్చిని ప్రోత్సహిస్తూ, వర్గాల మధ్య చిచ్చు పెడుతున్న వారిపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠినమైన కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులెవరైనా సరే వదిలిపెట్టకూడదని, అణగారిన వర్గాలకు అండగా సమతా సైనిక దళ్ పోరాడుతుందని స్పష్టం చేశారు.

**ప్రజాస్వామిక వాదులు స్పందించాలి:**

దశాబ్దాలుగా కలిసిమెలిసి ఉంటున్న గ్రామంలో ఇలాంటి విద్వేష పూరిత చర్యలకు పాల్పడటం బాధాకరమని, మేధావులు, ప్రజాస్వామిక వాదులు ఈ ఘటనను ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. బాధితుడు కోటేశ్వరరావుకు తమ పూర్తి మద్దతు ఉంటుందని, న్యాయం జరిగే వరకు విశ్రమించేది లేదని డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ హెచ్చరించారు.

# ఏఐఎఫ్‌బీ జిల్లా కన్వీనర్‌గా కొలిపాక శ్రీనివాస్

## ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి
## పార్టీ బలోపేతమే లక్ష్యమని వెల్లడి

పెద్దపల్లి, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి): ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) పెద్దపల్లి జిల్లా కన్వీనర్‌గా కొలిపాక శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లాలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసే లక్ష్యంతో ఈ నియామకం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. తక్షణమే అమల్లోకి వచ్చే ఈ బాధ్యతల ద్వారా జిల్లాలోని మండల, పట్టణ, గ్రామ స్థాయి కమిటీలను సమన్వయం చేస్తూ పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయాలని శ్రీనివాస్‌కు సూచించారు.

నేతాజీ సుభాష్ చంద్ర బోస్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, సభ్యత్వ నమోదుతో పాటు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని జోజి రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై స్పందిస్తూ బాధితులకు అండగా నిలవాలని



ఆదేశించారు. తన నియామకంపై కొలిపాక శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేస్తూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తూ యువత, మహిళలు, అన్ని వర్గాల ప్రజలను పార్టీ వైపు ఆకర్షించేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. శ్రీనివాస్ నాయకత్వంలో పెద్దపల్లి జిల్లాలో ఏఐఎఫ్‌బీ మరింత బలోపేతం అవుతుందని పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేశాయి.

# ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

## తొలిరోజు 97 శాతం హాజరు
## జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన

పెద్దపల్లి, ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం అత్యంత ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జరిగిన లాంగ్వేజ్ (తెలుగు, హిందీ, ఉర్దూ) పరీక్షలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ తీరుపై జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కల్పన సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షా గణాంకాల వివరాలను వెల్లడిస్తూ, జిల్లాలో మొత్తం 5,419 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 5,271 మంది హాజరయ్యారని అధికారి తెలిపారు. వివిధ కారణాల వల్ల 148 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. దీనితో తొలిరోజు జిల్లాలో 97 శాతం హాజరు నమోదైనట్లు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు కల్పన వివరించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని వసతులు కల్పించామని, ఎక్కడా మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని ఆమె స్పష్టం చేశారు.

# హైదరాబాదులో జరిగే యాదవ ప్లీనరీ సమావేశానికి 28న యాదవ సభ్యులు పెద్ద ఎత్తున తరలి రావాలి

గంభీరావుపేట ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి): ఫిబ్రవరి 28న హైదరాబాద్లోని తెలుగు విశ్వ విద్యాలయం లో నిర్వహించనున్న దక్షిణ భారత దేశ యాదవ ప్లీనరి సమావేశానికి యాదవులంత తరలి రావాలని బుధవారం రోజున జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు



కొక్కు దేవేందర్ యాదవ్ పిలుపునిచ్చారు. గంభీరావుపేట మండలం లోని కొత్తపల్లి గ్రామంలో ప్లీనరి కి సంబంధించిన ప్రచార పోస్టర్స్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, ప్లీనరిలో యాదవుల సమస్యలపై చర్చించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. యాదవులు రాజకీయంగా చైతన్య వంతులు కావాలన్నారు. రాజ్యాధికారంలో భాగస్వాములు కావలన్నారు. 18శాతం జనాభా ఉన్న యాదవులకు మంత్రి పదవి ఇవ్వాలని, జనాభా ప్రాతిపాధికనా చట్ట సభల్లో యాదవులకు రిజర్వేషన్లు కల్పించాలని, ప్రత్యేక యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఏటా రూ. 5000కోట్లు కేటాయించాలని, డిమాండ్ చేశారు. ప్లీనరి ని విజయవంతం చేసి యాదవుల ఐక్యత చాటుదామన్నారు. రాష్ట్ర నలుమూలాల నుండి యాదవులు తరలి రావాలని కోరారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూత

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి )




స్థానిక నగరంలోని మంకమ్మ తోట గర్ల్స్ హైస్కూల్ పాఠశాల యందు ఆదరణ సేవా సమితి ఆధ్వర్యంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షా పలకలు పెన్నులు అందించారు . ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్.ప్రమిల మాట్లాడుతూ ఆదరణ సేవా సమితి వారు నిర్వహిస్తున్న పర్యావరణం పరిరక్షణ, ప్రభుత్వ పాఠశాలలో వారు చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. సమాజంలో ఆదరణ సేవా సమితి తన వంతు పాత్ర పోషిస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు కర్రె పావని రవి మాట్లాడుతూ ఆదరణ సేవా సమితి ద్వారా ప్రతి సంవత్సరం అనేకమంది ప్రభుత్వం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పరీక్షా పలకలు పెన్నులు అందించడం అదేవిధంగా పాఠశాల ప్రారంభ సమయంలో నోటుబుక్కులు స్కూల్ బ్యాగ్ లో అందించడం చేస్తున్నాము ఇంకా ముందు తన వంతు ఎలాంటి సహకారాలైనా సమాజానికి అందించడానికి ముందుగా ఉంటాము. అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కర్రె లాస్య, బీర్ల అనిల్ ఉపాధ్యాయురాలు రాధిక తదితరులు పాల్గొన్నారు.

# శాతవాహన ఫార్మసీ అధ్యాపకురాలు అశ్వినికి డాక్టరేట్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 25( ప్రజాజ్యోతి ) మానవ శరీరంలో హైపర్ టెన్షన్ (బిపి) నియంత్రణలో సాధారణ టాబ్లెట్లకు ప్రత్యామ్నాయంగా



ఈప్రోనియోసోమ్స్ పద్దతి పై చేసిన పరిశోధనకు గాను శాతవాహన ఫార్మసీ విభాగానికి చెందిన అధ్యాపకురాలు జె. అశ్విని చేసిన పరిశోదనకు అనురాగ్ విశ్వావిద్యాలయ పరీక్షల నియంత్రణ విభాగం డాక్టరేట్ ప్రదానం చేసింది. అనురాగ్ విశ్వవిద్యాలయ ఫార్మాసీ విభాగములో డీన్ డాక్టర్ వసుధా భక్షి పర్యవేక్షణలో "ఫార్ములేషన్ డెవలప్మెంట్, ఆప్టిమైజేషన్ అండ్ ఇవాల్యూయేషన్ ఆఫ్ ప్రోనియోసోమ్స్ ఆఫ్ యాంటి హైపెర్టెన్సివ్ డ్రగ్స్" అంశంపై తన పరిశోధన చేసారు.డాక్టరేట్ సాధించిన జె అశ్విని కరీంనగర్ ఎల్ఎండి సమీపంలోని శాతవాహన ఫార్మసీ కళాశాలలో గత 12 సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తు, ఫార్మసీ మహిళా విద్యార్థుల వార్డెన్గా కొనసాగుతున్నారు.<తనకు ఈ అవకాశం కల్పించిన విశ్వవిద్యాలయ యాజమాన్యముకు ఆధ్యాపకులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు.

# మండలంలో చెరువులు, కుంటలు, కాలువలపై అక్రమ నిర్మాణాలు – అధికారుల నిర్లక్ష్యంతో ప్రజల్లో ఆందోళన

ముస్తాబాద్, ఫిబ్రవరి 25( ప్రజా జ్యోతి ): మండల పరిధిలో చెరువు మండల పరిధిలో చెరువులు, కుంటలు, కాలువలకు సంబంధించిన ప్రభుత్వ జలవనరుల భూములపై అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి చెందిన భూములను కబ్జా చేసి శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై



సంబంధిత ఇరిగేషన్ డి.ఈ.ను వివరణ కోరగా, “హద్దులు చూపించడం మా బాధ్యత మాత్రమే. ఆ హద్దులలో ఎవరైనా నిర్మాణాలు చేపడితే అవి అక్రమాలు. వాటిని తొలగించే బాధ్యత గ్రామపంచాయతీ కార్యదర్శిదే” అని తెలిపారు. అదే అంశంపై గ్రామసభలో పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించగా, “ఇది ఇరిగేషన్ శాఖకు సంబంధించిన విషయం” అంటూ సమాధానం ఇవ్వడంతో ప్రజలు మరింత గందరగోళానికి గురయ్యారు. ఒక శాఖ మరొక శాఖపై బాధ్యత నెట్టివేయడంతో అక్రమ నిర్మాణాలపై ఎవరిని ప్రశ్నించాలి అన్న సందిగ్ధంలో ప్రజలు ఉన్నారు. ఇదిలా ఉండగా, ఈ అక్రమ నిర్మాణాలకు గ్రామపంచాయతీ నూతన సర్పంచ్, పాలకవర్గం అండదండలు ఉన్నాయనే చర్చలు గ్రామంలో వినిపిస్తున్నాయి. అధికారుల మధ్య సమన్వయం లోపించడంతో ప్రభుత్వ భూములు క్రమంగా ఆక్రమణకు గురవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణ స్థల పరిశీలన నిర్వహించి, నిర్మాణాలు ఎవరికి చెందినవో గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# ఇల్లందు కనుమరుగుకు బాధ్యులేవరూ!

- అధికారుల సమన్వయ లోపమే... ఇల్లందు ఏరియాకు శాపమా?
- గత అధికారులు ఏరియా మనుగడ కోసం ఆరాటం!
- భారీగానే కార్మికులు డిప్యూటేషన్ పై బదిలీలు
- డిప్యూటేషన్ పై బదిలీలలో పాటించని నియమనిబంధనలు?
- పూసపల్లి ఓసి ప్రారంభానికి మోక్షమేప్పుడో!
- కొన్ని కార్మిక సంఘాల పోరాటాలు సత్ఫలితాలు ఇస్తాయా
- పూసపల్లి ఓసిని ప్రారంభించాలని కార్మికులు వేడుకోలు
- డిప్యూటేషన్ కార్మికులు ఇక్కడికే వచ్చేలా చొరవ చూపాలంటున్న కార్మికులు
- ఉన్నతాధికారులు జర స్పందించరూ!







**ఇల్లందు, ఫిబ్రవరి 25, ప్రజాజ్యోతి:** సింగరేణి ఇల్లందులో పుట్టి 11 ఏరియాలలో వ్యాపించి, ప్రస్తుతానికి సుమారుగా 40 వేలకు పైగా కార్మికులు, సుమారుగా 30 వేలకు పైగా కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి కల్పించడం జరుగుతుంది. అధికారుల అలసత్వం.. కొన్ని కార్మిక సంఘాల నిర్లక్ష్యం వల్ల నేడు ఇల్లందు ఏరియా కనుమరుగయి, చరిత్ర పుటల్లోకి వెళ్లే పరిస్థితి నెలకొంది. సుమారుగా 130 ఏళ్లకు పైగా చరిత్ర ఇల్లందుకు ఉంది. 1886కు ముందు భద్రాచలం వెళ్తూ వంట చేసే క్రమంలో భూమిలో నుంచి మంటలు రావడంతో ఆ విషయాన్ని బ్రిటిష్ వారికి వారికి చెప్పడంతో ప్రతినిధులను పంపి సర్వే చేయగా భారీగా బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు జియో లాజిలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారి డాక్టర్ విలియం కింగ్ కనుగోన్నారు. అప్పుడు హైదరాబాద్ దక్కన్ కంపెనీ లిమిటెడ్ ను ఏర్పాటు చేసి బొగ్గు త్రవ్వకాలను ప్రారంభించారు. కాలక్రమేణా దక్కన్ కంపెనీ పేరును సింగరేణి కంపెనీ లిమిటెడ్ గా మార్చి హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాలలో సర్వే నిర్వహించి బొగ్గు నిక్షేపాలను కనుగొనడం జరిగింది. ఇల్లందు ఏరియాలో స్టట్ ఫిట్ జెకె 1,2,3,4,5, 29 డిప్ గనులతో పాట మరికొన్ని గనులను ఒక్కొక్కటిగా మూసివేస్తూ ఓసి 1.2 లను ఏర్పాటు చేసి కొంతకాలంలోనే ఓసి 2ను సైతం మూసివేయడం జరిగింది. ఇల్లందులో అపార బొగ్గు నిక్షేపాలు ఉన్నప్పటికీ అండర్ గ్రౌండ్ బావులకు బదులుగా ఓసీలను ఏర్పాటు చేసి బొగ్గు నిక్షేపాలను అతి తొందరగా తరలిస్తూ కనుమరుగు అయ్యేందుకు కుట్రలు జరిపారని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఓసీలలో 100 నుండి 120 మీటర్ల లోతు వరకు బొగ్గు వెలికి తీసి అవకాశం ఉంటుంది. అంటే సుమారుగా 1600 మీటర్ల లోతున ఉన్న బొగ్గులో కేవలం 10 శాతమే తీస్తుండగా మిగిలిన 90 శాతం బొగ్గు భూమిలోనే సమాధి చేస్తున్నారు. గతంలో సుమారుగా 10 వేలకు పైగా కార్మికులతో కళకళలాడిన ఇల్లందు ఏరియా నేడు సుమారుగా 400లకు పైగా కార్మికుల ఉండగా వారిలో సుమారుగా 120 మందికిపైగా కార్మికులను ఇతర ఏరియాలకు డిప్యూటేషన్ పై బదిలీ చేయడం జరిగింది. గత కొన్నేళ్ల క్రితం జెకె5 ఓసి కాలం పూర్తి అవడంతో యాజమాన్యం ప్రత్యామ్నాయంగా జెకె5 ఓసి పొడగింపు ప్రాజెక్ట్ (పూసపల్లి ఓసి) కు ప్రస్తావన తెరమీదకు రావడం జరిగింది. జెకె5 ఓసిలో బొగ్గు ఉత్పత్తి పూర్తికాక ముందే నూతన పొడగింపు ప్రాజెక్టు అప్పటి అధికారులు వేగవంతం చేసినప్పటికీ ప్రస్తుత అధికారుల వల్ల ఆ ప్రాజెక్టు ముందుకు సాగడం లేదనే అపవాదు లేకపోలేదు. పైగా జెకె 5ఓసి పొడిగింపు ప్రాజెక్టుకు అనుమతులన్నీ వచ్చాయని సెప్టెంబర్ లో పనులు ప్రారంభమవుతాయని అధికారులు చెప్పినప్పటికీ నేటికి ఆ పనులు ప్రారంభం కావడానికి మరికొన్ని అనుమతులు రావాల్సి ఉన్నాయని అధికారులు చెప్పడం కోసమెరుపు. గతంలో సెప్టెంబర్ నెలలో నూతన ఓసి పనులు ప్రారంభమవుతాయని అధికారులు చెప్పిన కానీ నూతనంగా మరికొన్ని అనుమతులను బూచిగా చూపెడుతున్నారని, అధి కారుల మాటలు నీటి మీద రాతలేనా అని కార్మికులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. గత కొన్ని నెలల నుంచి జెకె5 ఓసిలో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా బంద్ అయింది. ఇక్కడ పని చేసే కార్మికులతో పాటు సిహెచ్పిని సైతం పూర్తిగా బంద్ చేసి అక్కడ పనిచేసే కార్మికులను ఇతర ఏరియాలకు డిప్యూటేషన్ పై బదిలీ చేశారు. వర్క్ షాప్ లతో పలు విభాగాల్లో కార్మికులను కూడా తగ్గించుకుంటూ వస్తున్నట్లు సమాచారం. ఇక ఇల్లందు ఏరియాకు తలమానికంగా ఉన్న కోయగూడెం ఓసిలో కూడా బొగ్గు అంతంతమాత్రంగానే ఉత్పత్తి అవుతుందని, ప్రధానంగా బొగ్గు గ్రేడింగ్ వల్ల మార్కెట్ లో కొంత ఇబ్బంది కలుగుతున్న మాట వాస్తవమేనని అధికారులు కోరుకుంటున్నారు. ఇల్లందు ఏరియాలో జి13, జి 14 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి అవుతుందని, అందులో నుంచి సేల్ బొగ్గును వేరుచేయగా చాలా వరకు వెస్ట్ బొగ్గు మినహా జి14 బొగ్గు చాలా తక్కువ వస్తుందని అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా గత రెండేళ్ల క్రితమే కెఓసి పిట్ 3 పనులు ప్రైవేట్ సంస్థకు కేటాయించగా అప్పట్లో పలు కార్మిక సంఘాలు ఆందోళనల వల్ల పనులు ప్రారంభం కాలేదు. అయితే కెఓసి పిట్ 3ని సింగరేణి సంస్థ ద్వారానే ఓబీ, బొగ్గును తీయాలని డిమాండ్ చేసినప్పటికీ అటు ప్రైవేట్ సంస్థ, ఇటు సింగరేణి సంస్థ ద్వారా నేటికి పనులు ప్రారంభం కాక తీవ్ర జాప్యం జరుగుతుందని కార్మికులు పేర్కొంటున్నారు. కాగా ఇల్లందు ఏరియా కనుమరుగు అవ్వడానికి బాధ్యులేవరోనని కార్మికులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా స్థానిక అధికారుల మధ్య సమన్వయ లోపం వల్లనే ఇల్లందు ఏరియాకు శాపంగా మారిందని ఇల్లందులో జోరుగా చర్చ జరుగుతుంది. గతంలో ఇల్లందు ఏరియాలో పనిచేసిన అధికారులందరూ సమన్వయంతో పనిచేయడం వల్లనే నూతన ఓసి కోసం నిరంతరం కృషి చేయడం జరిగిందని, ప్రస్తుత అధికారుల్లో ఆ తాపత్రయం, ఆరాటం ఎక్కడా కనిపించడం లేదని కార్మికులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఇల్లందు ఏరియాలో నూతన ఓసి (పూసపల్లి ) పనులు ప్రారంభమైతే ఇక్కడ నుంచి వివిధ ఏరియాలకు డిప్యూటేషన్ పై బదిలీ అయినా కార్మికులను తిరిగి ఇల్లందుకే రప్పించవచ్చనే ముందస్తు ఆలోచనతో పంపినప్పటికీ అది సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదని, ఇక తాము డిప్యూటేషన్ పై వెళ్లిన ఏరియాలలోనే విధులు కొనసాగించాల్సి వస్తుందని కార్మికులు కంటతడి పెడుతున్నారు. అంతేకాకుండా కార్మికులను డిప్యూటేషన్ పై బదిలీ చేసిన క్రమంలో సీనియార్టీ ప్రకారం కాకుండా ఒక ప్రధాన గుర్తింపు సంఘం సూచనల మేరకే ఆ ఒక్క కార్మిక సంఘానికి అనుకూలంగా ఉన్నవారిని సుదూర ప్రాంతాలకు పంపకుండా ఇల్లందుకు దగ్గరలో ఉన్న ఏరియాలకు పంపినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా సింగరేణి సంస్థ ఉన్నతాధికారులు చొరవ చూపి పూసపల్లి ఓసి పనులను త్వరితగతిన ప్రారంభించాలని, అందుకు కావలసిన అనుమతులు వచ్చేందుకు స్థానిక అధికారులతో పాటు ఉన్నతాధికారులు కృషి చేయాలని కార్మికులు వేడుకుంటున్నారు. ఇల్లందు ఏరియా బొగ్గు ఉత్పత్తి తగ్గడం, నూతన ప్రాజెక్టు కాలయాపన వల్ల ఇతర ఏరియాలకు డిప్యూటేషన్ పై బదిలీ చేసిన కార్మికులను మరల ఇదే ఏరియాకు వచ్చేలా చూడాలని కార్మికులు కోరుతున్నారు.

**ఇల్లందు ఏరియాకు పొంచి ఉన్న ముప్పు..?**

ఇల్లందు ఏరియాలో బొగ్గు నిక్షేపాలు తగ్గడం, నూతన ప్రాజెక్టులు రాకపోవడం వల్ల ఇల్లందు ఏరియాకు ముప్పు పొంచి ఉందనేది తెలుస్తుంది. సాధారణంగా ఒక ఏరియాలో బొగ్గు నిక్షేపాలు తగ్గుతున్న క్రమంలోనే ముందస్తుగా అక్కడి అధికారులు, ఉన్నతాధికారుల పర్యవేక్షణలో అదే ఏరియాలో ఎక్కడ బొగ్గు నిక్షేపాలు ఉన్నాయో సర్వే నిర్వహించడం జరుగుతుంది. ఆ సర్వే ఆధారంగా యాజమాన్యం ఆ నూతన ప్రాజెక్టు అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వంలోని ఆయా శాఖలకు ప్రాజెక్టు అనుమతుల కోసం నివేదికలను పంపిస్తారు. ఆ నివేదికలకు సంబంధించిన అనుమతులు కాలయాపన కాకుండా నిత్యం సింగరేణి సంస్థ ఉన్నతాధికారులతో పాటు స్థానిక అధికారులు కూడా సమీక్ష సమావేశాలు నిర్వహించి, అనుమతుల కోసం మరేమైన వివరాలు పంపించాల్సి వస్తుందా లేదా అనేది అధ్యయనం చేయడం జరుగుతుంది. కానీ ఇల్లందు ఏరియాలో మాత్రం గతంలో పనిచేసిన అధికారులకు ఉన్న శ్రద్ధ ప్రస్తుత అధికారులకు లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఇల్లందు ఏరియా మనుగడ కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు స్థానిక ఎమ్మెల్యే, ప్రాతినిధ్య సంఘ నాయకులు ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి, మంత్రులు, కారంబికి సంఘ అగ్ర నాయకుల దృష్టికి తీసుకు వెళ్తున్నట్టు సమాచారం. గుర్తింపు సంఘం కూడా వారి వారి స్థాయిలో ఇల్లందు ఏరియా మనుగడ కోసం కృషి చేస్తున్నట్టు తెలుస్తుంది. ఏదిఏమైనా ఇప్పటివరకు నూతన ఓసికి అనుమతులు రాలేదని అధికారులు చెప్పడం వెరసి, ఇల్లందు ఏరియా మనుగడ కోసం సింగరేణి యాజమాన్యం ఎలా స్పందిస్తుందో.. ప్రాతినిధ్య సంఘం మినహాయించి, మిగిలిన కార్మిక సంఘాల వైఖరి ఏమిటోనన్న ఉత్కంఠ కార్మికులతో పాటు ప్రజల్లో నెలకొంది. సింగరేణికి పుట్టినిల్లయిన ఇల్లందు మనుగడ కొనసాగుతుందా.. లేక చరిత్ర పుటల్లో నిలువనుందా అనేది తెలియాలంటే వేచి ఉండాల్సిందే..

### గుడిపాడు శ్రీ మోక్ష వేంకటేశ్వరస్వామి
## ఆలయ ప్రతిష్ట మహోత్సవ పూజల్లో పాల్గొన్న
### రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల దంపతులు






**పాల్వంచ, ఫిబ్రవరి 25 ,ప్రజా జ్యోతి** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ 9వ డివిజన్ గుడిపాడు గ్రామంలో నూతనంగా పునర్నిర్మాణం జరుగుతున్న శ్రీదేవి, గోదాదేవి సమేత శ్రీ మోక్ష వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవ 5వ రోజు పూజలు ఘనంగా నిర్వహించారు. బుధవారం పూజారి సింహాద్రి కందాల ఆనందకుమారాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజ కార్యక్రమంలోరాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సతీమణి 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పులి నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు, అనంతరం దేవాలయం విశిష్టతలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత, 9వ డివిజన్ కార్పొరేటర్ చరపా శాంత, కార్పొరేటర్లు పైడిపల్లి జయలక్ష్మి, దంతేబోయిన నరేష్, ధర్మసోత్ నరేష్, కాంగ్రెస్ నాయకులు జాలే జానకిరెడ్డి, యర్రంశెట్టి ముత్తయ్య, కోండం వెంకన్న గౌడ్, ఎస్.వి.ఆర్.కె ఆచార్యులు, డాక్టర్ యుగంధర్ రెడ్డి, కొత్తా వెంకటేశ్వర్లు, పైడిపల్లి మహేష్, వాసుమల్ల సుందర్ రావు, కందుకూరి రాము, దారా చిరంజీవి, ఖ మహీధర్, సందుపట్ల శ్రీనివాస రెడ్డి, రేనాటి శ్రీనివాసరావు, సందు ప్రభాకర్, మాలోత్ కోటి నాయక్, చరపా పాపారావు, రాములు నాయక్, బ్యాంకు చారి, డిష్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పు నాగమణి కౌన్సిలర్‌కు ఘన సన్మానం

– ఐఎన్టీయూసీ క్రాంతి కుమార్



**సత్తుపల్లి ఫిబ్రవరి25(ప్రజా జ్యోతి)** సత్తుపల్లి పట్టణం ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో సత్తుపల్లి 13 వ వార్డ్ మున్సిపల్ కౌన్సిలర్ గా ఎన్నికైన ఉప్పు నాగమణి హనుమంతరావు ను సింగరేణి ఐఎన్టీయూసీ యూనియన్ నాయకులు పోగుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా శాలువలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన ఐఎన్టీయూసీ జాయింట్ జనరల్ సెక్రటరీ తీగల క్రాంతి కుమార్ ఐఎన్టీయూసీ నాయకులు. ఈ సందర్భంగా తీగల క్రాంతి కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మరియు స్థానిక శాసనసభ్యులు మట్ట రాగమయి దయానంద్ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ సహకారాలతో 13 వ వార్డులో ఉన్న పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచి ప్రభుత్వం అందించే అన్ని సంక్షేమ పథకాలను వర్తింపజేసి ప్రజాక్షేత్రంలో మంచి పేరు ప్రఖ్యాతలు సాధించి వార్డు అభివృద్ధిలో , నియోజకవర్గ అభివృద్ధిలో తోడ్పడాలని తెలియజేశారు. అదేవిధంగా వార్డు అభివృద్ధిలో , నియోజకవర్గం అభివృద్ధి లో ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో సింగరేణి ఐఎన్టియుసి యూనియన్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ ఫర్వీన్ బాజీ ,మాజీ వార్డ్ కౌన్సిలర్, కొమ్మేపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు , ఐఎన్టీయూసీ నాయకులు , కార్యకర్తలు,ఉద్యోగులు పాల్గొన్నారు.

### ఎన్ఎంఎంఎస్‌కి ఎంపికైన
## పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ మడుపల్లి విద్యార్థి

– దునుకు ఆకాష్ నాగరామ్ సాయి

**మధిర ప్రజా జ్యోతి** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గత నవంబర్లో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ ప్రతిభా పరీక్ష నందు పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ మడుపల్లి విద్యార్థి దునుకు ఆకాష్ నాగరామ్ సాయి సత్తా చాటి జాతీయస్థాయి ఉపకార వేతనానికి అర్హత సాధించాడని హెచ్ఎం తోట నరసింహారావు మరియు ఉపాధ్యాయులు, గ్రామస్తులు, ఏఏపిసిచైర్మన్ శ్రీమతి వేమిరెడ్డి నాగలక్ష్మి, కౌన్సిలర్లు పిల్లి సునీత, వేమిరెడ్డి లక్ష్మి తులసి , శీలం నర్సిరెడ్డి అభినందించారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షకు ప్రత్యేకంగా శిక్షణనిచ్చిన బి. జ్ఞానేశ్వరాచారి, కే. ఆదాము ,పి .కిషోర్‌లను హెచ్ఎం మరియు గ్రామ పెద్దలు అభినందించారు.



### గుడిపాడు గ్రామంలో దేవతామూర్తుల
## విగ్రహాల ప్రతిష్టకు ఘనంగా ప్రత్యేక పూజలు

– గోవిందా నామస్మరణతో మారుమోగుతున్న పాల్వంచ పట్టణం







గోవింద నామస్మరణతో మారుమోగింది.

**పాల్వంచ, ఫిబ్రవరి 25 ,ప్రజా జ్యోతి** పాల్వంచ పట్టణ పరిధిలోని గుడిపాడు గ్రామంలో గల శ్రీ మోక్ష వెంకటేశ్వర స్వామి దేవస్థానం లో ఈనెల 26 గురువారం జరిగే వివిధ దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ట సందర్భంగా ఆలయంలో దేవతామూర్తుల విగ్రహాలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు , శిథిలావస్థకు చేరిన శ్రీ మోక్ష వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని తిరిగి పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు కోట్ల రూపాయలతో నిర్మాణం చేసిన శ్యామల గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ నల్లారి సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీదేవి, గోదాదేవి సమేత శ్రీ మోక్ష వెంకటేశ్వర స్వామి వారి దివ్య ప్రతిష్ట మహోత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారి విగ్రహముల ధాన్యాదివాసము పూజా మహోత్సవ కార్యక్రమం లో కుటుంబ సమేతంగా సురేష్ రేడ్డి ప్రవళిక దంపతులతో పాటు , ఆలయానికి చేరుకున్న భక్తులు ప్రతిష్ట విగ్రహాలకు వరి ధాన్యం సమర్పించి స్వామి వారి ఆశీస్సులు తీసుకొని తీర్థ ప్రసాదాల స్వీకరించారు, నేడు నిర్వహించనున్న విగ్రహాల ప్రతిష్ట సందర్భంగా ఆలయంలో ఉదయం నుండి సాయంత్రం వరకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా భక్తులు ఉమ్మడి జిల్లాల నుండే కాకుండా, వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని నేడు ఆలయంలో ప్రతిష్టించనున్న దేవతామూర్తుల విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు, దీంతో పాల్వంచ పట్టణం గోవింద నామస్మరణతో మారుమోగింది.

## బీటెక్ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో మిస్టు విద్యార్థుల ప్రతిభ



**సత్తుపల్లి ఫిబ్రవరి25(ప్రజా జ్యోతి)** మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో గల మదర్ తెరిసా ఇంజనీరింగ్ అటానమస్ కళాశాలలో 25-26 విద్యా సంవత్సరంలో గత జనవరి నెలలో నిర్వహించిన ఫస్ట్ బీటెక్ మొదటి సెమిస్టర్, సెకండ్ బిటెక్ మొదట సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో మదర్ తెరిసా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలను సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చలసాని హరి కృష్ణ బుధవారం తెలియజేశారు.ఫస్ట్ బిటెక్ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల వివరములు బ్రాంచ్‌ల వారిగాసిఎస్సి విభాగం నుండిదోడ యశ్వంత్ 9.40, కటికి నాగరాజు 9.40, దామర్ల లోకేష్ 9.35, చింతలపాటి నాగేశ్వరి 9.20 ఎస్జీపిఏలు సాధించారు. ఏఐ అండ్ ఎంఎల్ విభాగం నుండిముచ్చింతల. అమృత వర్షిని 9.85, వార అంజలి 9.55, మొహమ్మద్ సోఫియా 9.40 ఎస్ జి పి ఎ లు సాధించారు.సి ఎస్ డిఎస్ విభాగం నుండిరాళ్ల బండి ప్రసన్నలక్ష్మి 9.10, కానూరి సువర్చల నాగ హన్సిక 8.95, సోరెమ్ ఉదయ్ 8.40, ఎస్ జి పి ఏ సాధించారు.ఈ సి ఈ విభాగం నుండి గుత్తి యూనిష 9.39, బూడే ప్రణతి 9.29, కటికి శరణ్య 9.10, ఎస్ జి పి ఏ సాధించారు.ఈ ఈ ఈ విభాగం నుండి చీకటి కృష్ణ కౌశిక్ 8.86, తేజావత్ సింధు 8.48, దంతాల కీర్తన 8.34,ఎస్ జి పి ఏ లు సాధించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం నుండిబలవంతపు విక్రమ్ 7.65, పసల హేమంత్ కుమార్ 7.10 ,ఎస్ జి పి ఏ లు సాధించారు.సెకండ్ బిటెక్ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల వివరములు.సిఎస్సి విభాగం నుండిఅంబటి సత్య శ్రీ 9.70,బత్తుల భరత్ కుమార్ 9.55, మేకల ప్రవళిక 9.50 ఎస్ జి పి ఏ లు సాధించారు.ఏఐ అండ్ ఎంఎల్ విభాగము నుండిమలిశెట్టి భవాని 8.95 రాపోలు నాగ హిందు మతి 8.90, జల్లిపల్లి స్పందన 8.75, సిత్రాల. గౌతమి 8.75 ఎస్ జి పి ఏ లు సాధించారు.ఈసీఈ విభాగం నుండిషేక్.ఇజాజ్ 9.65, నాయుడు రుచిత 9.55, కొమ్మ.శైలజ 9.50 ఎస్ జి పి ఎల్ సాధించారు.ఈఈఈ విభాగం నుండిమొహమ్మద్ సమ్రాహ మహేక్ 9.65, నిమ్మల నాగేశ్వరరావు 8.95 అలవాల భావన శ్రీ 8.70 ఎస్ జి పి ఏ లు సాధించారు.సివిల్ ఇంజనీరింగ్ విభాగం నుండి పులిందల శృతి 8.55, సయ్యద్ రాహుల్ 7.25,ఎస్ జి పి ఏ లు సాధించారు.మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం నుండి నలి లోకేష్ 7.15 ఎస్ జి పి ఏ లు సాధించారు.ఈ అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శ్రీ చలసాని సాంబశివరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి. ఉదయ్ కిరణ్ భార్గవ్, ఐ క్యు ఎ సి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. వి. రామచంద్ర రావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎల్. సాయి ఇంద్రసేనారెడ్డి, వివిధ విభాగాలు అధిపతులు, అధ్యాపకులు మరియు బోధ నేతర సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

## మహమ్మదాబాద్ ఇంటర్ పరీక్ష కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 25 ( ప్రజా జ్యోతి బ్యూరో ) మహమ్మదాబాద్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ ఏర్పాట్లు, హాల్ టికెట్ తనిఖీ




విధానం, సీసీ కెమెరాల పనితీరు, విద్యార్థులకు కల్పించిన మౌలిక వసతులను స్వయంగా పరిశీలించారు. పరీక్షల సందర్భంగా అవకతవకలు, కాపీయింగ్ వంటి ఘటనలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాల్సిందిగా సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, విద్యుత్, శానిటేషన్ వంటి సౌకర్యాలను సమృద్ధిగా కల్పించాలని తెలిపారు. భద్రతా చర్యలను కచ్చితంగా అమలు చేయాలని, పర్యవేక్షణలో నిర్లక్ష్యం సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు.

## తెలంగాణ ఎప్‌సెట్ పరీక్షపై కన్వీనర్‌తో టి-సాట్ స్పెషల్ లైవ్

హైదరాబాద్,ఫిబ్రవరి25(ప్రజాజ్యోతి): మే నెలలో నిర్వహించే ఎప్ సెట్ పోటీ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేసేందుకు టి-సాట్ నెట్వర్క్ ఈ నెల 26వ తేది గురువారం రోజు ప్రత్యేక లైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. లైవ్ కార్యక్రమంలో తెలంగాణ ఎప్ సెట్ కన్వీనర్ కె.విజయ్ కుమార్ రెడ్డి పాల్గొని విద్యార్థినీ, విద్యార్థులకు పలు సలహాలు-సూచనలు అందించనున్నారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఇంజనీరింగ్, అగ్రికల్చర్, కోర్సులలో చేరేందుకు తెలంగాణ ప్రభుత్వం కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ మే 13, 14 తేదిల్లో నిర్వహించనుంది. కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు తోడ్పాటుగా టి-సాట్ నెట్వర్క్ ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. టి-సాట్ నిపుణ ఛానల్ లో ఉదయం 11 నుండి 12 గంటల వరకు జరిగే లైవ్ కార్యక్రమంలో పాల్గొనే కన్వీనర్ విజయ్ కుమార్ విద్యార్థుల సందేహాలకు సమాధానం ఇవ్వడంతో పాటు సలహాలు అందించనున్నారు. ఎప్ సెట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు వారి తల్లిదండ్రులు 040-23556037, 23553473 టోల్ ఫ్రీ నెం.1800 425 4038 నెంబర్లకు కాల్ చేయాలని టి-సాట్ నెట్వర్క్ కోరింది. ఇప్పటికే ఎప్ సెట్ పరీక్ష కోసం టి-సాట్ నెట్వర్క్ నాలుగు గంటల పాఠ్యాంశాల ప్రసారాలను కొనసాగిస్తున్న విషయం పాఠకులకు విదితమే. తెలంగాణ విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్ష మరియు పోలీసు శాఖలో భాగమైన ఉమెన్ సేఫ్టీ వింగ్ సంయుక్తంగా 'చైల్డ్ సేఫ్టీ' పేరుతో గురువారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక ప్రత్యక్ష కార్యక్రమం కొనసాగనుంది. పిల్లల రక్షణ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, పిల్లలకు ఇబ్బందులు ఎదురైతే ఎవరిని సంప్రదించాలి, విద్యార్థి దశలో ఎటువంటి విషయాల జోలికి వెళ్లకూడదు అనే తదితర ప్రధాన అంశాలపై విద్యార్థులను చైతన్య పరిచే కార్యక్రమం టి-సాట్ విద్య ఛానల్ లో ఉదయం 11 నుండి 12 గంటల వరకు ప్రసారమౌతుంది. విద్యార్థినీ, విద్యార్థులు తమ సందేహాలు-సమాధానాల కోసం 040-2354 0326, 2354 0726 టోల్ ఫ్రీ నెం.1800 425, 4039 నెంబర్లకు కాల్ చేయాలి. టి-సాట్ నెట్వర్క్ ఈ మేరకు సూచించింది.

## ఉగ్రవాదంపై పోరులో ఇజ్రాయెల్‌కు పూర్తి అండ



మొదటిపేజీ తరువాయి..

ఉన్నాం. ఉగ్రవాదంతో దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్నాం. ఉగ్రవాదానికి భారత్ పూర్తి వ్యతిరేకం. శాంతిస్థాపన అనేది అంత సులువైన విషయం కాదు. ఉనికి కోసం యూదులు అనేక కష్టాలు పడ్డారు'.. ఇజ్రాయెల్‌ను గుర్తించిన 1950లోనే నేనూ జన్మించా. ఇజ్రాయెల్‌తో భారత్‌కు చరిత్రాత్మక సంబంధాలు ఉన్నాయి. ఇజ్రాయెల్ పౌరులను హమాస్ చంపడం దారుణం. ఇజ్రాయెల్ పౌరుల హత్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ సమర్థించం. పాలస్తీనా సమస్యలపై స్పందించాల్సిన సమయం వచ్చింది. ఉగ్రవాదం విషయంలో ద్వంద్వ వైఖరి వీడాలి. భారత్ ఎప్పుడూ చర్చలు, శాంతినే కోరుకుంటుంది' అని అన్నారు. ఇజ్రాయెల్ పర్యటనలో ఉన్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆ దేశ పార్లమెంటులో ఘనస్వాగతం లభించింది. ఇజ్రాయెల్ పార్లమెంటు 'నెస్సెట్'ను ఉద్దేశించి మోదీ బుధవారంనాడు ప్రసంగించారు. పార్లమెంటు హాలులోకి మోదీ ప్రవేశించగానే సభ్యులంతా లేచి నిలబడి కరతాళ ధ్వనులతో మోదీకి స్వాగతం పలికారు. 'మోదీ... మోదీ' నినాదాలు హోరెత్తించారు. సాధారణంగా అమెరికా అధ్యక్షుడు వంటి అత్యంత కీలక మిత్రదేశాల అధినేతలకు మాత్రమే దక్కే ఈ అరుదైన గౌరవం భారత ప్రధానికి దక్కడం విశేషం. నెస్సెట్ స్పీకర్ అమిర్ ఒహానా మాట్లాడుతూ, నెస్సెట్ స్పీకర్‌గా సభలో ప్రసంగించనున్న తొలి ప్రధానిని ఆహ్వానించే అవకాశం దొరకడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. 'థాంక్యూ ప్రైమ్ మినిస్టర్ మోదీ' అంటూ హర్షాతిరేకం వ్యక్తం చేశారు.

## ఎప్‌స్టీన్‌ను కలవడం తప్పే!!

మొదటిపేజీ తరువాయి..

గతంలో తనకున్న సంబంధాలపై స్పందిస్తూ గేట్స్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తన దాతృత్వ సంస్థ 'బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్' ఉద్యోగులతో నిర్వహించిన ఒక ప్రత్యేక భేటీ సందర్భంగా.. ఈ అంశంపై బహిరంగంగా క్షమాపణలు చెప్పారు.



ఎప్‌స్టీన్‌తో సమయం గడపడం తన జీవితంలో చేసిన అతిపెద్ద తప్పు అని ఆయన అంగీకరించారు. అలాగే రష్యన్ అమ్మాయిలతో సంబంధాలున్నాయంటూ తనపై వస్తోన్న ఆరోపణలపైనా గేట్స్ స్పష్టతనిచ్చారు. ఈ సమావేశంలో గేట్స్ తన తప్పును ఒప్పుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారని వాల్ స్ట్రీట్ జర్నల్ తన కథనంలో రాసుకొచ్చింది. ఇక.. ఎప్‌స్టీన్‌తో తన సంబంధాలపై గేట్స్ ప్రస్తావిస్తూ.. 2011-14 మధ్య కాలంలో ఎప్‌స్టీన్‌ను పలుమార్లు కలిసినట్టు అంగీకరించారు. అయితే.. ఆ సమయంలో అతడికున్న క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ గురించి అంత లోతుగా తనకు తెలియదన్నారు. తన మాజీ భార్య మెలిండా గేట్స్ మొదటి నుంచీ ఎప్‌స్టీన్ విషయంలో తనను హెచ్చరించిందని.. ఆ విషయంలో మెలిండాకు క్రెడిట్ ఇవ్వాల్సిందేనని పేర్కొన్నారు గేట్స్. ప్రస్తుతం జరుగుతున్న చర్చలను బట్టిచూస్తే.. నాడు తాను చేసిన పొరపాటు నేడు వందల రెట్లు పెద్దదిగా కనిపిస్తోందని ఆయన ఆవేదన చెందారు. 'ఎప్‌స్టీన్‌తో సమయం గడపడం నాడు నేను చేసిన అతిపెద్ద తప్పు. గేట్స్ ఫౌండేషన్ కార్య నిర్వాహకులను అతడి సమావేశాలకు తీసుకురావడమూ తప్పే. నా పొరపాటు వల్ల ఈ వివాదంలో ఇరుక్కున్న ప్రతి ఒక్కరికీ నేను క్షమాపణలు చెబుతున్నాను. మా ఫౌండేషన్ విలువలకు, లక్ష్యాలకు ఇది పూర్తిగా విరుద్ధం' అని గేట్స్ చెప్పినట్టు తెలిపింది. ఫౌండేషన్ ప్రతిష్ఠ చాలా సున్నితమైనదని.. ఇలాంటి సంఘటనలు తమతో కలిసి పనిచేసే ప్రజల నిర్ణయంపై తీవ్ర ప్రభావం చూపుతాయని టెక్ దిగ్గజం ఆందోళన వ్యక్తం చేశారని అందులో పేర్కొంది. అమెరికా న్యాయ శాఖ ఇటీవల విడుదల చేసిన పత్రాల్లో.. ఎప్‌స్టీన్ రాసిన కొన్ని ఇ-మెయిల్ డ్రాఫ్టులు వెలుగులోకి వచ్చాయి. అందులో బిల్ గేట్స్‌కు డ్రగ్స్ సరఫరా చేయడం సహా రష్యన్ అమ్మాయిలతో సంబంధాలు ఏర్పాటు చేసేందుకు తాను సహకరించానని ఎప్‌స్టీన్ పేర్కొన్నాడు. ఈ ఆరోపణలను నాటి నుంచీ గేట్స్ ఖండిస్తూనే ఉన్నారు. తాను ఎలాంటి చట్టవిరుద్ధమైన పనులు చేయలేదని స్పష్టం చేశారు. ఆ ఫొటోల్లో తన పక్కన ఉన్న మహిళలు ఎప్‌స్టీన్ సహాయకులు మాత్రమేనని.. కావాలనే వారి ముఖాలకు మాస్క్ వేశారన్నారు. అలాగే ఎప్‌స్టీన్ వేధింపులకు గురైన బాధితులతో తాను ఏనాడూ సమయం కేటాయించలేదని గేట్స్ చెప్పుకొచ్చారు.

## తెలంగాణలో ఇంటర్ పరీక్షలు ప్రారంభం

మొదటిపేజీ తరువాయి..

అనుమతిస్తున్నారు. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లను పరీక్షకు అనుమతిస్తారు. హాల్‌టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా ఎంట్రీ ఉంటుంది. ఒక్క హాల్‌టికెట్ వెంట ఉంటే సరిపోతుంది. ఎలాంటి గుర్తింపు పత్రాలు అవసరంలేదు. ఊజాగా సమాధాన పత్రాల మూల్యాంకనం షెడ్యూల్‌ను ఇంటర్‌బోర్డు ప్రకటించింది. మార్చి 4 నుంచి సంస్కృతం పేపర్ల మూల్యాంకనం ప్రారంభమవుతుంది. మార్చి 15నుంచి మొదటి విడత, మార్చి 18నుంచి రెండో విడత, మార్చి 20 నుంచి మూడో విడత మూల్యాంకనం ప్రారంభమవుతుంది. ఏప్రిల్ రెండో వారంలో ఫలితాలు విడుదల చేస్తారు. ఎగ్జామ్ సెంటర్‌కు ఆలస్యంగా రావడంతో ఇంటర్ విద్యార్థినిని పరీక్ష



రాసేందుకు అనుమతించలేదు. తన తండ్రి డ్రాప్ చేస్తాడేమోనని ఎదురుచూసి చూసి, చివరకు ఆర్టీసీ బస్సులో రావడంతో ఎగ్జామినేషన్ సెంటర్‌కు 17 నిమిషాలు ఆలస్యంగా చేరుకుంది. ఈ క్రమంలో అధికారులు పరీక్షకు అనుమతించకపోవడంతో.. సెంటర్ గేటు వద్దనే విద్యార్థిని కన్నీళ్లు పెట్టుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా గొల్లపల్లికి చెందిన పిట్ల శరణ్య గొల్లపల్లి-బొప్పాపూర్ రాచర్ల జూనియర్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. బుధవారం ఇంటర్ ఫస్టియర్ ఎగ్జామ్స్ ప్రారంభం కావడంతో తన తండ్రి ఎగ్జామ్ సెంటర్ ఎల్లారెడ్డిపేటలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ దగ్గర దించుతానని చెప్పాడు. అయితే, పని చూసుకుని టైమ్ వరకు వస్తానని వెళ్లిన తండ్రి ఎంత సేపటికీ రాకపోవడంతో.. ఎగ్జామ్‌కు లేటవుతుందని గాబరాగాబరాగా బస్టాండ్‌కు వెళ్లింది. అక్కడ ఆర్టీసీ బస్సు ఎక్కి ఎగ్జామినేషన్ సెంటర్‌కు చేరుకుంది. కానీ అప్పటికే 9.05 గంటలు దాటిపోవడంతో అధికారులు శరణ్యను ఎగ్జామ్ సెంటర్2లోనికి అనుమతించలేదు. దీనిపై శరణ్య కాలేజీ సిబ్బందిని, ఉన్నతాధికారులను సంప్రదించింది. ఈ క్రమంలో తహశీల్దార్ సుజాత ఎగ్జామ్ సెంటర్‌కు చేరుకుని, సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ క్రమంలో శరణ్య 17 నిమిషాలు ఆలస్యంగా ఎగ్జామ్ సెంటర్ వద్దకు వచ్చినట్లుగా అధికారులు నిర్ధారించారు. దీంతో ఆమెను పరీక్షకు అనుమతించలేదు. తమ భవిష్యత్‌కు సంబంధించిన పరీక్షలు రాసేటప్పుడు కచ్చితంగా సమయపాలన పాటించాలని తహశీల్దార్ సూచించారు.

## మీడియా అకాడమీ చైర్మన్‌గా శ్రీనివాసరెడ్డి పదవీకాలం పొడిగింపు

మొదటిపేజీ తరువాయి..

తిరిగి శ్రీనివాసరెడ్డికే అవకాశం ఇచ్చింది. ఈ క్రమంలో మరో రెండేళ్లపాటు ఆయన పదవిలో



కొనసాగనున్నారు. తన పదవీకాలం పొడిగించినందుకు ఆయన సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

## సొంత భవనాల్లో రెవెన్యూ కార్యాలయాలు

మొదటిపేజీ తరువాయి..

కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సచివాలయంలోని తన కార్యాలయంలో బుధవారం రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి పొంగులేటి అ÷-దదె భవనాల్లో కొనసాగుతున్న తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల గురించి ఆరా తీశారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను ఆధునికీకరించి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. మొదటి దశలో.. అద్దె భవనాల్లో కొనసాగుతున్న 60 తహసీల్దార్ కార్యాలయాలు, 5 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. రెండో విడతలో.. శిథిలావస్థలో ఉన్న 170 ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలను నిర్మిస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండేట్లు డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రితో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామని వివరించారు.

## రాష్ట్రంలో అదుపుతప్పిన శాంతిభద్రతలు

హైదరాబాద్,ఫిబ్రవరి25(ప్రజాజ్యోతి): తెలంగాణలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని, హిందువులు లక్ష్యంగా దాడులు పెరిగాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు అన్నారు. కామారెడ్డి ఘటనలో కాంగ్రెస్ గూండాగిరి బయటపడిందన్నారు. ఈ మేరకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డిని రామచంద్రరావు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా కామారెడ్డి, నిమాజాబాద్ జిల్లాల్లో జరిగిన ఘటనలపై డీజీపీకి ఫిర్యాదు చేశారు. అనంతరం రామచంద్రరావు మీడియాతో మాట్లాడుతూ.. కొన్నిరోజుల క్రితం బాన్సువాడలో ఎంఐఎం నేతలు ఆందోళనలు సృష్టించారని తెలిపారు. ఈ ఘటనపై నిరసన తెలిపిన హిందూ యువకులను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. దాదాపు 27 మంది హిందూ యువకులను జైలుకు పంపారని తెలిపారు. హిందూ కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని రామచంద్రరావు మండిపడ్డారు. కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి క్యాంప్ ఆఫీసుపై కాంగ్రెస్ నేతలు దాడి చేసేందుకు యత్నించారని ఆయన అన్నారు. నిజామాబాద్‌లో అడ్వకేట్ కళ్యాణిపై ఎంఐఎం నేతలు దాడి చేశారని ఆరోపించారు. 'నామ్ కే వాస్తే' దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నారని రామచంద్రరావు మండిపడ్డారు. హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నాయని రామచంద్రరావు తెలిపారు. చాంద్రాయణ గుట్ట, ముత్యాలమ్మ గుడి, సికింద్రాబాద్‌లో హిందూ ఆలయాలపై దాడులు జరిగాయని పేర్కొన్నారు. వీటిని ప్రోత్సహిస్తున్నది కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం వద్దే హోం శాఖ ఉందని.. తెలంగాణలో మరీ ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో శాంతి భద్రతలు దెబ్బతిన్నాయని ఆయన విమర్శలు గుప్పించారు. పోలీసులు అరెస్ట్ చేసిన హిందూ యువకులను వెంటనే విడుదల చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని రామచంద్రరావు డిమాండ్ చేశారు.






Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967